ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 04.06.2026 | సంపుటి : 12 సంచిక : 315 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# మట్టిమనుషుల పోరుకు ఏడాది

## 'కాలుష్య భూతాన్ని' కలిసికట్టుగా తరిమికొట్టిన పల్లెలు

## ముందే పసిగట్టి ప్రజల్ని చైతన్యం బాటపట్టించిన 'జనంసాక్షి'

- 12 గ్రామాల ఉద్యమం ముందు తోకముడిచిన యాజమాన్యం
- బెదిరింపులు, కేసులకు ఏమాత్రం వెరవని రైతులు, మహిళలు
- నేటికీ కొనసాగుతున్న కేసులు ఎత్తివేయాలని అన్నదాతల డిమాండ్

చిన్నగా మొదలైన ప్రజల నిరసన ఓ పెద్ద పోరాటానికి వేదికగా మారింది. విషం చిమ్మే మహమ్మారి పట్ల ఊరూవాడా ఏకమైంది. ఒకట్రెండు గ్రామాల నుంచి ఏకంగా చుట్టుపక్క పల్లెలన్నీ చైతన్యమై ఓ భారీ ఉద్యమానికి సిద్ధమయ్యాయి. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడలో ఏర్పాటు చేయాలనుకున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా వేలాది గళాలు వినిపించాయి. పోరాటమే శరణ్యంగా భావించిన పల్లె జనం.. 'సోషల్' వేదికగా ఇథనాల్ ఫ్యాక్టరీ పోరాట సమితి కమిటీ ఏర్పాటుచేసి ఉద్యమాన్ని ఉధృతం చేసింది. ఫలితంగా పది నెలల సుదీర్ఘ పోరాటానికి జంకిన ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం తోకముడవక తప్పలేదు. ఇథనాల్ ఫ్యాక్టరీపై పెల్లుబికిన పల్లె ప్రజల ప్రజాగ్రహానికి నేటితో ఏడాదికానున్న సందర్భంగా 'జనంసాక్షి' కథనమిదీ..!!




ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన సందర్భంగా 'జనంసాక్షి' ప్రచురించిన కథనం

↓ ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల ఏర్పడే దుష్ప్రభావాలపై వివరణ ఇస్తూ 'జనంసాక్షి' ప్రచురించిన కథనాలు ↓







**రాజోలి, జూన్ 3 (జనంసాక్షి) :** పచ్చని పంట పొలాలు, తుంగభద్ర నదీ తీర ప్రాంతం కలుషితం కాకుండా 12 గ్రామాల ప్రజలు చేపట్టిన చారిత్రక పోరాటం విజయం సాధించింది. ఏడాది కాలంగా సాగిన ప్రజా ఉద్యమం ఫలితంగా, స్థానికంగా ఇథనాల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని చూసిన 'గాయత్రి రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్' సంస్థ తన అడుగు వెనక్కి వేయక తప్పలేదు. కంపెనీ తన ప్రతిపాదిత ప్లాంట్‌ను నెల్లూరు జిల్లాలోని ప్రత్యేక ఆర్థిక మండలికి (సెజ్) తరలించింది. పెద్ద జన్వాడ శివారులో పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతులు నెలల పాటు శాంతియుతంగా నిరసనలు, నిరాహార దీక్షలు చేశారు. అయితే, జూన్ 3, 2025న ప్రజాప్రతినిధుల హామీలను విస్మరించి, రాత్రికి రాత్రే నిర్మాణం చేపట్టడంతో పరిస్థితి మిగతా 2లో..

### రైతుల ప్రధాన డిమాండ్లు

- 42 మంది రైతులపై ఉన్న అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలి.
- ప్రతినెలా పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలనే నిబంధనను తక్షణమే రద్దు చేయాలి.
- జనంసాక్షి ఎడిటర్ ఎంఎం రహమాన్, జైలర్ నాగరాజుపై బనాయించిన కేసులను ఎత్తివేయాలి.
- భవిష్యత్తులో పరిశ్రమల ఏర్పాటుకు ముందు పారదర్శకమైన గ్రామసభలు నిర్వహించాలి.
- 'న్యాయం గెలిచే వరకు, కేసులు ఎత్తేసే వరకు పోరాటం కొనసాగుతుంది' అని గ్రామస్తులు ముక్తకంఠంతో హెచ్చరిస్తున్నారు.

# కర్నాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

- ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్
- మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం
- సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు
- హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్, సీఎం రేవంత్



**బెంగళూరు(జనంసాక్షి):** కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మిగతా 2లో..

### పెంచిన మార్కెట్ విలువలు



# జూన్ 5 నుంచి అమల్లోకి

**తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్ల రేట్ల సవరణ : మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ప్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ప్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్‌ఎండిఎ, క్యూర్ ఇతర మిగతా 2లో..

### టెక్నాలజీ తదితర రంగాల్లో

# పరస్పర సహకారం

**తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం**

- ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు
- ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు
- యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణనిచ్చేందుకు మేం సిద్ధం
- తురింగియా సీఎం మారియో వోయిట్



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైనెన్స్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్ వాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా మిగతా 2లో..



# తెలంగాణ రైజింగ్ కాదు.. ఫాలింగ్

- వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్ర చేస్తా
- కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను
- తెలంగాణ అప్పులపై చర్చకు సిద్ధమే
- మీట్‌ద ప్రెస్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని మిగతా 2లో..

## మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకోం

- రాష్ట్ర ఏర్పాటుతో 11 రోజులు అన్నం తినలేదన్నావ్
- మా ఇంటికి వస్తే సోదరుడిగా ఆదరిస్తా..బిర్యానీ పెడతా
- కానీ ఇక్కడ రాజకీయాలు చేస్తామంటే కుదరదు
- పవన్ కళ్యాణ్‌కు కేటీఆర్ ఘాటు హెచ్చరిక

2లో..

## తెలంగాణ భూమిపుత్రులే పోటీ చేస్తామంటే అభ్యంతరమేంటి? : పవన్ కళ్యాణ్

2లో




**తెలంగాణలో ఇన్ సర్వీస్ టీచర్లకు**

## ప్రత్యేక టెట్

**రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో సర్వీస్‌లో ఉన్న టీచర్లకు గుడ్‌న్యూస్! ఇకపై ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా రెండు సాధారణ టెట్‌లకు అదనంగా మరో రెండు ప్రత్యేక టెట్‌లు నిర్వహించ నున్నట్లు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక టెట్‌ల నిర్వహణకు మిగతా 2లో..

# ఇటు చర్చలు.. అటు దాడులు



**అమెరికా,ఇరాన్ పరస్పర ఘర్షణలు**

- ఇరాన్ సైనిక స్థావరాలపై యూఎస్ దాడులు
- అమెరికా స్థావరాలే లక్ష్యంగా విరుచుకుడిన ఇరాన్
- కువైట్ ఎయిర్‌పోర్ట్‌పై టెహ్రాన్ దాడిలో భారతీయుడి మృతి

**టెహ్రాన్(జనంసాక్షి):** డ్రోన్‌లు, క్షిపణులతో పశ్చిమాసియా మళ్లీ దద్దరిల్లింది. ఓవైపు శాంతి చర్చలు జరుగుతుండగానే.. అమెరికా- ఇరాన్ పరస్పర దాడులకు దిగాయి. కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ విరుచుకుపడింది. దీనికి ముందు ఖేష్మ్ ద్వీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై యూఎస్ దాడులు చేసింది. కువైట్‌లోని అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్‌లోని ఈసా వైమానిక స్థావరాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. కువైట్ వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజామున పెద్దఎత్తున మిగతా 2లో..

**తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు**

## కేంద్ర కేబినెట్ ఆమోదం



2లో..



# ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

**హోటల్‌లో మంటలు చెలరేగి 21 మంది మృతి పలువురికి గాయాలు**

**ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మాలవీయ నగర్‌లోని ఫ్లరిష్ స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో మంటలు చెలరేగిన ఘటనలో 21 మంది మృతి చెందారు. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదం నుంచి పలువురిని కాపాడగా, మరికొంతమంది చిక్కుకొని ఉంటారని సమాచారం. హౌజ్‌రానీ మిగతా 9లో..

# తెలంగాణ రైజింగ్ కాదు.. ఫాలింగ్

చూస్తున్నానని చమత్క రించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణ యిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్‌లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని.. పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా.. దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ ఈ మేరకు స్పందించారు.నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్షరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడుపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేడయంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ.29వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని తెలిపారు. నెలకు రూ.6వేల కోట్ల అప్పు తీరుస్తాన్నమనేది అబద్ధమని స్పష్టం చేశారు. రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు.

# మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకోం

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక ప్రాంత్రీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని.. తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి.. ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

## తెలంగాణ భూమిపుత్రులే పోటీ చేస్తామంటే అభ్యంతరమేంటి?

అమరావతి(జనంసాక్షి):పొట్టి శ్రీరాములు త్యాగం వల్లనే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని.. అలాంటి మహానాయకులను కులచట్రాల్లో బిగించడం రాజకీయాల్లో అలవాటుగా మారిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతిలో పర్యటించిన ఆయన.. అక్కడి 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు."తెలంగాణలో ఇంకా తెలంగాణ భావోద్వేగం ఉంది. ఏపీలో అలాంటి భావోద్వేగం లేదు. ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన మహానుభావుడిని కులానికి పరిమితం చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక కులదూషణ పెరిగింది. నిరుద్యోగం, అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కులాల కుంపట్లు పెరిగాయి. ఈ వాతావరణాన్ని అడ్డుకునేందుకే సేనాగళం పేరుతో కమిటీ ఏర్పాటు చేశాం. ఇందులో అన్ని వర్గాల నాయకులు ఉంటారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడి కులం వెనుక దాక్కొనే సంస్కృతి వద్దని అన్నారు.



ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా 'జనంసాక్షి' ప్రచురించిన కథనం

# మట్టి మనుషుల పోరుకు ఏడాది

ఉద్రిక్తతకు దారితీ సింది. మరుసటి రోజు నిరసన తెలుపుతున్న రైతులపై గుండాల దాడి జరగడం, అందులో మరియమ్మ అనే రైతు మహిళ తీవ్రంగా గాయపడటం ఉద్రిక్తతను పతాక స్థాయికి చేర్చింది. దీంతో ఆగ్రహించిన రైతులు కం టైనర్‌ను తగులబెట్టారు. ఈ సంఘటనను ఆసరాగా చేసుకుని పోలీసులు 42 మంది రైతులపై అక్రమ కేసులు బనాయించారు.

**పత్రికా స్వేచ్ఛకు అడ్డంకులు**

ఈ పోరాటంలో 'జనంసాక్షి' దినపత్రిక ప్రజలకు అండగా నిలిచింది. కాలుష్య పరిశ్రమ వల్ల రాబోయే విపత్తులను విచారణాత్మక కథనాల ద్వారా ఎండగట్టింది. రైతాంగం గళాన్ని రాష్ట్రవ్యాప్తం చేసింది. అయితే, నిజాలను నిర్భయంగా రాసినందుకు 'జనంసాక్షి' సంపాదకుడు ఎంఎం రహమాన్‌పై ఏ2గా కేసు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా స్థానికులు భావిస్తున్నారు. అలాగే, డిప్యూటీ జైలర్ నాగరాజుపైనా కేసులు బనాయించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్యాక్టరీని తరలించినప్పటికీ, తమపై మోపిన అక్రమ కేసులు తొలగించకపోవడంపై 12 గ్రామాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేస్తున్నారు.



# కర్నాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**డికె ప్రమాణంలో రేవంత్**

కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివ కుమార్ ప్రాణ స్వీకారోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. పలువురు కాంగ్రెస్ పాలిత సిఎంలు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేంవత్‌ను డికె ఆలింగనం చేసుకుని తన అభిమానం చాటుకున్నారు.డి.కె.శివ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి సతీషన్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలు పాల్గొన్నారు. కొత్త సిఎం డికెకు రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

# టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలిం చవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే,



ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# తెలంగాణలో ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్

అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. గతేడాది సాధారణ టెట్(ఎః ఎః 2025)లో భాగంగానే ఇన్‌సర్వీస్ టీచర్లకూ ఈ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఏడాదికి రెండుసార్లు ప్రత్యేక టెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంపై టీఎస్ యూటీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ప్రత్యేక టెట్ నిర్వహించాలని తమతో పాటు పలు సంఘాలు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మాత్రం కొన్ని సంఘాల పేర్లు మాత్రమే పేర్కొనడం భావ్యం కాదని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

దిల్లీ(జనంసాక్షి): కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. తెలంగాణ, ఒడిశా, బిహార్ రాష్ట్రాల్లో జాతీయ రహదారుల విస్తరణ, కొత్త రహదారుల నిర్మాణానికి ఆమోద ముద్ర వేసింది. తెలంగాణలో ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల హైవే (ఎన్‌హెచ్ 63) విస్తరణకు ఆమోదం తెలిపింది. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో విస్తరణకు అంగీకారం చెప్పింది. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 563) విస్తరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బీవోటీ పద్ధతిలో విస్తరించనున్నట్లు చెప్పింది. రూ.7,597 కోట్లతో 190 కిలోమీటర్ల మేర రెండు జాతీయ రహదారులను 4 వరుసలుగా విస్తరించనున్నారు.

# పెంచిన మార్కెట్ విలువలు జూన్ 5నుంచి అమల్లోకి

ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ప్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఎ÷-లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాంఅని మంత్రి తెలిపారు.

# ఇటు చర్చలు.. అటు దాడులు

పేలుడు శబ్దాలు వినిపించాయి. దీంతో ఆ దేశ వైమానిక రక్షణ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. ఇరాన్ నుంచి దూసుకొచ్చిన క్షిపణులు, డ్రోన్లను తమ డిఫెన్స్ వ్యవస్థలు అడ్డుకుంటున్నాయని కువైట్ ఆర్మీ జనరల్ స్టాఫ్ పేర్కొన్నారు. మరోవైపు బహ్రెయిన్‌లో కూడా సైరన్‌లు మోగాయి. దీంతో సైన్యం రంగంలోకి దిగింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది.ఖేష్మ్ ద్వీపంపై దాడికి ప్రతిస్పందనగానే.. తాము అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నామని ఐఆర్‌జీసీ పేర్కొంది. శత్రు దురాక్రమణలకు.. భిన్నమైన, మరింత తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించింది. ఇరాన్ ప్రజలను, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు శత్రువుల స్థావరాలను, ప్రయోజనాలను బూడిద చేసేందుకు సైతం తాము వెనుకాడబోమని పేర్కొంది. ఇక, బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీ ప్రధాన కార్యాలయం పైనా, ఆ ప్రాంతంలోని మరో అమెరికా వైమానిక స్థావరం పైనా క్షిపణులు, డ్రోన్‌లతో విజయవంతంగా దాడి చేశామని ఐఆర్‌జీసీ ప్రకటించింది. అయితే, యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఐఆర్‌జీసీ అబద్ధాలు ప్రచారం చేస్తోందని తెలిపింది. అమెరికన్ బలగాలపై ఇరాన్ జరిపిన దాడులన్నీ విఫలమయ్యాయని పేర్కొంది. దాని దురాక్రమణలను తిప్పికొట్టేందుకు తమ బలగాలు అప్రమత్తంగా ఉన్నాయని తెలిపింది. ఆత్మరక్షణ కోసమే.. ఖేష్మ్ ద్వీపంపై దాడులు చేశామని పేర్కొంది.


**కువైట్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడిలో భారతీయుడి మృతి**

కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై బుధవారం ఇరాన్ చేసిన డ్రోన్ దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడుఈ విషయాన్ని కువైట్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. మృతుని కుటుంబంతో సంప్రదింపులు జరుపుతున్నామని.. వారికి అవసరమైన సాయం అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది. కాగా అతడు ఏ రాష్ట్రానికి చెందిన వాడనే విషయం తెలియరాలేదు. దాడి ఘటనలో 63మంది గాయపడినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. క్షతగాత్రుల్లో సిబ్బంది, ప్రయాణికులు ఉన్నట్లు తెలిపారు. ఇరాన్‌లోని గెరుక్, ఖేష్మ్ ద్వీపంపై అమెరికా చేపట్టిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. కువైట్, బహ్రెయిన్‌లోని అనేక స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతిన్నట్లు కువైట్ జనరల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ తెలిపింది. దీంతో ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ప్రకటించి.. విమానాల రాకపోకలను నిలిపివేసినట్లు పేర్కొంది. అంతర్జాతీయ విమానాశ్రయానికి రానున్న పలు విమానాలను ఇతర ప్రాంతాలకు మళ్లించినట్టు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో దేశీయ విమానయాన సంస్థ ఇండిగో కువైట్‌కు సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

# భారత్‌పై మరో బాదుడు

## 12.5శాతం అదనపు సుంకాలకు అమెరికా ప్రతిపాదన

**వాషింగ్టన్(జనంసాక్షి):** భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా మరోసారి సుంకాలతో విరుచుకుపడేందుకు సిద్ధమైంది. వెట్టిచాకిరీ నిర్మూలనలో విఫలమైనందుకు గానూ ఆ దేశాలపై అదనపు సుంకాలు విధించాలని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ ప్రతిపాదించింది. భారత్‌తో పాటు మొత్తంగా 60 దేశాలపై ఈ సుంకాలు విధించాలని ప్రతిపాదనలు చేసింది. ఇందులో అత్యధిక దేశాలపై 12.5శాతం, మిగతా వాటిపై 10శాతం సుంకం విధించాలని సూచించింది."వెట్టిచాకిరీ చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతులపై నిషేధం విధించి, వాటిని అమలుచేయడంలో పలు దేశాలు విఫలమయ్యాయి. మా వాణిజ్య భాగస్వామ్య దేశాలు కూడా దీనిని అరికట్టలేకపోవడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. వెట్టిచాకిరీ కారణంగా అంతర్జాతీయ లేబర్ మార్కెట్లో అమెరికా కార్మికులకు తీవ్ర పోటీ ఎదురవుతోంది. అసమానతలను మేం ఇక



సహించలేం" అని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జెమిసన్ గ్రీర్ ఓ ప్రకటనలో వెల్లడించారు.ఈ ఆరోపణలకు సంబంధించి మొత్తం 60 దేశాలపై యూఎస్‌టీఆర్ దర్యాప్తు జరిపింది. అనంతరం 54 దేశాలపై 12.5 శాతం అదనపు సుంకాలను ప్రతిపాదించింది. వీటిల్లో భారత్‌తో పాటు చైనా, జపాన్, బ్రెజిల్, ఆస్ట్రేలియా, యూకే, సౌదీ అరేబియా తదితర దేశాలున్నాయి. ఇక, కెనడా, ఈక్వెడార్, ఈయూ, ఇండోనేసియా, మెక్సికో, పాకిస్థాన్ దేశాలు నిషేధం విధించినప్పటికీ.. వాటిని సమర్థవంతంగా అమలు చేయలేకపోయాయని ఆరోపించింది. అందువల్ల ఆయా దేశాలపై 10శాతం అదనపు సుంకాలు విధించాలని ప్రతిపాదించింది. ఈ సుంకాలపై చర్చించేందుకు ఆయా దేశాలు జూన్ 22లోగా తమను సంప్రదించొచ్చని సూచించింది.

**అమెరికాతో సంప్రదింపులు కొనసాగుతున్నాయి..**

మరోవైపు, వెట్టిచాకిరీ అంశంలో అమెరికా విధించిన సుంకాలపై భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందించింది. సెక్షన్ 301 దర్యాప్తు విషయంలో అగ్రరాజ్యంతో సంప్రదింపులు జరుగుతున్నాయని వెల్లడించింది. అటు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అంశంపైనా సమాంతర చర్చలు జరుగుతున్నాయని వెల్లడించింది. సెక్షన్ 301 కింద ప్రతిపాదించిన సుంకాలు ఇంకా ఖరారు కాలేదని తెలిపింది. జూన్ 22 వరకు సంప్రదింపులకు అవకాశం ఉందని, జులై 6 వరకు లిఖితపూర్వకంగా అభిప్రాయాలు తెలియజెప్పేందుకు సమయం ఉందని పేర్కొంది. ఆపై తుది నిర్ణయం ఉంటుందని పేర్కొంది.


# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

**సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది.

# పాలమూరు ప్రాజెక్టుల దశ తిరిగేనా?

- మిషన్ మోడ్‌లో అవసరమైన నిధులు, అనుమతులు
- ప్యాకేజిల వారిగా పరిశీలించనున్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు. కాలువలు, రిజర్వాయిర్‌లు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనతో సాకారం కానున్న పాలమూరు ప్రాజెక్టులు






**మహబూబ్ నగర్ బ్యూరో, జూన్ 3 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు ప్రాజెక్టుల పర్యటన ఆద్యాతం ఆసక్తి నెలకొంది. నేటి నుంచి రెండు రోజుల పాటు పెండింగ్ పనులను పరిశీలించి సమీక్షించనున్న నేపథ్యంలో పాలమూరు ప్రాజెక్టుల కల సాకారంపై ఆసక్తి నెలకొంది. కరువు బారిన పడిన పాలమూరు.. ఇప్పటికైన సస్యశ్యామలమవుతోందని అన్నదాతలు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. కరువు పీడిత పాలమూరు ప్రాంతంలో నీటిపారుదల సామర్థ్యాన్ని గరిష్ఠ స్థాయికి పెంచి, లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో చేపట్టిన కీలక నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రధాన విధాన నిర్ణయాలు, మంజూరులు, భారీ నిధుల విడుదల చేసే అవకాశం ఉంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి చేసేందుకు భారీ ప్రోత్సాహం లభించనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులతో పాటు ప్రతిపాదిత ప్రాజెక్టులపై విస్తృత క్షేత్రస్థాయి సమీక్షకు ప్రణాళిక రూపొందించారు. ప్రాజెక్టులను పూర్తి చేయడానికి వ్యూహాత్మక దిశానిర్దేశం చేయవచ్చని, వాటి వేగవంతమైన అమలుకు నిధులు సమకూర్చనున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రాజెక్టుల పర్యటన చేయనున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలతో పాటు రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. సోమశిల వద్ద ప్రత్యేక ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టుల స్థితిగతులు, భూసేకరణ, అడ్డంకులపై ఇంజనీరింగ్ అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించనున్నారు. ఈ పర్యటన ద్వారా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను స్వయంగా తెలుసుకొని, నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు అందించేందుకు రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలనుకున్నారు. ఈ పర్యటన అనంతరం కీలక విధాన నిర్ణయాలు, కొత్త మంజూరులు, భారీ నిధుల విడుదలకు అవకాశం ఉందని జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు ముఖ్యమంత్రి స్వయంగా ప్రాజెక్టుల పరిశీలన చేయనుండడంతో ప్రాజెక్టుల వారిగా సవివర ప్రజెంటేషన్లు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రధాన ప్రాజెక్టులపై కొనసాగుతున్న పనులతో పాటు మిగిలి ఉన్న నిర్మాణాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై నివేదికలు సమర్పించనున్నారు. ప్రాజెక్టుల పురోగతి, సవాళ్లు, పూర్తి చేయాల్సిన పనులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను, తాజా పురోగతి నివేదికలను ముఖ్యమంత్రికి వివరించనున్నారు. ప్రాజెక్టుల వారిగా విస్తృత స్థాయిలో పరిశీలన చేపట్టనుండటం, నీటిపారుదల మౌలిక సదుపాయాలపై ఆరా తీయనుండటం, ప్రాజెక్టుల పూర్తి గడువులు, అవసరమయ్యే నిధులు, అమలును వేగవంతం చేసే చర్యలపై అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఆచరణ సాధ్యమైన ప్రతి సాగునీటి ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసి, సాగునీటి విస్తరణ లక్ష్యాలను సాధించేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారు.

నేటి మధ్యాహ్నం రెండు ప్రత్యేక హెలికాప్టర్‌లలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రాజెక్టులను పరిశీలించనున్నారు. కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ మొదలు, కృష్ణా, భీమా నదులు, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించనున్నారు. మక్తల్ దగ్గర నిర్మించనున్న రోడ్ కం బ్యారెజ్ పనులను ప్రారంభించనున్నారు. అనంతరం జూరాల ప్రాజెక్ట్, గూడెందొడ్డి దగ్గరకు చేరుకుని సాగునీటి విస్తరణ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన ప్రణాళిలపై ఇంజనీరింగ్ అధికారులో సమీక్షించనున్నారు. కృష్ణానది ఒడ్డున ఉన్న సోమశిలకు చేరుకుని ప్రాజెక్టులపై సమగ్రంగా సమీక్షించనున్నారు. రెండవ రోజు పుష్కర కాలంగా కొనసాగుతున్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను ప్యాకేజిల వారిగా పరిశీలించి సమీక్షించనున్నారు. హెడ్ రెగ్యులేటర్, నార్లాపూర్ రిజర్వాయర్, డెలివరీ సిస్టర్న్, పంప్‌హౌస్‌లను పరిశీలిస్తారు. అనంతరం కాలువ పనులతో పాటు ఏదుల, వట్టెం, కర్వెన, ఉదండపూర్ రిజర్వాయిర్‌లను, పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను సందర్శించి సమీక్షించనున్నందున, జిల్లాకు నిధుల వరద పారనుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బాలికపై లైంగికదాడికి యత్నం

- వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు
- కుషాయిగూడ పీఎస్ పరిధిలో ఘటన



**కాప్రా, జూన్ 3 (జనంసాక్షి) :** బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన 75 ఏళ్ల వృద్ధుడుపై పోక్సో కేసు నమోదైంది. ఈ సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముడికొండ లింగం (75) వృత్తిరీత్యా ఐరన్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటికి దగ్గరలో ఉంటున్న ఓ బాలిక (14) కిరాణ దుకాణానికి వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఐరన్ షాపు వద్దకు రాగానే వృద్ధుడు బాలికను పిలిచాడు. షెటర్‌లోకి వెళ్లగానే క్లోజ్ చేసి ఇంట్లోకి తీసుకెళ్లాడు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో గట్టిగా కేకలు వేసింది. విషయాన్ని గమనించిన స్థానికులు అమ్మాయి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆలోపు బాలిక కూడా ఇంటికి చేరుకోవడంతో ఆమె నుంచి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. గతంలో కూడా బాలికను ఎక్కడపడితే అక్కడ తాకేవాడని, బాధితురాలిని మభ్యపెట్టి లైంగికదాడికి యత్నించాడని తెలుస్తోంది. దీంతో బాలిక తల్లిదండ్రులు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వృద్ధుడిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## హైదరాబాద్‌లో మా ఇంటికి కూడా వెళ్లకూడదా?

- తెలంగాలో పోటీచేసేది అక్కడి భూమి పుత్రులే
- పవన్ కళ్యాణ్ మరోమారు స్పష్టీకరణ



**అమరావతి, జూన్3 (జనంసాక్షి) :** మా ఇల్లు ఉన్న తెలంగాణకు నేను వెళ్లకూడదా అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిలదీశారు. అమరావతిలో మాట్లాడిన సందర్భంలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ జనసేన నేతలు పోరుపెడితే అక్కడికి వెళ్లానని.. పుష్కర కాలం తర్వాత కూడా అంత ద్వేషం ఊహించలేదని జనసేన అధినేత వాపోయారు. తాను తెలంగాణ ప్రజలను ఉద్దేశించి చెడుగా మాట్లాడ లేదని, తెలంగాణ ముమ్మాటికీ ఆ ప్రాంత భూమిపుత్రులదేనని పవన్ స్పష్టం చేశారు. దేశంలో బతకడం మన హక్కు అని, కాలరాసే హక్కు ఎవరికీ లేదని చెప్పుకొచ్చారు. 2014 నుంచి 2024 వరకు ఎంతమంది తెలంగాణ కాంట్రాక్టర్లు ఏపీకి రాలేదని పవన్ ప్రశ్నించారు. కేటీఆర్ తనకు సోదరుడు లాంటివారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీ నుంచి వెళ్లి తెలంగాణలో ఎవరూ పోటీ చేయడం లేదని.. జనసేనలోని తెలంగాణ భూమిపుత్రులే అక్కడ పోటీ చేస్తామంటున్నారని -పవన్ కల్యాణ్ చెప్పారు. విభజించుకుంటూ వెళ్తే ఎక్కడికి వెళ్తామని, భూమికి సరిహద్దులు ఉంటాయని, మనసుకు ఉండవని పవన్ వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, తమిళనాడు వెళ్తే ఎక్కడా ఇబ్బందులు లేవని.. ఇదంతా సీఎం రేవంత్‌కు తెలిసి జరిగిందని అనుకోవడం లేదని పవన్ అభిప్రాయపడ్డారు. 'రాహుల్, ప్రియాంక వయనాడ్ వెళ్లి పోటీ చేయొచ్చా' అని పవన్ నిలదీశారు. దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఎవరూ వ్యవహరించొద్దని హితవు పలికారు.

## గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలి

- హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హన్మకొండ, ప్రతినిధి జూన్ 3 (జనం సాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10, 12 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుండి రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించే గ్రామ, వార్డు సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలకు వివరించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి కుటుంబం మొక్కలు నాటేలా చైతన్యం కల్పించాలని, రహదారుల వెంట పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని ఆదేశించారు. వనమహోత్సవం కార్యక్రమాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్పందించే రాష్ట్ర, కేంద్ర విపత్తు నిర్వహణ మరియు రెస్క్యూ బృందాలను సన్నద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. పోలీస్ శాఖ అధికారులు మండల, డివిజన్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ, వార్డు సభల్లో పాల్గొని ప్రజలకు ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, పిడుగుల సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈటీసీలో అదనపు కలెక్టర్ రవి, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, సిపిఓ, విద్యుత్తు, విద్య, సంబందిత శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఓ లు పాల్గొన్నారు.

## రేచిని రోడ్ భూమి స్వాధీనం

- పోలీసులతో కలిసి స్వాధీనం చేసుకున్న అధికారులు



**మంచిర్యాల, జూన్3 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో గల భూమిని బుధవారం రైల్వే అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారు జామున బెల్లంపల్లి రైల్వే ఇంజినీరింగ్ అధికారులు జేసీబీలు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, సివిల్ పోలీసులతో కలిసి పెద్ద ఎత్తున రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రైల్వే శాఖకు ఓ ప్రైవేటు సంస్థకు మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమి చుట్టూ గల హద్దులను, అందులోని కట్టడాలను తొలగించారు. నేషనల్ హైవేను ఆనుకొని నిర్మాణంలో ఉన్న ఓ కట్టడాన్ని సైతం కూల్చివేశారు. పెద్ద ఎత్తున రైల్వే అధికారులు, పోలీసులు, రైల్వే సిబ్బంది ఈ కూల్చివేతల్లో పాల్గొనడం మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇది చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. సుమారు నాలుగు గంటల పాటు ఏక బిగిన రైల్వే అధికారులు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఘటనపై బెల్లంపల్లి రైల్వే శాఖ కు చెందిన ఓ ఇంజినీరింగ్ అధికారిని వివరణ కోరగా రైల్వే ఆస్తులను కాపాడుకోవడం నిత్య చర్యల్లో భాగంగా తొలగించామన్నారు. గతంలో ఈ భూమిపై కోర్టు స్టే ఆర్డర్ ఉన్నదని, ప్రస్తుతం అది తొలగిపోయిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకే ఈ భూమిని రైల్వే శాఖ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇందులో పెద్ద ప్రత్యేక విషయం ఏమీ లేదని కొట్టిపారేశారు. ఈ తొలగింపుల్లో బెల్లంపల్లి రైల్వే ఇంజనీరింగ్ శాఖ అధికారులతో పాటు తాండూర్ సీఐ దేవయ్య, తాండూర్, మాదారం తాళ్ల గురజాల ఎస్ఐలు ప్రసాదరావు, సౌజన్య, రామకృష్ణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ రాకతోనే బడుగులకు రాజకీయ న్యాయం

- ఇవాళ ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటే ఊరుకుంటామా?
- రాజకీయ నేతల వ్యాఖ్యలపై మండిపడ్డ తెలంగాణ టిడిపి నేతలు



**హైదరాబాద్, జూన్ 3 (జనంసాక్షి) :** ఎన్టీఆర్ పార్టీ పెట్టి రాజకీయాల్లోకి వచ్చాక బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చిందని టీడీపీ తెలంగాణ నేతలు అన్నారు. ఈ మేరకు పొలిట్‌బ్యూరో మెంబర్ అర్విండ్ కుమార్ గౌడ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ గురించి తెలియక కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ సమాధి తొలగిస్తామని.. ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటున్నారని అన్నారు. తెలంగాణ వాళ్లు కాదని.. అంబేద్కర్, పూలే విగ్రహాలు తీసేస్తారా అని ప్రశ్నించారు. కొత్తగా పుట్టిన పార్టీ వాళ్లు ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం చంద్రబాబు నాయుడు ఆనాడు లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ తెచ్చిన సంస్కరణల వల్లే తెలంగాణ ఇప్పుడు నంబర్ వన్‌గా ఉందని అర్విండ్ అన్నారు. కొత్తగా పెట్టిన పార్టీ వాళ్లు.. తాము ముఖ్యమంత్రి అవుతామని విగ్రహాలు తొలగిస్తామని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఎవరైనా ఎక్కడైనా మీటింగ్‌లు పెట్టుకోవచ్చని.. పోటీ చేయవచ్చన్నారు. కానీ ఇక్కడ మీటింగ్‌లు పెట్టుకోవద్దని... పెడితే అడ్డుకుంటామని అనడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. రాష్ట్రాలు వేరైనా తెలుగు వాళ్లంతా ఒక్కటిగా ఉందామని అర్విండ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ తమ వల్లనే వచ్చిందన్న కేసీఆర్ పదేళ్లు పాలన చేశారని టీడీపీ నేత నన్నూరి నర్సారెడ్డి అన్నారు. తెలంగాణ ఇచ్చింది తామే అన్న పార్టీ రెండున్నరేళ్ళుగా అధికారంలో ఉందన్నారు. ఈ రెండు పార్టీల పాలనపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. 60-70 ఏళ్లు జరగని దోపిడీ కేసీఆర్ పాలనలో జరిగిందని ఆరోపించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అంతకుమించి దోపిడీ జరిగిందని వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏం తప్పుగా మాట్లాడారని ఆయనపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధి కోసం జనసేనతో కలిసి పోటీ చేస్తామని.. మరో పార్టీతో అయినా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డ అభివృద్ధికి బాటలు వేసింది టీడీపీ అని నర్సారెడ్డి అన్నారు. చంద్రబాబును, టీడీపీని అప్రతిష్ఠపాలు చేసే కుట్రలు ఇక్కడ నుంచి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, సేవా కార్యక్రమాలు తెలంగాణ ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు. ప్రశ్నించే తత్వాన్ని ప్రజలకు నేర్పుతున్న పార్టీని ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన పార్టీలకు ఇక్కడ మనుగడ ఉందని తెలిపారు. అడ్డుకుంటాం.. దాడులు చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. పొత్తుల అంశం ఎన్నికల సమయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని నన్నూరి నర్సారెడ్డి పేర్కొన్నారు.

## 91 మంది జీవితఖైదీల విడుదలకు సర్వసిద్ధం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా ఏళ్లతరబడి జైలు నాలుగు గోడల మధ్య శిక్షను అనుభవిస్తున్న వరంగల్,చర్లపల్లి, చంచల్ గూడ,నిజామాబాద్, సంగ రెడ్డి, ఆయా ప్రధాన కేంద్ర కగరలనుండి తొంబైఒక్క మంది జీవిత ఖైదీలను విడుదలకు మోక్షం లభించింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదలకు సర్వం సిద్ధంచేసింది,అన్ని జైలనుండి విడుదలయ్యే జీవిత ఖైదీలను ఇప్పటికే చర్లపల్లి సెంట్రల్ జైలు కు తరలించారు.జీవిత ఖైదీల పురాణవాసం కోసం కుట్టు మిషన్ లను జైళ్ల శాఖ డి.జి సౌమ్య మిత్ర ఐజీ లు వై.రాజేష్ ,మురళి బాబు , డీఐజీ లు సంపత్, శ్రీనివాస్ రావు, నవాబ్ శివకుమార్ గౌడ్, ప్రమోద్ లు పాల్గొననున్నారు.

## టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవితతో బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ భేటీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవితతో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ భేటీ అయ్యారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో హైదరాబాద్ బ్రిటిష్ హైకమిషన్ పొలిటికల్ అండ్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రాఘురామన్ తో కలిసి డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ మర్యాద పూర్వకంగా కవితను కలిశారు. భారత్ - యునైటెడ్ కింగ్ డమ్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ఇతర అంశాలపై చర్చించారు.

## పత్తి దిగుమతులు దిగుమతి పన్ను ఎత్తివేయడంతో
# చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర నష్టం

**తెలంగాణ రైతు సంఘం రావు రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూన్ 1 నుండి అక్టోబర్ 30 వరకు పత్తిపై ఉన్న 11% దిగుమతి సుంకాన్ని నిలిపివేస్తూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ రైతు సంఘం రావు రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ తీవ్రంగా ఖండించారు. ఇది ఇప్పటికే బడా వ్యాపార సంస్థల చేతిలో తీవ్ర దోపిడీకి గురవుతున్న లక్షలాది పత్తి రైతులు, కార్మికులను ప్రమాదంలో పడేస్తుంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బడా వ్యాపార సంస్థల ముందు తలొగ్గి, రైతుల ప్రయోజనాలను బలిచ్చిందని, భారతీయ రైతుల రక్షణ, జాతీయ వ్యవసాయ అవసరాల కంటే వాణిజ్య సరళీకరణ, స్వేచ్ఛా వాణిజ్య కట్టుబాట్లకు ప్రాధాన్యతనిచ్చే ప్రపంచ, సామ్రాజ్యవాద ఆర్థిక ఒత్తిళ్లకు ఇది తలొగ్గుతోందని, ఈ 5 నెలల సుంకరహిత కాలంలో భారతదేశం సుమారు 40 లక్షల బేళ్ల పత్తిని దిగుమతి చేసుకోవచ్చు. అంతేకాకుండా, ఇది స్వావలంబనను ప్రోత్సహించకుండా దిగుమతులపై ఆధారపడటాన్ని బలవంతం చేస్తోందని, ఇటీవలి నెలల్లో (ఫిబ్రవరి - ఏప్రిల్ 2026 మధ్య) పత్తి ధరలు పెరిగాయి, కానీ ఇది సంవత్సరాల తరబడి అస్థిరమైన ధరలు, పెరుగుతున్న సాగు ఖర్చులు మరియు రైతులు పదేపదే ఎదుర్కొన్న నష్టాల తర్వాత జరిగింది. అయితే, సుంకం మినహాయింపు ప్రకటించిన వెంటనే ఈ ధరలు 3% పడిపోయాయి, దీంతో పరిశ్రమ లాభాలను కాపాడే భారాన్ని రైతులు మరోసారి మోయవలసి వస్తుందనే భయాలు పెరిగాయి. దేశంలో తీవ్రమైన పత్తి కొరత ఉన్నట్లు స్పష్టమైన అనుభవపూర్వక ఆధారాలు కూడా లేవు. దేశీయ పత్తి లభ్యత సరిపోతుందని పరిశ్రమ ప్రతినిధులు స్వయంగా బహిరంగంగా అంగీకరించారని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు మరియు ఎల్ నినో సంబంధిత వర్షపాత అంతరాయాల వల్ల పత్తి రైతులు ఇప్పటికే పెరుగుతున్న అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని, భారతదేశంలోని పత్తి సాగులో 65% పైగా వర్షాధారమైనది కాబట్టి, ముఖ్యంగా ఈ సంవత్సరం రైతులు అపారమైన నష్టభయాలను ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. మరింత అనిశ్చితిని సృష్టించే బదులు, ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. దేశంలోని ప్రధాన పత్తి పండించే ప్రాంతాలు అప్పుల కారణంగా జరిగే రైతు ఆత్మహత్యలకు అపఖ్యాతి పాలయ్యాయి. పత్తిపై దిగుమతి సుంకాన్ని తగ్గించే రైతు వ్యతిరేక చర్యకు వ్యతిరేకంగా పోరాటాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ ఇన్ సర్వీస్ టీచర్లకు శుభవార్త

**వారి కోసం ప్రత్యేక టెట్ నిర్వహణ**

**హైదరాబాద్, జూన్3 (జనంసాక్షి) :** తెలంగాణలో సర్వీస్‌లో ఉన్న టీచర్లకు గుడ్‌న్యూస్! ఇకపై ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా రెండు సాధారణ టెట్‌లకు అదనంగా మరో రెండు ప్రత్యేక టెట్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక టెట్‌ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. గతేడాది సాధారణ టెట్ లో భాగంగానే ఇన్‌సర్వీస్ టీచర్లకూ ఈ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఏడాదికి రెండుసార్లు ప్రత్యేక టెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంపై టీఎస్ యూటీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మాత్రం కొన్ని సంఘాల పేర్లు మాత్రమే పేర్కొనడం భావ్యం కాదని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## 5 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

**హైదరాబాద్, జూన్3 (జనంసాక్షి) :** టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి బోర్డు షెడ్యూల్ విడిదుల చేసింది. అందులో భాగంగా సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుంచి జూన్ 12 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 31 వేల 542 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొత్తం 93 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు జరుగుతాయి. ఫస్ట్ లాంగ్వేజ్, సైన్స్ స్జబెక్టులకు టైమింగ్స్ వేరే ఉన్నాయి. ఫస్ట్ లాంగ్వేజ్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 వరకు ఉంటుంది. సైన్స్ ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ గా రెండు పేపర్లు ఉండటంతో.. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు ఉంటుంది. ఫిజిక్స్, బయాలజీ ఒక్కో పేపర్ ఒక్కో రోజు ఉంటుంది. సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లను విడుదల చేశారు. డిపార్ట్ మెంట్ వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాల్సిందిగా డైరెక్టర్ తెలిపారు. లేదంటే స్కూల్ హెడ్ మాస్టర్ నుంచి కూడా హాల్ టికెట్లు పొందవచ్చునని తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో సెలూన్ షాప్ దగ్ధం

**నల్లగొండ, జూన్3 (జనంసాక్షి) :** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సెలూన్ షాప్ దగ్ధమైన సంఘటన తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కదునూరి హరీశ్ గ్రామ ఎక్స్ రోడ్ వద్ద సెలూన్ షాప్ నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ తో షాపులో మంటలు చెలరేగి షాప్ మొత్తం అగ్నికి ఆహుతి అయింది, దీంతో తనకు సుమారు లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
4 జూన్ 2026

సంపాదకీయం

# పెద్దధన్వాడ పోరాట పటిమ

**మట్టి మనుషుల పిడికిళ్ళు పూసిన పువ్వులయ్యాయి..**

**పెద్దదాన్వాడ పోరాటం వసంతమైన వేళ..**

తుంగభద్ర ఒడ్డున పచ్చని పొలాలు పరుచుకున్న గద్వాల గడ్డపై గత సంవత్సరం జూన్ నెలలో ఒక చరిత్ర రాసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దదాన్వాడ మహిళలు, పిల్లలు, రైతులు తమ నేలను, తమ ఊపిరిని కాపాడుకునేందుకు పిడికిలెత్తారు. ఆ పోరాటం నేడు ఒక సంవత్సరం పూర్తి చేసుకుంటోంది.

సుమారు 220 కోట్ల పెట్టుబడితో వచ్చిన గాయత్రీ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా పెద్దదన్వాడలో ఇథనాల్ పరిశ్రమ స్థాపనకు అనుమతులు సంపాదించింది. ఆర్డీఎస్ ఆయకట్టు సాగునీటిపై ఆధారపడి సంవత్సరానికి రెండు పంటలు పండించుకుంటున్న 12 గ్రామాల రైతాంగానికి ఇది మెరుపులాంటి దెబ్బ. ఇథనాల్ పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం మాటు మాటకూ చెప్పాలి. అవి గాలిలో కలిపే బెంజీన్, ఎసిటాల్డిహైడ్ వంటి రసాయనాలు క్యాన్సర్ కారకాలుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గుర్తించింది. భూగర్భ జలాలు, నేల సారం నాశనమవుతాయి. ఆ విషం నదిలో కలిస్తే తరాలు తరాలు నష్టపోతాయి.

గ్రామస్తులు హింసకు పోలేదు. గాంధేయ మార్గంలో నిరాహార దీక్షలు చేశారు. పాలకులకు, అధికారులకు విన్నపాలు సమర్పించారు. నెలల పాటు శాంతియుతంగా ఉద్యమించారు. ప్రభుత్వం "పరిశ్రమ పనులు ప్రారంభించం" అని హామీ ఇచ్చి దీక్షలు విరమింప చేసింది. కానీ జూన్ 1వ తేదీ అర్ధరాత్రి ప్రజలు నిద్రపోతున్న వేళ కంపెనీ ప్రైవేట్ గూండాలను, బౌన్సర్లను రప్పించింది. గ్రామస్తులను రెచ్చగొట్టేలా "దమ్ముంటే గీత దాటండి" అని సవాలు విసిరారు. జూన్ 4న శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి వచ్చిన గ్రామస్తులపై బౌన్సర్లు ఏకపక్షంగా దాడి చేశారు. మరియమ్మ అనే మహిళ తల పగిలి రక్తం కారింది. అప్పుడు నిరాయుధులైన ప్రజలు విధిలేని పరిస్థితిలో కంపెనీ తాత్కాలిక షెడ్లను తగలబెట్టారు.

పోరాటం ఫలించింది. పొట్టి శ్రీరాములు ఎస్పీ జోన్ పరిధిలోని ఫ్యాక్టరీ చివరకు తరలిపోయింది. ప్రజలు నెగ్గారు. కానీ 42 మంది రైతులపై బనాయించిన అక్రమ కేసులు నేటికీ ఉన్నాయి. పరిశ్రమ బలవంతులకు అనుమతులు సులభంగా దొరుకుతాయి నిరాయుధుల పై కేసులు మాత్రం అలాగే మిగులుతాయి. ఇది వ్యవస్థ చూపే రెండు ముఖాలు. రైతు ఉద్యమానికి అక్షర బలమిచ్చి, అండదండలుగా నిలిచినందుకు జనంసాక్షి సంపాదకుడు ఎం.ఎం. రహమాన్‌ను కంపెనీ ప్రధాన నిందితుల జాబితాలో చేర్చింది. కలం పోరాటాన్ని నేరంగా చూపే ఈ చర్య ప్రజాస్వామ్యానికి అవమానం.

జనంసాక్షి ఈ పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచింది నిలుస్తుంది. ఈ రాష్ట్రంలో ఎక్కడ కాలుష్య పరిశ్రమ వస్తే, ఎక్కడ ప్రజల గొంతు నొక్కబడుతుందో అక్కడ మన అక్షరం పోరాటం చేస్తుంది. 42 మంది రైతులపై, జనం సాక్షి సంపాదకుడిపై పెట్టిన కేసులు ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. ఇది 12 గ్రామాల డిమాండ్ మాత్రమే కాదు ఇది నేల మీద బతికే ప్రతి మనిషి కోరుకునే న్యాయం.

# రాజ్యాంగంలో స్థానిక సంస్థలు చట్టాలు

## గ్రామ స్వరాజ్యం నుండి బహుజన రాజ్యాధికారం - స్థానిక సంస్థల ఎన్నికలు

భారతదేశం లాంటి సువిశాల సమాజంలో ప్రజాస్వామ్యం కేవలం ఢిల్లీ పార్లమెంట్‌లోనో, రాష్ట్రాల అసెంబ్లీల్లోనో బందీ కాకూడదని... అది గల్లీల ఉండే సామాన్యుడి దాకా వెళ్లాలని మహాత్మా గాంధీ కన్న కల 'గ్రామ స్వరాజ్యం'. ఈ ఆశయాన్ని నిజం చేస్తూ 1992 లో పి.వి. నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో భారత పార్లమెంటు 73 మరియు 74వ రాజ్యాంగ సవరణ చట్టాలను తీసుకొచ్చింది. ఈ జంట సవరణలు భారతదేశంలో 'మూడో అంచె పాలనను' (Third Tier of Governance) సృష్టించి, స్థానిక సంస్థల ఎన్నికలకు రాజ్యాంగ రక్షణ కల్పించాయి. ప్రసిద్ధ రాజ్యాంగ నిపుణులు ప్రొఫెసర్ ఎం.వి. పైలీ తన గ్రంథాలలో పేర్కొన్నట్లు–"ఈ సవరణలు స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా, ఒక చట్టబద్ధమైన నిరంతర ప్రక్రియగా మార్చి అట్టడుగు స్థాయి ప్రజాస్వామ్యానికి (Grassroots Democracy) ప్రాణం పోశాయి. [Constitutional Government In India]

రాజ్యాంగ నిబంధనలు – ఎన్నికలు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం కేంద్ర ఎన్నికల కమిషన్ (ECI) కేవలం రాష్ట్రపతి, పార్లమెంటు మరియు అసెంబ్లీ ఎన్నికలను మాత్రమే నిర్వహిస్తుంది. స్థానిక స్వపరిపాలన (Local Government) అనేది రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ప్రకారం పూర్తిగా 'రాష్ట్ర జాబితా'లోని (State List - Entry 5) అంశం. అందుకే, స్థానిక ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించడానికి 73, 74వ సవరణల ద్వారా ప్రతీ రాష్ట్రంలో స్వతంత్రంగా 'రాష్ట్ర ఎన్నికల సంఘం' (State Election Commission – ఆర్టికల్ 243ఖ ఒ 24గ్రా) ఏర్పాటును రాజ్యాంగబద్ధం చేశారు. పంచాయతీలు, మున్సిపాలిటీల ఓటర్ల జాబితా తయారీ, వార్డుల పునర్విభజన మరియు ఎన్నికల పర్యవేక్షణ సర్వాధికారాలు ఈ రాష్ట్ర ఎన్నికల సంఘానికే ఉంటాయి.

స్థానిక రిజర్వేషన్లు -- బహుజన అధికారం

73, 74వ రాజ్యాంగ సవరణలు స్థానిక సంస్థల ఎన్నికలలో మహిలాలకు కనీసం 33% స్థానాలను (మన తెలంగాణలో 50%), ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను ఖచ్చితం చేశాయి. కానీ, అత్యంత దురదృష్టకరమైన విషయం ఏమిటంటే... దేశంలో నూటికి ఎనభై మంది ఉన్న బీసీల (ఓబీసీ) రిజర్వేషన్ల నిర్ణయాధికారాన్ని మాత్రం రాజ్యాంగ నిర్మాతలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఇష్టానికే వదిలేశారు.

దీనిని ఆసరాగా చేసుకొని, బీసీల అధికార వాటాను దెబ్బతీయడానికి అగ్రవర్ణ శక్తులు కోర్టులను వాడుకుంటున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం... స్థానిక ఎన్నికలలో బీసీలకు




రిజర్వేషన్లు ఇవ్వాలంటే రాష్ట్రాలు ఖచ్చితంగా 'ట్రిపుల్ టెస్ట్' (Triple Test)విధానాన్ని పాటించాలి. అంటే: 1. ప్రత్యేక సమగ్ర బీసీ కమిషన్‌ను వేయాలి, 2. స్థానిక సంస్థల వారీగా బీసీల వెనుకబాటు తనంపై ఖచ్చితమైన డేటాను సేకరించాలి, 3. ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం రిజర్వేషన్లు 50% పరిమితి దాటకుండా చూడాలి. ఈ 50% నిబంధన వల్లనే ప్రతీ ఎన్నికల ముందు కోర్టుల స్టేల వల్ల బీసీల సీట్లు తగ్గిపోవడం మనం చూస్తున్నాం.

రాష్ట్రాల వారీగా స్థానిక సంస్థల తాజా గణాంకాల పట్టిక (జూన్ 2026 నాటికి)

ప్రస్తుతం దేశంలో అధికారికంగా 800 కి పైగా జిల్లాలు, 2,55,300 కి పైగా గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రధాన రాష్ట్రాల వారీగా పరిపాలనా విభాగాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

| రాష్ట్రం పేరు | మొత్తం జిల్లాలు | గ్రామ పంచాయతీలు | మున్సిపాలిటీలు | మున్సిపల్ కార్పొరేషన్లు |
|---|---|---|---|---|
| తెలంగాణ | 33 | 12,769 | 129 | 13 |
| ఆంధ్రప్రదేశ్ | 26 | 13,325 | 80 | 17 |
| ఉత్తరప్రదేశ్ | 75 | 58,189 | 200 | 17 |
| మహారాష్ట్ర | 36 | 27,854 | 243 | 29 |
| బీహార్ | 38 | 8,051 | 88 | 19 |
| పశ్చిమ బెంగాల్ | 23 | 3,340 | 118 | 7 |
| కేరళ | 14 | 941 | 87 | 6 |

భౌగోళిక–పరిపాలనా గణాంకాల వెనుక ఉన్న నగ్నసత్యం

ఈ పట్టికలోని సంఖ్యలను పరిశీలిస్తే ఒక సంక్లిష్టమైన సామాజిక–రాజకీయ వ్యత్యాసం కనిపిస్తుంది. 13 కోట్లకు పైగా జనాభా ఉన్న బిహార్‌లో కేవలం 8,051 గ్రామ పంచాయతీలు, 9 కోట్ల జనాభా ఉన్న పశ్చిమ బెంగాల్‌లో 3,340, 3.5 కోట్ల జనాభా ఉన్న కేరళలో కేవలం 941 గ్రామ పంచాయతీలు మాత్రమే ఉన్నాయి. ఎందుకంటే, కేరళలో ఒక్కొక్క పంచాయతీ జనాభా 20,000 నుండి 50,000 వరకు ఉండేలా 'పెద్ద గ్రామ పంచాయతీల నమూనా'ను చట్టం చేశారు. బిహార్ పంచాయతీ చట్టం ప్రకారం మైదాన ప్రాంతాల్లో పంచాయతీ ఏర్పాటుకు కనీసం 7,000 జనాభా ఉండాలి.

కానీ, ఈ పెద్ద పంచాయతీల నమూనా వల్ల పరిపాలనా ఖర్చు తగ్గొచ్చు ఏమో కానీ, సామాన్య బహుజన, దళిత, గిరిజన పౌరులకు లీడర్లయ్యే అవకాశాలు (సర్పంచ్ పదవులు) ఘోరంగా తగ్గిపోతాయి. ఈ విషయంలో మన తెలంగాణ నమూనానే దేశానికే ఆదర్శం. మన దగ్గర 'మా తండాలో మా రాజ్యం' అనే నినాదంతో... చిన్నచిన్న గిరిజన గూడాలను, తండాలను ప్రత్యేక పంచాయతీలుగా మార్చుకోవడం వల్ల ఇవాళ మన తెలంగాణలో 33 జిల్లాలు, 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దీనివల్ల వేలాది మంది అట్టడుగు వర్గాల లంబాడా, కోయ, గిరిజన, బహుజన బిడ్డలు ఇవాళ సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా మారి ప్రజాస్వామ్య లీడర్లయ్యారు.

కులగణనే ఏకైక మార్గం

స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో జరగకపోతే కేంద్ర నిధులు ఆగిపోయి మన పల్లెటూర్లు నష్టపోతాయి, మన బహుజన బిడ్డల లీడర్ షిప్ దెబ్బతింటుంది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ స్వార్థం కోసం, బీసీ రిజర్వేషన్ల నెపంతో స్థానిక ఎన్నికలను వాయిదా వేసే సంస్కృతి మారాలి.

మన తెలంగాణలో మరియు దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పూర్తి న్యాయం జరగాలన్నా, సుప్రీంకోర్టు ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను అధిగమించాలన్నా... రాష్ట్రవ్యాప్తంగా సమగ్రమైన 'కులగణన' (ఝుర్వ జవఅంబం) జరగడం ఒక్కటే ఏకైక మార్గం. జనాభా నిష్పత్తి ప్రకారం 50% రిజర్వేషన్ల గోడలను బద్దలు కొట్టి, ఎవరి జనాభా ఎంతో... వారి అధికార వాటా అంత ఉండాలని రాజ్యాంగబద్ధంగా డిమాండ్ చేయాలి. అప్పుడే గ్రామ సమాజంలో సామాజిక న్యాయం నిలబడుతుంది, బాబాసాహెబ్ అంబేద్కర్ కన్న 'రాజ్యాధికార కల' గల్లీ దాకా నిజమవుతుంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987




# భయం భయం

బాల్యం నుండి భయం
బూచోడు(పోలీసు)
ఎత్తుకుపోతాడన్నభయం!
మూడేళ్ళు నిండకుండా
ఏడుపుతో 'బడి'భయం!
బడిలో 'మార్కులు'పోటీ
'ర్యాంకుల'భయం! హాస్టల్లో
ప్రేమకుదూరమై–బిక్కుబిక్కు
ఒంటరిగా వార్డెన్ భయం!
ముక్కునబట్టి కాపీకొట్టే
దీర్ఘకాల 'పరీక్షల'భయం!
బతకటానికి 'ఉద్యోగం'
రాదేమో నన్న భయం!
దేవుడిభయం!దెయ్యంభయం
సెంటిమెంట్ల భయంభయం!
ఉద్యోగంలో 'లంచం'
తీసుకుంటూ భయం!
జీవనమార్గంలో 'అబద్ధాలు'
తప్పనిసరి భయం!
సంపాదించకపోతే భయం!
'అతి'సంపాదన భయం!
అన్నీ భయాలే– భయం!
భయం లేనిదెక్కడ?
పెళ్ళికాలేదే నన్న భయం!
అయ్యాక పెళ్ళాంలమొగుడు
భావప్రకటనా భయం!ఏ క్షణ
మైనా విడాకులు భయం!
చూస్తే తరుణ ప్రాయం
అంతులేని భయాలతో
బిపి, షుగర్ ఖాయం–రోజూ
ఏడెనిమిది మాత్రలు వేసి
గొంతులో గటగటా తోయం!
ఎలాగో పిల్లలు పుట్టాక–
వాళ్ళ భవిష్యత్తు భయం!
వాళ్ళ చదువుల భయం!
ఉద్యోగాల భయం!
పెళ్ళిళ్ళు భయం!
నిరంతర భయాలతో
జీవితమంతా భయం!
కొత్తగా కరోనా భయం!
భయాలతో చావు భయం!
ఇన్ని భయాలతో–
ఇది చావా? బతుకా?
కొత్తగా చచ్చే దేముంది?
ఆసుపత్రిలో ICU భయం!
కరోనా తో యుద్ధభయం!
భయంకన్నా చావు నయం!
మందులేని లక్షల వైద్యం!
అందుకే నాసలహా–
అరవైయ్యేళ్ళుదాటినవాళ్ళు
ఆసుపత్రిలో చేరకండి!
ఆసుపత్రిలో చస్తే ఏముంది!
ఇంట్లో చస్తే ఏముంది!
లక్షల దోపిడి నుండి–మీ
పిల్లల్ని రక్షించండి! ఇప్పుడు
ఘనమైన చావులు లేవు
నువ్వెంత తోపు గాడివైనా
నీకోసం ఏడ్చే వాళ్ళు లేరు!
అందరూ పారిపోయే వాళ్ళే!
నీకన్నా శవం ఏపాటి నయం!
జీవితచరమాంకంలోనన్నా
కావాలి నీ చావు నిర్భయం!
(కరోనా భయం పోగొట్టడానికి
బతుకు భయాలన్నీ చెప్పాను.
సరదాగా తీసుకోండి.ఈసరదా
లోకూడాకొంతనిజంఉందని
మీరు భావిస్తే ధన్యుణ్ణి)

-తమ్మినేనిఅక్కిరాజు
హైదరాబాద్

# పోరుగడ్డ తెలంగాణపై పవన్ కళ్యాణ్ అవాకులు చవాకులు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా కొంతమంది రాజకీయ నాయకులు ఆ ఉద్యమ నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకుండా, దానిని తక్కువ చేసి మాట్లాడటం ఇప్పటికీ కొనసాగుతుండటం ఆశ్చర్యకరం. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ వంటి నాయకుడు తెలంగాణ అంశంపై మాట్లాడిన ప్రతిసారి వివాదాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమం అనేది ఒక్కరోజులో పుట్టిన భావోద్వేగం కాదు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత దశాబ్దాల పాటు తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న "నీళ్ళు, నిధులు, నియామకాల" అన్యాయాలపై, "భాషా, సంస్కృతుల" పై దాడులతో పేరుకుపోయిన ఆవేదనకు అది ప్రతి రూపం. 1969లోనే 365 మంది విద్యార్థులపై కాసూ బ్రహ్మానందం రెడ్డి, జలగం వెంగళరావు ఎన్కౌంటర్లకు బలైనారు, యువత వీధుల్లోకి వచ్చి ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడారు. ఆ ఉద్యమ చరిత్రను విస్మరించి తెలంగాణ ఏర్పాటును ఒక రాజకీయ ప్రమాదంలా చిత్రీకరించడం బాధ్యతారాహిత్యం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఒక్క పార్టీ గానీ, ఒక్క నాయకుడు గానీ కారణం కాదు. ఉద్యమకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కళాకారులు, మేధావులు, రచయితలు , గాయకులు అందరూ కలిసి ఐక్యంగా చేసిన దీర్ఘకాల సకల జనుల సమ్మె పోరాటమే దానికి పునాది. కేసీఆర్ నాయకత్వం ఆ ఉద్యమానికి రాజకీయ దిశనిచ్చింది. మరోవైపు చిన్న రాష్ట్రాలకు, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి అనుకూలమని మావోయిస్టులు, ఆతర్వాత బీజేపీ వారు కూడా ప్రకటించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు హామీ ఇచ్చింది. తెలుగు దేశం పార్టీ కూడా చివరకు అనుమతి తెలిపింది. అంతేకాదు దేశంలో ఉన్న అనేక రాజకీయ పార్టీల నాయకులు వరుసగా తమ సమ్మతి తెలియచేస్తూ లేఖలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చాయి...ఈ సమ్మతుల మధ్య, కేసీఆర్ ఆమరణ దీక్ష మలిదశ తెలంగాణ ఉద్యమం పీక్ స్థాయికి చేరుకుంది. చివరకు తెలంగాణ రాష్ట్రం ప్రజల చిరకాల వాంఛ గా ఏర్పడింది. అంటే ఇది ఎవరో ఒకరు వ్యక్తిగతంగా చేసిన దానం కాదు; ప్రజలందరి ఆకాంక్షకు రాజకీయ అంగీకారం లభించిన ఫలితం.

అలాంటి చారిత్రక ప్రక్రియ నేపథ్యాన్ని అర్థం చేసుకోకుండా "తెలంగాణ వస్తే నేను 13 రోజులు అన్నం తినలేదు", "గద్దర్‌కు కారు కొని చ్చాను" వంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ పరిపక్వత కాదు. ఉద్యమాలను వ్యక్తిగత భావోద్వేగాల స్థాయికి దించడం ద్వారా లక్షలాది ప్రజల త్యాగాలను చిన్నబుచ్చినట్టవుతుంది. తెలంగాణ ప్రజలు పోరాడింది ఎవరి మీదో ద్వేషంతో కాదు; తమ ఆత్మగౌరవం, స్వపరిపాలన కోసం వీరోచిత పోరాటం చేసి చివరకు తమ రాష్ట్రాన్ని తాము సాధించుకున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతే అది పవన్ కళ్యాణ్ అవగాహన లోపమే.

పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే స్పష్టమైన సిద్ధాంతం కనిపించదన్న విమర్శలు తరచూ వినిపిస్తాయి. ఒకరోజు చేగువేరా తనకు ఆదర్శమంటారు. మరొకరోజు సనాతన ధర్మ పరిరక్షకుడినని చెబుతారు. కొన్ని సందర్భాల్లో కమ్యూనిస్టులను పొగుడుతారు; మరోవైపు బీజేపీ, ఆరెస్సెస్ కంటే ఎక్కువగా హిందుత్వ రాజకీయ భాష మాట్లాడతారు.కొత్తగా మతం పుచ్చుకున్న వారు నాలుగు పంగనామాలు ఎక్కువ పెట్టుకొన్నట్లు... నేను క్రీస్టియన్,నా భార్య క్రిస్టియన్,నా పిల్లలు క్రీస్టియన్ అంటూనే... వీరావేశంతో గుడి మెట్లు కడుగుతాడు.ఆయన వ్యక్తిత్వంలో ఈ విరుద్ధ ధోరణులు, ఆయన మాటల్లో స్థిరత్వం లేదనే అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. ప్రజలు నాయకుడిలో స్పష్టత, నిబద్ధత, నిరంతరత కోరుకుంటారు. కానీ ప్రతి వేదికపై వేర్వేరు పాత్రలు పోషించడం , తాను బ్యాలెన్స్ తప్పి పూనకం వచ్చినట్టు ఊగిపోతూ సినిమాలో డైలాగ్స్ తో నటించటం సాధ్యమేమో గానీ, రాజకీయాల్లో అది ఎక్కువకాలం పనిచేయదు.

కాకపోతే సినిమా అభిమానులకు అదో ఉచిత ప్రదర్శనగా ఎంజాయ్ చేస్తూ చప్పట్లు కొడతారు.అంతే.

సినీ రంగంలో చిరంజీవి పుణ్యమా అని పవన్ కళ్యాణ్‌కు వచ్చిన గుర్తింపును ఎవరూ తిరస్కరించలేరు. కానీ రాజకీయ నాయకత్వం సినిమా ఇమేజ్‌తో మాత్రమే నిలబడదు. ప్రజా సమస్యలపై అధ్యయనం, పరిపాలనా అవగాహన, పార్టీ నిర్మాణం, కేడర్ బలం అవసరం. జనసేన పార్టీ ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా గ్రామస్థాయిలో ఇప్పటికీ పార్టీ నిర్మాణం బలపడలేదనే విమర్శ అనేక సందర్భాల్లో వ్యక్తం అయ్యింది. ఆయన చేసే హావభావ విన్యాసాల ఉపన్యాసాలకు, సినిమా అభిమానుల అరుపులు, కేకలు, ఈలలు తప్ప ఎన్నికల్లో స్వతంత్రంగా నిలబడి బలమైన రాజకీయ శక్తిగా నిలబడలేకపోయింది. స్వయంగా పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో రెండు చోట్ల పోటీ చేసి దారుణంగా ఓడిపోయిన సందర్భాలు ఆయన మర్చిపోయినా... డిపాజిట్లు దక్కకుండా ఓడించిన ఆ ప్రజలు ఇంకా మరచిపోలేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో ఉపముఖ్యమంత్రి గా అధికారంలో భాగస్వామ్యం కూడా స్వశక్తితో వచ్చింది కాదని, చంద్రబాబు–బీజేపీ రాజకీయ సమీకరణాల భిక్ష ఫలితమనే అభిప్రాయం విస్తృతంగా ఉంది.

చంద్రబాబు నాయుడు, మోదీ, బీజేపీపై గతంలో పవన్ కళ్యాణ్ చేసిన విమర్శలు, ఇప్పుడు వారితో ఉన్న రాజకీయ అనుబంధం చూసినప్పుడు పవన్ కళ్యాణ్ అవకాశవాద రాజకీయాలపై ప్రశ్నలు రావడం సహజం. ఇదే విధంగా చంద్రబాబు కూడా గతంలో మోదీని తీవ్రంగా విమర్శించారు. మోదీ కూడా చంద్రబాబుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు పరస్పర ప్రయోజనాల కోసం కలిసి ఐక్యంగా ఉన్నట్లు నటిస్తూ నడుస్తున్నారు. ఇది రాజకీయాల్లో సహజం. వీరి ఎన్నికల పొత్తులలో పార్టీల సిద్ధాంతాల ఏకీభావ బంధం కంటే పరస్పర రాజకీయ అవసరాల కలయిక అనే భావన ప్రజల్లో బలంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇతరులపై నైతిక ఉపన్యాసాలు ఇవ్వడం పవన్ కళ్యాణ్ విశ్వసనీయతను, తగ్గిస్తుంది. లౌక్యం, ఇంగితం తెలియని పిల్ల చేష్టలుగా... ప్రజలు లెక్క కడతారు.

ఇప్పటి వరకు తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్ లోనూ తెలంగాణలో ఇతర చోట్ల నివసిస్తున్న ఆంధ్ర, రాయలసీమ ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదన్నది వాస్తవం. హైదరాబాద్‌లో వ్యాపారాలు, పరిశ్రమలు, సినిమా రంగం, ఉద్యోగాలు అన్నీ సాధారణంగా, సజావుగానే కొనసాగుతున్నాయి. రెండు ప్రాంతాల ప్రజలు కలిసిమెలిసి శాంతియుతంగా జీవిస్తున్నారు. ఇలాంటి చక్కని వాతావరణం ఉన్న సమయంలో తెలంగాణపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, ప్రాంతీయ ద్వేషాలను రెచ్చగొట్టడం తనకూ, ఆంధ్ర , రాయలసీమ ప్రజలకూ క్షేమకరం కాదు. తన వ్యక్తిగత "ఇగో" రాజకీయ లాభం కోసం ఆంధ్రా, తెలంగాణ, రాయలసీమ అంటూ ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టడం చివరికి సాధారణ ప్రజలకే నష్టం చేస్తుంది.

తెలంగాణ నేల పోరాటాల చరిత్ర కలిగిన గడ్డ. ఇక్కడి ప్రజలు మాటల కంటే ఉద్యమాలను ఎక్కువ నమ్ముతారు. కేవలం సినిమా డైలాగులు, భావోద్వేగ ప్రసంగాలతో ఆ ప్రజలను ప్రభావితం చేయడం అంత సులభం కాదు. రాజకీయ నాయకుడు తన మాటలకు బాధ్యత వహించాలి. ముఖ్యంగా మరో రాష్ట్ర గౌరవం, చరిత్ర, ఉద్యమాల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ చారిత్రక వాస్తవాలను వక్రీకరించడం, ఉద్యమాల త్యాగాలను తక్కువ చేయడం మాత్రం సమంజసం కాదు.

ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ముందున్న అసలు సవాలు తెలంగాణపై వ్యాఖ్యలు చేయడం కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తాను జనసేన పార్టీ స్థాపించిన నాడు, తాను అక్కడ ఎన్నికల్లో పోటీచేసిన నాడు ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకసారి గుర్తుకు తెచ్చుకొని, అవి ఎంతవరకు అమలు చేయగలిగారో అక్కడ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న నిరుద్యోగం, రైతు సమస్యలు, అమరావతి రాజధాని కోసం తమ భూములను కారుచౌకగా ఇచ్చిన రైతులకు ఈ రోజు మార్కెట్ ధరల ఇప్పిస్తా అని చేసిన వాగ్దానాలను నిలుపుకోవాలి. , విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటు పరం కానివ్వను... ఎంతకైనా పోరాడతా అని తాను ఆనాడు చేసిన వాగ్దానం నిలుపుకోవాలి. విద్య, ఆరోగ్యం మొదలైన రంగాల్లో తన ఉపముఖ్యమంత్రి పదవి హోదాలో ఏమి సాధించి ప్రజలకు మేలు చేశాడో వివరించాలి. ఉప ముఖ్యమంత్రి పదవి ఒక గౌరవం మాత్రమే. అది ప్రజలకు ఉపయోగపడినప్పుడే దానికి విలువ ఉంటుంది. రాజకీయాల్లో స్థిరమైన వ్యక్తిత్వం, స్పష్టమైన సిద్ధాంతం, ప్రజల పట్ల బాధ్యత ఇవే, నాయకుడిని నిలబెడతాయి. లేకపోతే సినిమాలో హీరో డైలాగులు... బూటకపు మాటలు ఎంత పెద్దవైనా కాలంతో కలిసి మాయమైపోతాయి. పైగా... పవన్ కళ్యాణ్ (జనసేన పార్టీ) తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేస్తా అంటున్నారు. తాను స్వయంగా ఎన్నికల ప్రచారం చేస్తా అంటున్నారు. ఎవరికీ అభ్యంతరం లేదు.అది ఆయన ప్రజాస్వామిక హక్కు. కానీ డిపాజిట్ అయినా దక్కించుకోవాలీ అంటే ప్రజాభిమానం కావాలి.అందుకు పవన్ కళ్యాణ్ ఈ "రేలకాయి మాటలు" మానుకోవటం మంచిది. ఆయన మాటలు,చేష్టలతో ఇప్పటికే ఆయన వ్యక్తిగత జీవితంలో తెచ్చుకున్న చిందరవందర జీవితంలో వలే ... అందివచ్చిన ఉప ముఖ్యమంత్రి పదవిని కూడా గందరగోళంలో పడేయటం ఆయన అభిమానులకు కూడా ఇష్టం ఉండదు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ముఖ్యమంత్రి గారూ!
# ఆ 35 కోట్లు వాపసు ప్లీజ్




మాట్లాడితే చాలు ఈ మధ్య ఫక్తు కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి రూ. 35 కోట్ల మాట చెబుతున్నారు పవన్ కళ్యాణ్, ఆయన మనుషులు. తెలంగాణపై ప్రేమ లేనిదే కొండగట్టు అంజన్నకు రూ. 35 కోట్లు ఇస్తానా? అన్నట్టుగా పవన్ కళ్యాణ్ మీడియా సమావేశంలో మాట్లాడబోయారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ అవతరణ దినోత్సవం రోజునే హైదరాబాద్ లో తలపెట్టిన సభ, సదస్సు, సమావేశానికి పర్మిషన్ నిజానికి లభించలేదు. ప్రత్యామ్నాయంగా పేరుకే తెలివిగా మీడియా సమావేశం. అది కాస్తా వాస్తవంలో శ్రేణులు, అభిమానుల సమూహంతో ఒకింత కిక్కిరిసింది. మీడియా సమావేశంలో ఈలలు, కేకలు, నినాదాలు ఉంటే అది మీడియా సమావేశం అవుతుందా?

**చైతన్యమంతమైన తెలంగాణ సమాజం**

ఆ సన్నివేశాన్ని ఎలాగొలా గ్రహించింది. తెలంగాణ గడ్డను ఇంకెవ్వరూ ప్రత్యేకించి చైతన్యమంతం చేయాల్సిన అక్కెర లేదు. బేసిక్ గానే చైతన్యం ఎల్లప్పుడూ వెల్లివిరిసేదే తెలంగాణ. తెలంగాణ మీద ప్రేమను, కొండగట్టు ఆంజనేయస్వామి మీద భక్తి విశ్వాసాలతో ముడిపెడుతున్నట్టుగా పవన్ కళ్యాణ్ ధోరణి ఉన్నది. కుడి చేత్తో ఇస్తే, ఎడమ చేతికి తెలియొద్దంటారు. అలాంటిది ఆ ఆంజనేయుడి కోవెల అభివృద్ధికి అదీ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు మంజూరు చేయించి, నేను నిధులు ఇచ్చాను అని అనడం ఎబ్బెట్టుగా అనిపించదా? తెలంగాణ భూమి పుత్రులు, పుత్రికలైన గొప్ప భక్తులు ఎందరో కానుకలు, విరాళాలు ఆ దేవదేవుడికి ఎప్పట్నుంచో ఎన్నెన్నో సమర్పిస్తుంటారు. ఆ మాటకొస్తే టీటీడీ ఫండ్స్ పొందడం తెలంగాణ హక్కు కూడా! అలాంటిది జస్ట్ రూ. 35 కోట్లు కేటాయింపజేసి, ఇట్లా రాజకీయ సందర్భాల్లో వాడుకోవ డాన్ని బహుశా ఆ కొండగట్టు అంజన్న కూడా మెచ్చుకోడేమో. కొండగట్టు ఆంజనేయస్వామి తమ ఇంటి ఇలవేల్పు అని, అంజన్న దయతోనే తనకు పునర్జన్మ లభించిందని భక్తి, శ్రద్ధలతో కొండగట్టు అంజన్నను ఈ ఏడాది జనవరి 3న దర్శించుకొని గౌరవ మర్యాదలు, వేదాశీర్వచనాలు అందుకున్న పవన్ కళ్యాణ్ ప్రకటించారు. అదే రోజు సదరు నిధుల సాంక్షన్ గురించి చెప్పారు. నిధుల వ్యయం, పనులూ ఓ కొలిక్కి రాకముందే ఇట్లా గొప్పగా ప్రస్తావించడం గురించి ఆత్మవిమర్శ చేసుకోవాలి.

యథార్థానికి కొండగట్టు క్షేత్రం అభివృద్ధికి రూ.100 కోట్లతో కడపటి ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ జారీ చేయించిన జీవోను అమలు చేయాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ ఎల్.రమణ అంతకుముందు రోజు అంటే గత జనవరి 2న డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర, భద్రాచలం, కాళేశ్వరం వంటి ఆలయాలకు రూ. వందల కోట్లలో నిధులు మంజూరు చేస్తున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ యాదగిరిగుట్ట కోవెల వైభవోపేతానికి రూ.1350 కోట్లు మంజూరు చేశారు. అటువంటిది రూ. 35 కోట్లు తెలంగాణకు లేవా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో తక్షణం చలనం రావాలి. మన తెలంగాణ ఆత్మగౌరవం, మనోభావాల మీద రకరకాల గాయాలకు పూనుకొంటున్న దరిమిలా పవన్ కళ్యాణ్ ద్వారా నిధులు వచ్చింది నిజమే అయితే గనక ఆ రూ. 35 కోట్లు వాపసు చేయించాలి. కేసీఆర్ హయాంలోని ఉత్తర్వు ప్రకారం కొండగట్టు అంజన్న దేవాలయానికి రూ.100 కోట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖమ్మ, కంబైన్డ్ కరీంనగర్ జిల్లా వాస్తవ్యులు, పవన్ కళ్యాణ్ ను గట్టిగా ఢీకొంటున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా సత్వరం స్పందించి, సదరు రూ. 35 కోట్ల వ్యవహారం ఆత్మాభిమానం ప్రాతిపదికన తేల్చాలి. మాట పట్టింపునకు సందర్భం వచ్చినందున భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఆ డబ్బు రిటర్నుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
తెలంగాణ
9440850384

## అక్రమ గుట్కా వ్యాపారంపై ఉక్కుపాదం

- భారీగా నిషేధిత పొగాకు ఉత్పత్తుల
- స్వాధీనం వ్యాపారి అరెస్ట్



**చేవెళ్ల, జూన్ 3 (జనంసాక్షి) :** అక్రమ నిషేధిత గుట్కా, పాన్ మసాలా విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజారోగ్యానికి హానికరమైన పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలను ఉపేక్షించబోమని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. చేవెళ్ల గ్రామ రోడ్డులోని బాలాజీ జనరల్ స్టోర్‌లో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భారీ మొత్తంలో గుట్కా, పాన్ మసాలా, ఇతర నిషేధిత పొగాకు ఉత్పత్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమాని గుజరాతి యల్లప్ప (50) సంబంధిత అనుమతులు, ధ్రువపత్రాలు సమర్పించలేకపోవడంతో అతడిపై క్రైమ్ నెం.405/2026 కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. చేవెళ్ల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. భూపాల్ శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ దాడిలో నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ఏ. సంతోష్ రెడ్డి, పీసీ ఆనంద్, హెచ్‌జీ వెంకటయ్యలను అభినందించగా, వారి సేవలకు తగిన గుర్తింపు, ప్రోత్సాహక బహుమతి అందజేయనున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

## సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



**గద్వాల నడిగడ్డ, జూన్ 3 (జనం సాక్షి) :** గుడ్డెందొడ్డి ప్రాజెక్టు సందర్శనకు జిల్లాకు వస్తున్న సీఎం పర్యటన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం సాయంత్రం ధరూర్ మండలం గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ వద్ద హెలిపాడ్ నిర్మాణం, ఇతర పనులను జిల్లా కలెక్టర్ ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వాయర్ నుంచి పంప హౌస్ కు వెళ్లే దారి మరమ్మత్తు పనులు పూర్తి చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తును నియమించామని పేర్కొన్నారు. అంబులెన్స్, ఫైర్ వాహనం అందుబాటులో ఉంటుందని, అత్యవసర వైద్య సేవలకు అవసరమైన డాక్టర్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులను ఆహ్వానించడం మొదలుకొని తిరిగి వెళ్లే సమయం వరకు వీడ్కోలు పలికేందుకు అన్ని ఏర్పాట్లను ప్రోటోకాల్ ప్రకారం చేస్తున్నామన్నారు. జిల్లా ప్రాజెక్టులతో ఫోటో ఎగ్జిబిషన్, ఇతర ఏర్పాట్లన్ని చేయడం జరిగిందన్నారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ మధుమోహన్, అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డీఓ అనంత రెడ్డిపై గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్‌లో రైతులు, కూలీల ఫిర్యాదు



**యాచారం, జూన్ 3 (జనం సాక్షి) :** కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ రైతులు, రైతు కూలీల భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యం చేస్తున్న ఆర్‌డీఓ అనంత రెడ్డిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్‌లో భారీగా ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ రోజు మేడిపల్లిలో ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రైతులు, రైతు కూలీల అత్యవసర సమావేశం జరిగింది. కోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఆర్‌డీఓ అనంత రెడ్డి అక్రమంగా భూముల్లోకి చొరబడి, వాటిని చదును చేయిస్తూ, కరెంటు కట్ చేయిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మేడిపల్లి గుడి నుండి పోలీస్ స్టేషన్ వరకు రైతులు, కూలీలు అందరూ కలిసి భారీ పాదయాత్రగా వెళ్లి గ్రీన్ ఫార్మా సిటీ సీఐ సత్యనారాయణ కి ఫిర్యాదులు అందజేశారు. ఇందులో బాధిత కూలీలు 30 కంప్లైంట్లు ఇవ్వగా, రైతులు 11 కంప్లైంట్లు చొప్పున మొత్తం 41 ఫిర్యాదులను సమర్పించారు. ఈ ఫిర్యాదులను స్వీకరించిన సీఐ వీటన్నింటికీ అక్నొలెడ్జిమెంట్ ఇస్తామని తెలియచేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది

## ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూన్ 3 (జనం సాక్షి) :** ఈనెల 4న జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. ధరూర్ మండలం గుడ్డం దొడ్డి రిజర్వాయర్ వద్ద రెండు హెలిపాడ్స్ ను ఏర్పాటు చేయడంతో సీఎంతో పాటు మంత్రులకు స్వాగతం పలికేందుకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. పంపు హౌస్ లోపల సీఎం మీటింగ్ ఉంటుందని, వేదిక, ఇతర ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు మెడికల్ టీం, అంబులెన్స్, ఫైర్ వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ నోట్స్ తయారు చేసుకోవాలని, జిల్లా ప్రాజెక్టులతో కూడిన ప్రదర్శనకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, కిందకు విద్యుత్ తీగలు వేలాడకుండా సరి చేయించాలన్నారు. సీఎం పర్యటనలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బందోబస్తును నియమించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డిఓ శ్రీనివాసరావు,డీఎస్పీ మొగిలయ్య,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చీలపల్లి కేసులో మరో కీలక మలుపు

- పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్
- 142 గ్రాముల బంగారం, 870 గ్రాముల వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

**పెద్దశంకరంపేట, జూన్ 3 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా శంకరంపేట మండలం చీలపల్లి గ్రామంలో గత నెల సంచలనం సృష్టించిన భారీ చోరీ కేసు దర్యాప్తులో పోలీసులు మరో కీలక విజయాన్ని నమోదు చేశారు. ఇప్పటికే ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి భారీ మొత్తంలో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు, తాజాగా పరారీలో ఉన్న మరో నిందితుడు ఇప్పూ సింగ్‌ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 142 గ్రాముల బంగారం, 870 గ్రాముల వెండిని రికవరీ చేశారు. ఈ కేసు దర్యాప్తులో మొత్తం 11 చోరీ కేసులు వెలుగులోకి రావడం గమనార్హం. కేసు వివరాలను మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ మీడియాకు వెల్లడించారు.గత నెల మే 14వ తేదీ అర్ధరాత్రి అనంతరం చీల్పల్లి గ్రామంలోని ఐదు ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న దొంగలు రెండు ఇళ్లలో భారీ చోరీకి పాల్పడ్డారు. మూడు ఇళ్లలో ఎలాంటి సొత్తు దొరకకపోయినా, రెండు ఇళ్లలో సుమారు 112 తులాల బంగారం, రెండున్నర కిలోల వెండిని అపహరించారు. ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, పలువురు ఎస్ఐలు, ప్రత్యేక సిబ్బందితో కూడిన బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. అదనపు ఎస్పీ పర్యవేక్షణలో టెక్నికల్ టీమ్ సహకారంతో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. దర్యాప్తును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు కేవలం పది రోజుల్లోనే ప్రధాన నిందితుడు జైరాం జాధవ్‌ను అరెస్ట్ చేశారు. అతనికి సహకరించిన అతడి తల్లిని కూడా అదుపులోకి తీసుకుని న్యాయస్థాన రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి సుమారు ఒక కిలో బంగారం, 1.7 కిలోల వెండిని స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. ఇదే కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడు ఇప్పూ సింగ్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. విశ్వసనీయ సమాచారం మేరకు చంద్రతాండా ప్రాంతంలో అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ జరపగా, చోరీ సొత్తును సుభాష్ అనే వ్యక్తి వద్ద దాచిపెట్టినట్లు వెల్లడించాడు. దీంతో సుభాష్ కుటుంబ సభ్యుల సమక్షంలో భూమిలో దాచిన బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నారు.దర్యాప్తులో ఇప్పూ సింగ్ వర్ని ప్రాంతంలో మూడు, నస్రుల్లాబాద్ పరిధిలో నాలుగు, ఎల్లారెడ్డిపేట ప్రాంతంలో నాలుగు చోరీ కేసులతో కలిపి మొత్తం 11 కేసుల్లో తన ప్రమేయాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులకు సంబంధించిన బంగారం, వెండి సొత్తును కూడా రికవరీ చేసినట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న సొత్తును సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.అయితే చీల్పల్లి చోరీ కేసుకు సంబంధించిన మరికొంత బంగారం ఇప్పూ సింగ్ భార్య వద్ద ఉన్నట్లు సమాచారం లభించిందని, ఆమె కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. ఆమెను అదుపులోకి తీసుకుంటే మిగిలిన చోరీ సొత్తు



కూడా రికవరీ అయ్యే అవకాశం ఉందన్నారు.ఈ సందర్భంగా కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన సీఐ రేణుక రెడ్డి, ఎస్ఐలు ప్రవీణ్ రెడ్డి, శంకర్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న మొత్తం పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వేసవి కాలంలో ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు విలువైన బంగారం, నగదు వంటి వస్తువులను ఇంట్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. బయటకు వెళ్లే విషయాన్ని స్థానిక పోలీసులకు, బీట్ సిబ్బందికి తెలియజేయడంతో పాటు నమ్మకమైన పొరుగువారికి సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల అప్రమత్తతతోనే ఇటువంటి చోరీలను నివారించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రేణుక రెడ్డి, ఎస్ఐలు ప్రవీణ్ రెడ్డి, శంకర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ తయారీ రహస్య స్థావరం గుట్టురట్టు

**పరికరాలు, సామగ్రి స్వాధీనం**
**చాకచక్యంగా వ్యవహరించిన మహారాష్ట్ర పోలీసులు**



**కోహీర్, జూన్ 3 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని పీచే ర్యాగడి కొత్త తండా, శేఖాపూర్ సరిహద్దు అటవీ ప్రాంతంలో డ్రగ్స్ తయారీ కోసం ఏర్పాటు చేసిన స్థావరం గుట్టును మహారాష్ట్ర పోలీసులు రట్టు చేశారు. మహారా ష్ట్రలో పట్టుబడిన ఒక డ్రగ్స్ ముఠా సభ్యుడిని విచారించగా వచ్చిన సమాచారం మేరకు మే 31న ఈ దాడులు చేసినట్లు కోహీర్ ఎస్ఐ నరేష్ బుధవారం వెల్లడించారు. తమకు ఉన్న సమాచారం మేరకు మహారాష్ట్ర పోలీసులు అటవీ ప్రాంతంలో డ్రగ్స్ తయారీకి సిద్ధం చేస్తున్న రహస్య స్థావరాన్ని గుర్తించారు. అక్కడ మెఫెడ్రోన్ అనే డ్రగ్ తయారు చేయడానికి అవసరమైన ప్రయోగశాల, అందులో పరికరాలు, సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయితే, దాడుల్లో ఎలాంటి రసాయనాలు, మత్తు పదార్థాలు లభించలేదని ఎస్ఐ స్పష్టం చేశారు. ప్రభుత్వం అసైన్డ్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఓ వ్యక్తి రూ. ఆరు లక్షలకు కొనుగోలు చేసి, డ్రగ్స్ తయారీ కోసం చుట్టూ ప్రహరీ, గదులు నిర్మించినట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. ఇక్కడ పనిచేస్తున్న కార్మికుడిని పోలీసులు విచారించగా నాలుగు రోజుల క్రితమే ల్యాబ్ సామగ్రిని తీసుకువచ్చినట్లు తెలిపాడని వివరించారు. మహారాష్ట్ర పోలీసుల విచారణలో భాగంగానే ఈ ఆపరే షన్ జరిగిందని, అక్కడ దొరికిన ల్యాబ్ సామగ్రిని వారే సీజ్ చేసి తీసుకెళ్లారని ఎస్ఐ పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం చేయాలి



**కొల్లాపూర్/నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జూన్ 3 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నార్లాపూర్ వద్ద పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 4వ, 5వ తేదీన సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికార యంత్రాంగంతో కలిసి పథకం పనులను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ముఖ్యమంత్రి భద్రతా విభాగం అధికారులు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, ఇతర శాఖల అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ ప్యాకేజీ-3 కాలువల నిర్మాణ పనులు, ప్యాకేజీ-2 పరిధిలోని డెలివరీ సిస్టమ్, ప్యాకేజీ-1లోని పంప్ హౌస్ నిర్మాణాలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి సందర్శించే ప్రదేశాలు, ఆయనకు పథకం పురోగతిని వివరించే విధానం, భద్రతా ఏర్పాట్లు, ప్రజా ప్రతినిధుల సమన్వయం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ 4వ తేదీన సోమశిల లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా నిలుస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కీలక పాత్ర పోషిస్తుందని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ లు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు మంత్రికి వివరించారు. ముఖ్యమంత్రి సందర్శించే మార్గాలు, హెలిప్యాడ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, సమావేశ వేదిక, ప్రజా ప్రతినిధుల పాల్గొనడం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్రెడిటేషన్‌తో సంబంధం లేకుండా గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- ముఖ్యమంత్రికి జీహెచ్‌జే సొసైటీ విజ్ఞప్తి

**ముషీరాబాద్, జూన్ 3 (జనం సాక్షి) :** సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. మద్దతు ప్రకటించిన కోదండరాం సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరు కాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ




సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# పేట జిల్లా దశ మార్చే సీఎం పర్యటన విజయవంతం చేయాలి

- రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 3 (జనం సాక్షి) :** ఉమ్మడి పాలమూరు జిల్లాలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటన జిల్లా ప్రజల దశ దిశ ను మార్చివేస్తుందనీ రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.మక్తల్ లోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ స్కూల్ గ్రౌండ్లో సీఎం పర్యటనపై మంత్రి అధికారు లతో సమీక్షించారు.ఈ సంద ర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రేపు మధ్యాన్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెలికాప్టర్లో మక్తల్ లో బీసీ వెల్ఫేర్ స్కూల్ మైదాన ప్రాంగణానికి చేరుకున్న అనంతరం మక్తల్ - నారాయణపేట - కొడంగల్ ప్రాజెక్టు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. కృష్ణా, భీమా నదులపై బ్రిడ్జి కం బారేజ్ లను నిర్మించాలని గత కొన్ని రోజుల నుండి కర్ణా టక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు తో పలు దఫాలుగా చర్చించడం జరిగిందని మంత్రి వెల్లడిం చారు.ఇరు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో ఉంది కాబట్టి కొత్తగా కట్టబో యే ప్రాజెక్ట్ లకు ప్రయోజన కరంగా ఉంటుందని స్పష్టం చేశారు.అటు కర్ణాటక రాష్టంలో అడుగడుగునా బ్రిడ్జి కం బారేజ్ లు ఉన్నా యని, ఇక్కడ మన రాష్ట్రం లో కూడా సాగు,తాగు నీటి అవసరాల కోసం బారేజ్ లు కట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బ్యారేజీలు కట్టుకోవడం ద్వారా వర్షాకా లంలో




వృధాగా పోతున్న వందల టీఎంసీల నీటిని కాపాడుకోవచ్చని మంత్రి తెలిపారు.గత పాలకులు బ్యారేజీల నిర్మాణాన్ని పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఇక్కడి ప్రాంత రైతాంగాన్ని, ప్రజలను దృష్టిలో ఉంచుకొని సాగు, తాగు నీటికి శాశ్వతం పరిష్కారం దిశగా రేపు ముఖ్యమంత్రి ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్ట్ లపై ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు.మక్తల్ ప్రాంతం లో కృష్ణా, భీమా నదులపై నిర్మించతలపెట్టిన ప్రతిపా దిత బ్రిడ్జి కం బారేజ్ లకు ఇరు రాష్ట్రల ముఖ్యమం త్రులు ఒప్పుకున్నారని తెలియజేశారు. అదేవిధంగా తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల ను కలుపుతూ గూడ బల్లూర్ నుండి తంగిడి మీదుగా హైవే లను కలుపుతూ భీమా నది పై వంతెనను నిర్మిస్తే ఇరు రాష్ట్రాలకు కనెక్టివిటీ పెరిగి ప్రజలకు మరింత ప్రయోజన కరంగా ఉంటుందని తెలిపా రు. ఈ వంతెన నిర్మాణం పై రేపు సీఎంకు ఏరియల్ సర్వే ద్వారా వివరించనున్నట్లు మంత్రి తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న భూత్పూర్ నేరేడుగామ్ ముంపు గ్రామా ల ప్రజలకు సరైన పరిహారం ప్రకటించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వివరించారు.అగమ్యగోచరశీ గా ఉన్న ముంపు గ్రామాల ప్రజ ల కష్టాలను రేపు ముఖ్య మంత్రి కి వివరించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలి పారు. ముంపు గ్రామాల ప్రజలకు 1500 కోట్ల రూపాయలు నష్ట పరిహారం ఇచ్చేందుకు అంగీకరించిన సీఎం రేవంత్ రెడ్డికి,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి రైతుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మక్తల్ -నారాయణపేట -కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగం గా 99 శాతం రైతులను ఒప్పించి భూ నిర్వాసితులకు ఎకరానికి 20 లక్షల రూపా యలు ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదన్నారు. భూత్పూర్ రిజర్వాయర్లో 15 టీఎంసీ ల నీటిని నిలుపు కోవడానికి అవకాశం కల్పిం చేలా రేపు జరగబోయే ఏరి యల్ సర్వే ద్వారా సీఎంకు వివరిస్తానని మంత్రి తెలిపా రు. భూత్పూర్ రిజర్వాయర్లో 15 టీఎంసీల నీటిని నిలుపు కోగలిగితే ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉంటుందని మంత్రి వెల్లడించారు. రేపు జరగబోయే సీఎం పర్యట నను విజయవంతం చేయాలని రైతులకు ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

# మహిళా సంఘాల ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట



**పటాన్‌చెరు, జూన్ 3 (జనం సాక్షి) :** సమాజంలో మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక అభివృద్ధి, కుటుంబ సంక్షేమంలో మహిళా సంఘాలు (స్వయం సహాయక సంఘాలు) కీలక పాత్ర పోషిస్తున్నాయని.. నియోజకవర్గ పరిధిలోని ప్రతి స్వయం సహాయక సంఘానికి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా రుణాలు మంజూరు చేయడంతో పాటు వారి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అతి త్వరలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్, రైస్ మిల్లు ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు కేటాయించబోతున్నట్లు తెలిపారు. బుధవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిఆర్డిఏ, మెప్మ, యుడిసి, రెవెన్యూ, ఎక్సైజ్, హెచ్ఎండిఏ, శాఖల అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్ల ఏర్పాటుతో మహిళా సంఘాల సమాఖ్యలు డిఆర్డిఏ పరిధితో పాటు మెప్మా, యూడీసీల పరిధిలోకి వెళ్లడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ప్రతి మహిళా సంఘానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో రుణాలు మంజూరు చేయాలని డిఆర్డిఏ పిడి జ్యోతి కి సూచించారు. మహిళా సంఘాల ఆర్థిక అభ్యున్నతి కోసం కొల్లూరు లో పెట్రోల్ బంక్, గుమ్మడిదల మండలం కొత్తపల్లిలో రైస్ మిల్ ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరయ్యాయని.. త్వరలో వీటి ఏర్పాటుకు భూ కేటాయింపులు చేయనున్నట్లు తెలిపారు. గుమ్మడిదలలో మండల స్థాయి మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి సిఎస్ఆర్ నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు.

### డ్రగ్స్ నివారణకు సమగ్ర ప్రణాళిక

సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర ప్రణాళికను రూపొందించుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సంబంధిత అధికారులకు సూచించారు. నిరంతరం నిఘా పెడుతూ డ్రగ్స్ వినియోగం, విక్రయాలను కట్టడి చేయడంతో పాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు.

చెరువుల అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, దోషం చెరువుల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. మూడు చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరైన.. పనులు నత్త నడకన కొనసాగడంపై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత ఏజెన్సీ లతో సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని జిహెచ్ఎంసి చెరువుల విభాగం డిఈ అనిల్ ను ఆదేశించారు.

### కుల సంఘాలకు వెంటనే స్థలాలు కేటాయించండి

పటాన్చెరు డివిజన్ పరిధిలో స్లాటర్ హౌస్ (పశువధశాల) ఏర్పాటు కోసం ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని.. సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే భూమిని కేటాయించాలని మండల తహసిల్దార్ హరిబాబుకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి కోట అభివృద్ధి కోసం ఎన్ ఓ సి జారీ చేయాలని ఇప్పటికే కలెక్టర్ ను కోరడం జరిగిందని.. వెంటనే మంజూరు చేసేలా అధికారులతో సమన్వయం చేయాలని అమీన్పూర్ తహసిల్దార్ వెంకటేశంకు సూచించారు. లేనిపక్షంలో కోట అభివృద్ధి కోసం హెచ్ఎండిఏ ద్వారా మంజూరైన పది కోట్ల రూపాయల నిధులు వెనక్కి వెళ్ళిపోతాయని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి జ్యోతి, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యారావు, తహసిల్దారులు, వెంకటేష్, హరిబాబు, హెచ్ఎండిఏ డి ఈ రామారావు, ఎక్సైజ్ సీఐ పరమేశం, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో యువత ముందుండాలి



**గద్వాల నడిగడ్డ, జూన్ 3 (జనం సాక్షి) :** భావితరాలకు స్వచ్ఛమైన,ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో,ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక--99 రోజుల కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన మరియు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని తెలిపారు.భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.ప్లాస్టిక్ రహిత జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా సుస్థిర భవిష్యత్తుకు బాటలు వేయవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు ముఖ్యపాత్ర పోషించాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా అవగాహన కల్పించాలని కోరారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్లోగన్ రైటింగ్, ఎలక్యూషన్,వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు పేపర్ రీసైక్లబుల్ సీడ్ పెన్నులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సహాయ పర్యావరణ శాస్త్రవేత్త డా.విద్యులత, విద్యార్థులు, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలి

- మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



**కొల్చారం, జూన్ 3 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు బుధవారం కొల్చారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది విధుల నిర్వహణ, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించే దిశగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, బీట్ వ్యవస్థ అమలు, నేరాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించిన ఎస్పీ, స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని, సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ మహమ్మద్ మోహీనుద్దీన్ తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి



**పటాన్‌చెరు, జూన్ 3 (జనం సాక్షి) :** అమీన్పూర్ సర్కిల్, పటాన్చెరు సర్కిల్ పరిధిలోని తొమ్మిది డివిజన్ల సమగ్ర అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడంతో పాటు.. తెల్లాపూర్, అమీన్పూర్, బొల్లారం మున్సిపాలిటీలు జిహెచ్ఎంసిలో విలీనమయ్యే సమయంలో గల 250 కోట్ల రూపాయల మిగులు నిధులను సైతం డివిజన్ల అభివృద్ధికి మంజూరు చేయాలని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. బుధవారం గచ్చిబౌలిలోని సిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ సృజనతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా మినీ స్టేడియాలు, చెరువులు, స్మశాన వాటికలు, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని కోరారు. రెండు సర్కిళ్ల పరిధిలో శరవేగంగా నూతన కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని.. ఇందుకు అనుగుణంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విధి దీపాల ఏర్పాటుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్ సృజన.. త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమై పలు అంశాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపిస్తుందని.. దీని మూలంగా అభివృద్ధి పనులు నెమ్మదిగా సాగుతున్నాయని తెలిపారు. నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ పరిష్కరించాలని సూచించారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలో వరద నీటి సమస్య పరిష్కారానికి ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందని.. కాలువల నిర్మాణానికి 10 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయబోతున్నట్లు జోనల్ కమిషనర్ అమిత్.. ఎమ్మెల్యే జిఎంఆర్ కు తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలో గల రేడియం రోడ్డు లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ఉర్జిత్ విల్లాస్ సమీపంలో వరద నీటి సమస్య పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మినీ స్టేడియాల అభివృద్ధికి వెంటనే నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్సీ శంకరయ్య, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం



**నారాయణపేట, జూన్ 3 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరికి కరాటే ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో అవసరం అని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ అన్నారు. బుధ వారంకేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఎస్సార్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్ట్ లు సర్టిఫి కెట్స్ పంపిణీ చేశారు.ముందుగా బ్లాక్ బెల్ట్ సాధించిన స్రవంతి,భావేష్,నాయుడు.యం.అఖిల్. శివ శంకర్. అభిరామ్. లావణ్య. రిత్విక్.అర్జున్.లకు బ్లాక్ బెల్ట్ లు సర్టిఫికెట్ లను అందిం చారు. అనంతరం నామాజీ మాట్లాడుతు మాట్లాడుతూ విద్యార్థులందరూ కన్న తల్లిదండ్రుల పట్ల గౌరవంతో ఉండాలని. గురువులను పూజించాలని. సమాజం పట్ల ఎంతో బాధ్యతతో మెలగాలని సమాజంలో ఒకరికొకరు స్నేహభావంతో నడుచుకోవాలని సూచించారు. మాస్టర్ అశోక్‌కు మీ కరాటే అకాడమీ నుండి మంది విద్యార్థులకు కరాటే లో శిక్షణ ఇచ్చి సమాజానికి అందించాలనిఅన్నారు.ఇప్పుడు చదువు నేర్చుకుంటు న్న విద్యార్థులదరు ప్రతి ఒక్కరు విధిగా ప్రతి రోజు యోగ,రన్నింగ్, కసరత్తులు చేయాలని ఈ ఆధునిక కాలంలో ముఖ్యంగా మహిళ లకు కరాటేలో శిక్షణ తప్ప కుండా పొందాలని అప్పుడే మీరందరూ ఆపద సమయంలో మిమ్మల్ని మీరు రక్షించుకునే వారు అవు తారని.అన్నారు.క్రమ శిక్షణ కలిగిన విద్యార్థులు రేపటి భావిభారత పౌరులుగా మెలుగుతారు అని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సత్య రఘుపాల్ రెడ్డి, రవి కుమార్ గౌడ్, మాస్టర్ అను రాధ, షి టీమ్ పోలీస్ అధికారి బాల్ రాజు, రాకేష్ మాస్టర్, పేరెంట్ అశోక్, విద్యార్థులు, నర్సింహ, అమూల్య, ముకుందా, హరిప్రియ, రాకేష్, ఆనంద్, బృందా, అభిలాష్, మహేశ్వరి, సాత్విక్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**మక్తల్, జూన్ 03 (జనంసాక్షి) :** ఈనెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. బుధవారం మక్తల్ లోని ఎం జె పి గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన పై ఏర్పాట్ల గురించి కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమావేశం జరిగే ప్రాంతంలో అధికారులు అప్రమత్తంగా ఉండి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రెండు హెలిప్యాడ్లను సిద్ధం చేసి ఉంచాలని ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక శాఖ రెండు ఫైర్ ఇంజన్లు సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్ శాఖ విద్యుత్ సరఫరాపై అవసరమైతే జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహారపు తనిఖీ నిర్వహించి ధ్రువపరచాలన్నారు. హెలికాప్టర్ పరిసర ప్రాంతాలు ఎక్సైజ్ శాఖ పరిధి చూసుకోవాలని అటవీశాఖ ఆధ్వర్యంలో విషపురుగులు పాములు లాంటివి సంచరించకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. డీఎంహెచ్వో రెండు అంబులెన్సులను ఏర్పాటు చేయాలని కారుడియాలజిస్ట్ ఉండాలని తెలిపారు. ఆర్టీవో వాహనాలను చూసుకోవాలని కాన్వాయ్ ప్రకారంగా చూడాలన్నారు. ఇరిగేషన్ ఎస్సీ ప్రాజెక్టు పై పై. పి.టి.చేయాలన్నారు. ఫోటోగ్రఫీ ఫోటో ఎగ్జిబిషన్ గ్యాలరీ తదితర వాటిని చూడాలన్నారు. పరిసరాలలో ఎవరిని అనుమతించరాదని పోలీస్ శాఖకు తెలిపారు. అల్పాహారం అకామిడేషన్ తదితర ఏర్పాటు రెవెన్యూ శాఖ అధికారులు చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, అడిషనల్ ఎస్పీ వాసుదేవ రెడ్డి, ఐ ఎస్ డబ్ల్యూ, శ్యామ్, డిఎస్పీ లింగయ్య, ఆర్.డి.ఓ.రాజేశ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆర్మీలో ఎంపికైన భవ్యశ్రీకి సన్మానం



**మల్దకల్, జూన్ 3 (జనంసాక్షి) :** మండల పరిధిలోని నీలిపల్లి గ్రామంలోని శివకేశవరెడ్డి కుమార్తె భవ్య శ్రీ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆర్మీ ఉద్యోగం సంపాదించినకు బుధవారంజోగులాంబ గద్వాల జిల్లాఎన్ ఎస్ యూఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ శాలువా పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు,రాధాకృష్ణ, మహేందర్ రెడ్డి,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి

- ఇన్చార్జి తోపాజి అనంత కిషన్



**సదాశివపేట, జూన్ 3 (జనం సాక్షి) :** పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సదాశివపేట మున్సిపాలించాడు సోపతి అనంత కిషన్ తెలిపారు. బుధవారం సదాశివపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సదాశివపేట మున్సిపల్ ఇంచార్జ్ తోపాజి అనంత కిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సదాశివపేట మున్సిపల్ ఇంచార్జ్ అనంత కిషన్ కొత్త కమిటీల ఏర్పాటు చర్చించడంతో పాటు కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు తోపాజి అనంత కిషన్ ను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడిలో రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చాట్ల సిద్ధన్న, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడును పట్లూరి నాగరాజు గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం, కౌన్సిలర్లు శంకర్ గౌడ్, అరుణ్ కుమార్, నర్సింలు, సజ్జి, బిసి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పట్నం సుభాష్, మైనార్టీ నాయకులు వసీం దాదా, చోటు, మాజీ కౌన్సిలర్ లు, కోఆప్షన్ సభ్యులు, మహిళలు, వివిధ అనుబంధ సంస్థ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




**నర్సాపూర్, జూన్ 3 (జనం సాక్షి) :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వరల్డ్ బైసైకిల్ డే పురస్కరించుకొని నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని సిబ్బంది ఎఫ్ ఆర్ ఓ దివ్య ఆధ్వర్యంలో బుధవారం నర్సాపూర్ అటవీ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు సైకిల్ ర్యాలీలో అటవీ శాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం, కాలుష్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి వ్యక్తి సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించాలని, తద్వారా ఇంధన వినియోగం తగ్గి కాలుష్యం నియంత్రణకు దోహదపడుతుందని, అటవీ క్షేత్రాధికారి దివ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సిద్ధిరాంసింగ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సాయిరాం, కలియుముద్దీన్, రాజమణి శ్రీధర్ మరియు రేంజ్ బీట్ అధికారులు బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బొర్పట్లలో రూ.1,000 కోట్లతో 'థెరానైమ్ బయోలాజిక్స్'

- ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**సంగారెడ్డి, జూన్ 3 (జనం సాక్షి) :** తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చే దిశగా మరో కీలక అడుగు పడింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బొర్పట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన థెరానైమ్ బయోలాజిక్స్ తయారీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ప్రముఖ ఔషధ సంస్థ 'అరబిందో ఫార్మా'కు చెందిన పూర్తి స్థాయి అనుబంధ విభాగమైన థెరానైమ్ బయోలాజిక్స్, దాదాపు రూ.1,000 కోట్ల భారీ పెట్టుబడితో ఈ అత్యాధునిక ప్లాంట్‌ను నిర్మించింది. ఈ భారీ ప్లాంట్ ఏర్పాటు ద్వారా స్థానిక ప్రాంతానికి చెందిన 1,500 మందికి పైగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. ఈ బయోలాజికల్ ప్లాంట్‌లో క్యాన్సర్ మరియు ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సలో ఉపయోగించే అత్యాధునిక బయోలాజిక్స్, జీవ రసాయన మందులను తయారు చేయనున్నారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే నాణ్యమైన ఔషధాలను అమెరికా సహా పలు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనున్నారు. "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ ప్రతిష్టను ఇది ప్రపంచవ్యాప్తంగా మరింత పెంచుతుందని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. థెరానైమ్ సంస్థ గ్లోబల్ ఫార్మా దిగ్గజం సింగపూర్ విభాగంతో కుదుర్చుకున్న మాస్టర్ సర్వీస్ అగ్రిమెంట్‌లో భాగంగా ఈ కాంట్రాక్ట్ బయో-మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను నిర్మించింది. ఈ ఫెసిలిటీలో అత్యాధునిక మేమాలియన్ సెల్ కల్చర్ బయోరియాక్టర్లతో పాటు, ఏడాదికి సుమారు 2.5 నుంచి 3 కోట్ల (25-30 మిలియన్) వయల్స్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న ఐసోలేటర్ లైన్లను ఏర్పాటు చేశారు. తెలంగాణలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా, స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఫార్మా రంగ పెట్టుబడులకు తెలంగాణ ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యతగా నిలుస్తుందని ఈ సందర్భంగా మంత్రి డి. శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# నిబంధనల మేరకు నిర్మాణాలు పూర్తిచేస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల మంజూరు

**జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్**



**వరంగల్ ఎంజీఎం, జూన్ 3 (జనంసాక్షి):** నగర పరిధిలో నిర్మించిన భవనాలకు సంబంధించిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల మంజూరులో నిబంధనలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి బుధవారం ఖాజీపేటలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సమీపంతో పాటు కాజీపేట రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిర్మించిన పలు భవన సముదాయాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భవన యజమానులు సమర్పించిన పత్రాలను పరిశీలించడంతో పాటు, నిర్మాణాలకు సంబంధించిన కొలతలు, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ సౌకర్యాలు, ఇతర సాంకేతిక ప్రమాణాలను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు, భవన నిర్మాణ అనుమతి షరతులు మరియు సాంకేతిక ప్రమాణాలను పూర్తిస్థాయిలో పాటించిన భవనాలకే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయబడతాయని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, నగర ప్రణాళికాబద్ధ అభివృద్ధి దృష్ట్యా ప్రతి నిర్మాణాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించిన అనంతరమే తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. భవన యజమానులు నిర్మాణాల సమయంలో అనుమతులకు అనుగుణంగా పనులు చేపట్టి నగరాభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ పరిశీలనలో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టౌన్ ప్లానింగ్ అధికారులు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో

# 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'



**ములుగు ప్రతినిధి, జూన్ 03(జనంసాక్షి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక యొక్క 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి బుధవారం జిల్లా స్థాయిలో కళాశాల విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించింది. ఈ కార్యక్రమము జిల్లాస్థాయి నోడల్ ఆఫీసర్ గా వి అరుణాదేవి, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, ముఖ్యంగా యువత ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలను ఆచరణలో పెట్టి సమాజానికి మార్గనిర్దేశకులుగా నిలవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అవి 1) వ్యాసరచన –రెఫ్యూజ్ ప్లాస్టిక్ రిస్టోర్ నేచర్ 2) "పచ్చని భవిష్యత్తు కోసం సుస్థిర అభివృద్ధి" అంశంపై పోస్టర్ మేకింగ్, 3) పాటల పోటీ ,4)"ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు" అంశంపై వక్తృత్వ పోటీ. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవన విధానాలు, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాలపై విద్యార్థులు చురుకుగా తమ ప్రతిభను ప్రదర్శించారు. డా కె సరిత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగు, ఇంచార్జ్ ప్రిన్సిపల్ మరియు ఎకోక్లబ్ కన్వీనర్, తన సందేశంలో, విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించడం, సుస్థిర అభివృద్ధి భావనను బలపరచడం, హరిత భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్రను చాటి చెప్పడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను అలవరచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్ దేవకి, ఎన్ఎస్ఎస్, ప్రోగ్రాం కోఆర్డినేటర ప్రసన్న కుమార్, ఎండి ఆయాజ్ ఖాన్, పిఎం టిజిఎంఎస్ జూనియర్ కాలేజ్, బండారుపల్లి, విద్యార్థులతో పాటు పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మేమంటోలు అందజేయడంతో పాటు, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. హర్షిత, ఓస్ బారన్ మరియు సంజన వక్తృత్వంలో, బన్నీ పాటల విభాగశీ లో, ఏం సిరివెన్నెల, ఆసిఫ్, మోహిసినా పోస్టర్ మేకింగ్ లో, తన్మయి, మనోజ్, సుశాంత్ వ్యాసరచన పోటీలలో బహుమతులు గెలుపొందారు.

# రైతు బిడ్డకు కీలక బాధ్యత



**గీసుకొండ మండలం, జూన్ 3, (జనం సాక్షి) :** ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంలో డైరెక్టర్‌గా ఆకుల రుద్ర ప్రసాద్ నియామకం గీసుకొండ మండలంలో ఆనందాన్ని నింపింది. రైతు కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగి, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించే నాయకుడిగా గుర్తింపు పొందిన రుద్ర ప్రసాద్‌కు ఈ కీలక బాధ్యత దక్కడం స్థానికంగా చర్చనీయాంశమైంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలపడంతో గ్రామాల్లో శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, మిత్రులు, అభిమానులు పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేస్తున్నారు. ఫోన్ కాల్స్, ప్రత్యక్ష సమావేశాలతో గీసుకొండ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. రైతు సమస్యలపై అవగాహన, వ్యవసాయ మార్కెట్ వ్యవస్థపై పట్టు కలిగిన నాయకుడిగా రుద్ర ప్రసాద్‌కు మంచి పేరు ఉంది. ఆయన తండ్రి ఆకుల జనార్ధన్ రైతు ఉద్యమ నాయకుడిగా చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, అదే సేవా స్ఫూర్తితో రుద్ర ప్రసాద్ ముందుకు సాగుతారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ధాన్యం బస్తాలు దొంగిలించిన దొంగల అరెస్టు

- దొంగలలో ముగ్గురు మైనర్లు
- ఏసిపి సతీష్ బాబు




**శాయంపేట, జూన్ 3 ( జనం సాక్షి) :** వివిధ మండలాలలో తిరుగుతూ ధాన్యం బస్తాలను దొంగిలిస్తున్న 8 మంది దొంగలను శాయంపేట పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పరకాల ఏసిపి సతీష్ బాబు శాయంపేట పోలీస్ స్టేషన్ లో మీడియాతో మాట్లాడుతూ.. మొత్తం ఎనిమిది మంది కలిసి గ్రామాలలో ఉన్న ధాన్యం కల్లాలలో గన్ని సంచులలో నిలువ ఉన్న ధాన్యం బస్తాలను వారు తెచ్చుకున్న వాహనాలలో తరలిస్తూ గీసుకొండ మండలం గొర్రెకుంట శివారులో ఉన్న గణేష్ రైస్ మిల్లులో అమ్మే వారని తెలిపారు. వాహనాలలో ఒకటి వాళ్ళ ఫ్రెండ్స్ ది కాగా మరొకటి సెల్ఫ్ డ్రైవింగ్ క్రింది కిరాయికి తెచ్చుకున్నట్టు తెలిపారు. ఈ వాహనాలలో దొంగిలించిన ధాన్యాన్ని రాత్రిపూట తరలించేవారు అని పేర్కొన్నారు. వీరందరూ చదువుకున్న విద్యార్థులు అని స్పష్టం చేశారు .ఇందులో ముగ్గురు మైనర్లు కూడా ఉన్నట్లు తెలిపారు. 242 బస్తాల ధాన్యం సుమారు 135.86 క్వింటాళ్లు, వాటి విలువ సుమారు 3,26,000 రూ లు ఉంటుందని పేర్కొన్నారు. వారి వద్ద నుండి 3,05,200 రూ లు తో పాటు సెల్ ఫోన్స్ కార్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి తెలిపారు. ఐనవోలు మండలం సింగారంలో 20 బస్తాలు, కమలాపూర్ మండలం గూనిపర్తిలో 55 బస్తాలు, దామెర మండలం ల్యా దె ల్ల లో 52 బస్తాలు మరొకచోట 42 బస్తాలు, దామెర మండలం పులుకుర్తిలో 34 బస్తాలు, హసన్ పర్తి మండలం మల్లారెడ్డిపల్లిలో 27 బస్తాలు శాయంపేట మండలం పెద్ద కోడెపాకలో 8 బస్తాలు దొంగిలించినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ దొంగలు 22 సంవత్సరాలు లోపు వారని తెలిపారు. జల్సాలకు అలవాటు పడి దొంగతనం చేస్తున్నట్లు తెలిపారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డిని ఎస్ఐ పరమేష్, దామెర ఎస్సై అశోక్ ను పోలీసు సిబ్బందిని ఏసిపి అభినందించారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడమే డాక్టర్ల పాత్ర

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ
- ఎంజీఎం సమస్యల పరిష్కారానికి అభివృద్ధి కమిటీ సమీక్ష



**వరంగల్ ఎంజీఎం, జూన్ 03 (జనంసాక్షి):** ఎంజీఎం ఆసుపత్రిలో నెలకొన్న మౌలిక వసతులు, సిబ్బంది కొరత, వైద్య పరికరాల అవసరాలు, ఆరోగ్యశ్రీ రివాల్వింగ్ ఫండ్, నర్సింగ్ పాఠశాల భవనం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఎంజీఎం అభివృద్ధి కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పోస్టులు, అత్యవసర విభాగంలో రద్దీ, ఆధునిక వైద్య పరికరాల కొరత, పెండింగ్ బిల్లులు, పీఎంఎస్ఎస్‌వై ఆసుపత్రి నిర్వహణ సమస్యలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన నిధులు, పరికరాల సమీకరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న నర్సింగ్ స్కూల్ భవనం సమస్య, ఆసుపత్రి మౌలిక వసతుల అభివృద్ధి, పరికరాల మరమ్మతులు, సిబ్బంది భర్తీ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేసి సేవల మెరుగుదలకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, గతంతో పోలిస్తే ఎంజీఎంలో వైద్య సేవలు మెరుగుపడ్డాయని ఆమె పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడంలో వైద్యుల పాత్ర కీలకమని అన్నారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... ఉమ్మడి వరంగల్ జిల్లాలో అతిపెద్ద ప్రభుత్వ వైద్య సంస్థగా ఎంజీఎం నిరుపేదలకు ఆపద్బాంధవుడిగా నిలుస్తోందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం హెచ్‌డీఎస్ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పీఎంఎస్ఎస్‌వై పథకం కింద మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. న్యూరో సర్జరీల సంఖ్య తగ్గడంపై ఆరా తీసిన ఆమె, ఆ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. వైద్యులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు నమోదు చేసి విధుల్లో అందుబాటులో ఉండాలని, రోగుల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ... ఎంజీఎం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు నైపుణ్యం కలిగిన వైద్యులను నియమించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఆసుపత్రుల ప్రక్షాళన, అభివృద్ధి, నాణ్యమైన వైద్య సేవలందించడంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. ఎంజీఎం అభివృద్ధి కమిటీ సమావేశాల ద్వారా మౌలిక వసతులు, మానవ వనరులు, పరిపాలనా అంశాలపై తరచూ సమీక్షలు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం మంత్రి కొండా సురేఖ ఎంజీఎం ఆసుపత్రిలోని ఏఎంసీ కేర్ సెంటర్‌ను సందర్శించి రోగులను పరామర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, వైద్యుల పనితీరును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రరెడ్డి, ఐఆర్‌సీఎస్ ప్రతినిధి ఈవి శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది మంత్రితో పాటు ఉన్నారు. ఈ సమావేశంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రరెడ్డి, డాక్టర్ అశ్విన్‌కుమార్, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీబీసీడీవో పుష్పలత, డీటీడీవో నారాయణరెడ్డి, డీఆర్‌డీవో నాగపద్మజ, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బి. శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ టి. రఘునాథ్‌స్వామి, డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్. మురళి, డాక్టర్ అనిల్, కేఎస్‌కే ప్రసాద్, డాక్టర్ లోకేష్‌కుమార్, డాక్టర్ మన్మోహన్‌రాజ్, ఐఆర్‌సీఎస్ ప్రతినిధి ఈవి శ్రీనివాస్, వనపర్తి శ్రీనివాస్, కన్నోజు లావణ్య రమేష్, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ సంధ్య, డాక్టర్ శరత్‌బాబు, ఎంజీఎం వైద్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి

- ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జూన్ 03(జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వీటిని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సభలకు మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని, ఇందుకు సంబంధించిన సిబ్బంది వివరాలను తక్షణమే సమర్పించాలని ఆదేశించారు. ఎండాకాలం తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్రామ సభలను ఉదయమే నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సభలు జరిగే చోట తాగునీరు వంటి అన్ని కనీస మౌలిక వసతులు కల్పించాలని, షెడ్యూల్ వివరాలను గ్రామాల్లో ముందే చాటింపు వేయించి ప్రజలకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సభలలో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం మొక్కలు నాటేలా అవగాహన కల్పించాలని సూచించారు. రహదారుల చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ లో మొక్కలు నాటాలని తెలిపారు. మురుగుకాల్వలు పరిశుభ్రం చేయుట, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇండ్ల నుండి వచ్చే మురుగునీరు రోడ్లపైకి వెళ్లకుండా కమ్యూనిటి, వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. గ్రామసభలలో మహిళల రక్షణ, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో గ్రామాలలో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, భారీ అకాల వర్షాల వల్ల వాగులు వంకలు పొంగితే తీసుకోవాల్సిన రక్షణ చర్యలు ప్రజలను తరలించేందుకు అవగహన కల్పించాలని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, రాష్ట్ర, కేంద్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన బృందాలను, రెస్క్యూ బృందాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఎన్ లినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంటల అవశేషాలు కాల్చొద్దని దాని వల్ల భూమిలో ఉన్న పోషకాలు చనిపోతాయని కలియదున్నడం వల్ల భూమికి బలం పెరుగుతుందని తెలిపారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా అధికారులు, తహసిలార్లు, ఎంపిడిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ, వార్డు సభల్లో పలు అంశాలపై చర్చించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 03(జనంసాక్షి) :** గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించే గ్రామ, వార్డు సభలలో పలు కీలక అంశాలపై చర్చించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి అన్ని మండలాల అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ సభలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా నాణ్యత,రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి అని,ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలి అని అన్నారు. క్లోరినేషన్ ప్రక్రియ నిరంతరం జరిగేలా చూడాలి అని, పరిశుభ్రత డ్రైనేజీల నిర్వహణ గ్రామాల్లో, మున్సిపల్ వార్డులలో వీధులు, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి అని,నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ చర్యలు చేపట్టాలి అంజి అన్నారు. మురికి కాలువల పూడికతీత పనులు వేగవంతం చేయాలి అని అన్నారు. వ్యవసాయం విత్తనాలు, ఎరువులు వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలి అని,నకిలీ విత్తనాల అమ్మకాలపై కఠినంగా వ్యవహరించాలి అని,వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు అవగాహన కల్పించాలి అని అన్నారు. ఓటరు నమోదు ప్రక్రియఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం బూత్ లెవెల్ అధికారులు (బీ ఎల్ ఓ ) ఓటరు నమోదు, సవరణల ప్రక్రియను వేగవంతం చేయాలి అని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా గ్రామ సభలలో అవగాహన కల్పించాలి అని అన్నారు. వైద్యారోగ్యం (టీబీ వ్యాధి నిర్మూలన), గ్రామాల్లో టీబీ (టీబీ ) వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి సరైన వైద్య సహాయం,ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందేలా చూడాలి అని అన్నారు. సంక్షేమ పథకాలు, ప్రగతి పనులు 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పెండింగ్‌లో ఉన్న సంక్షేమ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి అని,స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ ) మహిళలకు అవసరమైన రుణాలు, ప్రోత్సాహం అందించాలి అని,గ్రామాలలో పారిశుద్ధ్యం విద్యుత్ ఆదా సమస్యల పరిష్కారాలపై ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రోత్సాహంతో పాటు నగదు బహుమతి అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ (స్థానిక సంస్థలు), జెడ్పీ సీఈఓ, డీఆర్డీఓ, డీపీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఈఈహ (ఆర్ఆర్ డబ్ల్యూఎస్), వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వృద్ధుడి మృతి




**చిట్యాల, జూన్ 03 (జనం సాక్షి):** మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన మాశబోయిన రాజయ్య (65) అనే వృద్ధుడు వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో చల్లగరిగ గ్రామ శివారులోని తను కౌలు కి తీసుకున్న పొలంలో మక్కజొన్న చొప్ప కలపెట్టేందుకు వెళ్లాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం 11:30 గంటల సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై, పక్కనే ఉన్న చెట్టు కింద స్పృహతప్పి పడిపోయాడు. ఇది గమనించిన సమీపంలోని వ్యక్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు మాశబోయిన రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

**చిట్యాల, జూన్ 03 (జనంసాక్షి) :** కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిట్యాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కన్నూరు గ్రామానికి చెందిన బోంత రాములు కుమార్తె గొల్లెన లక్ష్మి (25) కి 2016లో రేపక గ్రామానికి చెందిన గొల్లెన హరితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా మంగళవారం మధ్యాహ్నం భర్తతో గొడవపడిన లక్ష్మి, తీవ్ర మనస్తాపానికి గురై అక్కడి నుండి చిట్యాల వాళ్ళ మెనా మామ అయిన ఓర్సు రాజయ్య ఇంటికి వచ్చి చిట్యాల గ్రామానికి చెందిన అల్లం తిరుపతి ఎడ్ల కొట్టం వద్ద మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తరలించే లోపే ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి బోంత రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు.

## యువతి ఆత్మహత్య



**గుడిహత్నూర్ (జనం సాక్షి) :** గుడి హత్నూర్ మండలంలోని బెల్లూరి గ్రామంలో మంగళవారం సాయంత్రం సాయంత్రం 6:30 గంటలకు ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు .క్యాన్సర్ వారితో బాధపడుతున్న యువతి తన అనారోగ్యం కారణంగా కుటుంబానికి ఎక్కడ భారం అవుతుందన్న తీవ్ర మనస్తాపంతో మంగళవారం రాత్రి ఆరున్నర గంటలకు తీవ్రమనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. క్యాన్సర్ తో బాధపడుతున్న యువతి కుటుంబ సభ్యులు పడుతున్న వేదనను జీర్ణించి లేక తను బతికి ఉంటే కుటుంబానికి భారం అవుతుందన్న ఉద్దేశంతో ఆత్మహత్య చేసుకుందామని కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్న వయసులోనే అర్ధాంతరంగా చనిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
04 జూన్ 2026

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

- ఆయిల్ పామ్, ఉద్యాన పంటలే రైతుల భవిష్యత్‌కు భరోసా
- నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- పంట అవశేషాలకు నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవు
- మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 3 (జనం సాక్షి) :** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం తో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూలి భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్టె విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశంలోని అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు ఫ్యాక్టరీ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దేశంలో పత్తి సాగు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ విదేశాల నుంచి పత్తి దిగుమతులు చేయడం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల దేశీయ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందన లేదన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి



**వలిగొండ, జున్ 3 (జనం సాక్షి) :** నిర్ణీత గడువులోగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు పూర్తిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వలిగొండ మండలం లోతుకుంట గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా కలెక్టర్ , రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట రెడ్డి తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్మా ట్లాడుతూ...జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో కేజీబీవీలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తరగతి గదులు, వసతి గృహాలు, తాగునీరు, పారిశుద్ధ్యం ,మరుగుదొడ్ల తదితర సౌకర్యాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రారంభం అయ్యే నాటికి పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల నాణ్యతను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అనుకూల వాతావరణం కల్పించడం పై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి బిక్షపతి,పంచాయతీరాజ్, ఆర్‌డబీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**వలిగొండ, జూన్ 3 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు, ధాన్యం ఆన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం వలిగొండ మండలం నాగారంలోని వాసవి రైస్ మిల్లును జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంక రెడ్డి తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రైస్ మిల్లులో దాన్యం లోడు లారీలు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. లోడ్ తో వచ్చిన లారీలను ఎప్పటికపుడు అన్లోడ్ చేయాలన్నారు. ప్రతి రోజు ధాన్యం లోడుతో ఎన్ని లారీలు మిల్లుకు వస్తున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఒక్కో లారీ అన్లోడ్ చేయడానికి ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకొని వచ్చిన వెంటనే హమాలీలతో అన్లోడ్ చేయించాలన్నారు. ధాన్యం అన్లోడ్ చేయడం కోసం మిల్లులో హమాలీలు సరిపడా ఉన్నారా లేదా అని ఆరా తీసి సరిపడ హమాలీలు లేకపోతే ఎక్కువ మందిని పెట్టుకొని ధాన్యం దిగుమతి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితిల్లోను మిల్లుల వద్ద ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలు ఆగడానికి వీలు లేదన్నారు. ఏ రోజు వచ్చిన లారీ ఆరోజే అన్లోడ్ చేసి. పంపించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంట వెంటనే లారీలను తిరిగి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి రోజా రాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బస్సు సర్వీస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**రామన్నపేట, జూన్ 3 (జనంసాక్షి) :** రామన్నపేట మండల కేంద్రం నుంచి వేములకొండ వరకు ఆర్టీసీ బస్సు సర్వీస్ ను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో బస్సును ప్రారంభించారు. నీర్నెముల, లక్ష్మాపురం, శోభనాద్రిపురం, కొత్తగూడెం, వేములకొండ గ్రామాల ప్రజలకు ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆ గ్రామాల ప్రజలు ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేదుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం జాన్ రెడ్డి, జిల్లా డీసీసీ జనరల్ సెక్రెటరీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, స్థానిక సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉప సర్పంచ్ మోటే రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ జమిరుద్దీన్, నాయకులు శంబాల వెంకటేష్, సాల్వేరు అశోక్, గుత్తా నరసింహారెడ్డి, గోదాసు పృథ్వీరాజ్, బత్తుల కృష్ణ గౌడ్, ఎండి అక్రమ్ మదూరి జ్యోతి రామచంద్రరావు, కందిమల్ల గోపాల్ రెడ్డి, పైల వెంకటరెడ్డి, పెద్దగోని వెంకటేశం, యాదాసు యాదయ్య, కొమ్ము శేఖర్, గోరిగే శేఖర్, నోముల ప్రవీణ్ కుమార్, అశోక్, ఎండి నాసర్ తదితరులున్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలి



**దేవరకొండ, జూన్ 3 (జనం సాక్షి) :** బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఓటర్ల జాబితా సవరణ విధానాలపై దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, రాజకీయ ప్రయోజనాల కోసం ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచే వర్గాల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి బీజేపీ ప్రభుత్వం భయపడుతోందని, ముఖ్యంగా రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అడ్డుకోవాలనే రాజకీయ ఉద్దేశంతో ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించబడిన ఘటనలు ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడులకు నిదర్శనమని పేర్కొన్నారు. ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఓటరు తన పేరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, బూత్ లెవెల్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. దేవరకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా నియమితులైన కట్ల రంగారావుతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కార్యకర్తలు గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణం. ప్రతి ఓటు విలువైనది. ప్రజల స్వరాన్ని అణగదొక్కే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు.

## స్మశాన వాటిక భూమిని కాపాడండి

- అధికారులకు కమ్మదనం గ్రామస్థుల వినతి



**ఫరూఖ్‌నగర్, జూన్ 3 (జనంసాక్షి) :** అన్యాక్రంతమవుతున్న స్మశాన వాటిక భూమిని కాపాడండని అధికారులకు కమ్మదనం గ్రామస్థుల వినతి పత్రాన్ని అందజేశారు. ఆసైండ్ భూమిలో గత ప్రభుత్వం నిర్వహించిన స్మశాన వాటిక భూమి అన్యాక్రాంతం బుధవారం నాడు తహసీల్దార్ కు, ఆర్డీఓ కార్యాలయం లోని ఏఓకు కమ్మదనం గ్రామస్థులు వినతిపత్రన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్మదనం గ్రామ పరిధిలో లో గల సర్వే నెంబర్ 147 ప్రభుత్వ అసైండ్ భూమిలో గత ప్రభుత్వ పాలనలో కలెక్టర్ ఆదేశానుశారంగా రైతులనుండి సేకరించి 1:20 గుంటల భూమిని గ్రామ పంచాయతికి కేటాయించారని తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన స్మశాన వాటిక ను గ్రామస్తులందరు కుల మతాలకు అతీతంగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. అన్ని సక్రమంగా సాగుతున్న క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపార వేత్త రఘు నాయక్ అనే వ్యక్తి కళ్లేపల్లి ఎల్లయ్య అనే వ్యక్తి పేరుపైన డిలేట్ అయినా 1-38 గుంటల అసైండ్ భూమిని 2026 వ సంవత్సరం లో కళ్ళే పల్లి ఎల్లయ్య వారసుల దగ్గర కొనుగోలు చేశమంటూ స్మశాన వాటిక భూమిని అన్యాక్రాంతం చేశారాణి వాపోయారు. మా గ్రామస్థుల ఆత్మ గౌరవానికి భంగం కలిగిస్తూ ప్రికాస్ట్ నిర్మాణం చేసిన వారిపై తగు చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిరణ్ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ జగన్, గ్రామస్తులు తిరుపతయ్య, మల్లేష్, సత్యనారాయణ, నర్సింహ రెడ్డి, యాదయ్య, వెంకటేష్, కుమార్, రాజేశ్వరి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ సర్కిల్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

**శేరిలింగంపల్లి, జూన్ 3 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ బుధవారం మియాపూర్ సర్కిల్ పరిధి పెద్దకుడి చెరువు, పటేల్ చెరువు వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జాతీయ రహదారి వెంట మియాపూర్ సర్కిల్‌లోని వివిధ కాలనీల పరిధిలో వర్షపునీరు నిలిచిపోతున్న ప్రాంతాలను క్షేత్రస్థాయికి వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్సి నారాయణ్ అమిత్ మాట్లాడుతూ డ్రైనేజీ మెరుగుదల పనులను వేగవంతం చేయాలని, నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు తగిన ఆదేశాలను జారీ చేసినట్లు



తెలియజేశారు. చెరువుల అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టంచేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ విభాగం, శానిటేషన్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంట ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**దేవరకొండ, జూన్ 3 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోని కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,నేనావత్ బాలు నాయక్, స్థానిక శాసనసభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని కొండ భీమనపల్లి గ్రామంలో శంకర నేత్రాలయ వారి సౌజన్యంతో, ఎంవీఆర్ ఫౌండేషన్ మునుకుంట్ల వెంకట్ రెడ్డి, మునుకుంట్ల విద్యావతి,మునుకుంట్ల తిరుమల్ రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తో పాటు స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ శిబిరంలో భాగంగా కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు సైతం 10 రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా వృద్ధులు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్ గారు, ప్రజల ఆరోగ్యం కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, సామాజిక ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి, 136 గొర్రెలు మృతి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్,
- గొర్రెలు మరియు మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత-తిరుపతయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ క్యామ మల్లేష్



**దేవరకొండ, జూన్ 3 (జనం సాక్షి) :** డిండి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో జరిగిన విషాదకర ఘటనలో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రానికి చెందిన "గొర్ల కాపరి ఎల్లయ్యతో పాటు 136 గొర్రెలు మృతి" చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘటన విషయం తెలుసుకున్న వెంటనే స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్,ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత-తిరుపతయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ క్యామ మల్లేష్ తో కలిసి ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుల స్వస్థల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తదుపరి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుడు ఎల్లయ్య మృతదేహానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తక్షణ సహాయంగా యాదవ సంఘం తరఫున రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, గొర్ల కాపరులు తమ జీవనాధారమైన గొర్రెలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, తద్వారా ఇలాంటి అనుకోని ఘటనలు జరిగినప్పుడు ఆర్థిక భద్రత లభిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, యాదవ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభలను విజయవంతం చేయాలి



**భువనగిరి, జూన్ 3 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న వార్డు సభలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. బుధవారం భువనగిరి పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో జూన్ 4, 6, 8, 10 తేదీలలో జరగనున్న వార్డు సభల నిర్వహణపై కౌన్సిల్ సభ్యులు, అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రతి వార్డు సభ్యుడు చురుకుగా పాల్గొనాలని కోరారు. వార్డు స్థాయిలో ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై సమగ్ర చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సభల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల భాగస్వామ్యంతో వార్డు సభలు విజయవంతంగా సాగేందుకు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ కె. చంద్రప్రకాశ్ రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో
# కొత్త 'సిరీస్' ఫీచర్..!

**న్యూఢిల్లీ:**ప్రముఖ సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్ ఫేస్‌బుక్‌లలో కొత్త 'సిరీస్' ఫీచర్‌ను తీసుకురావడానికి మెటా ప్రయత్నిస్తోంది. ఈ ఫీచర్ ద్వారా క్రియేటర్లు మల్టిపుల్ రీల్స్‌తో సిరీస్‌లు చేసే అవకాశం ఉంటుంది. వారు తమ రీల్స్‌ను ఒకే సిరీస్‌లోని వేర్వేరు ఎపిసోడ్‌లుగా కలిపి ప్రేక్షకులకు అందించవచ్చు. ప్రస్తుతం ఎంపిక చేసిన కొంతమంది క్రియేటర్లతో మెటా ఈ ఫీచర్‌ను పరీక్షిస్తున్నట్లు టెక్‌క్రంచ్ నివేదికలు వెల్లడించాయి. ఈ కొత్త సౌకర్యంతో ఒకే అంశానికి సంబంధించిన పలు వీడియోలను వీక్షకులు ఒకేచోట చూడగలుగుతారు. అలాగే, కొత్త వీడియోలతో పాటు పాత రీల్స్‌ను కూడా సిరీస్‌లో చేర్చే అవకాశం ఉంటుంది. ఈ ఫీచర్ ద్వారా ఒకరి ప్రొఫైల్, అప్‌లోడ్‌లను బ్రౌజ్ చేయాల్సిన అవసరం లేకుండా వినియోగదారులు ఒక రీల్ నుంచి నేరుగా అటువంటి ఫీడ్ ఉండే మొత్తం సిరీస్‌ను చూడగలరు. దీంతో ఎపిసోడ్‌లను మిస్ అయ్యే అవకాశం ఉండదు. ఈ ఫీచర్ ద్వారా క్రియేటర్లకు ఆదాయ అవకాశాలు కల్పించే మార్గాలను కూడా మెటా పరిశీలిస్తోంది..




## పబ్లిక్ ఇష్యూకు ఆంత్రోపిక్!
### అమెరికా ఎస్ఈసీకి దరఖాస్తు పత్రాల సమర్పణ

**వాషింగ్టన్:**కృత్రిమ మేధ సంస్థ ఆంత్రోపిక్ అమెరికా స్టాక్ మార్కెట్లో నమోదయ్యే దిశగా కీలక అడుగు వేసింది. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించేందుకు అనుమతి కోరుతూ యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ)కు రహస్య పద్ధతిలో ముసాయిదా పత్రాలు సమర్పించినట్లు తెలుస్తోంది. ఈ దరఖాస్తు పత్రాలను ఎస్ఈసీ సమీక్షించి, అనుమతులు ఇచ్చాక.. పబ్లిక్ ఇష్యూ నిర్వహణకు అవకాశం కలుగుతుందని కంపెనీ పేర్కొంది. మార్కెట్ పరిస్థితులు, ఇతరత్రా అంశాలపై ఆధారపడి, పబ్లిక్ ఇష్యూకు వెళ్తామని వివరించింది. పబ్లిక్ ఇష్యూలో జారీ చేయనున్న షేర్ల పరిమాణం, ఇష్యూ ధరల శ్రేణి లాంటి వివరాలను ఆంత్రోపిక్ వెల్లడించలేదు. ప్రైవేటు ఫండింగ్ పద్ధతిలో 65 బిలియన్ డాలర్లు (సుమారు రూ.6 లక్షల కోట్లు) సమీకరించినట్లు ఆంత్రోపిక్ ప్రకటించిన కొద్ది రోజులకే, ఐపీఓకు సన్నాహాలు చోటుచేసుకోవడం గమనార్హం. తాజా నిధుల సమీకరణతో ఆంత్రోపిక్ విలువ 965 బిలియన్ డాలర్ల కు చేరడమే కాకుండా.. వ్యవస్థాపితమైన అయిదేళ్లలోనే ప్రపంచంలో అత్యంత విలువైన అంకుర సంస్థల్లో ఒకటిగా ఆంత్రోపిక్ నిలిచింది. కోడింగ్, కార్యాలయ అవసరాలు, వ్యక్తిగత సహాయం కోసం తమ ఏఐ సాంకేతికత ఉపయోగించే వినియోగదార్ల నుంచి, సంవత్సరానికి 47 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.50 లక్షల కోట్ల) ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్లు ఆంత్రోపిక్ తెలిపింది. తాజా విలువ ప్రకారం.. మార్కెట్ విలువ, ఆదాయం రెండింటిలోనూ తన ప్రధాన పోటీ సంస్థ అయిన ఓపెన్ ఏఐ కంటే ఆంత్రోపిక్ ముందుంది.

**మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా..**
# నష్టాల్లో దేశీయ మార్కెట్లు

**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రమవడంతో సూచీలు నష్టాల్లో కదలాడుతున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా పతనమైంది. ఉదయం 9.35 గంటలకు సెన్సెక్స్ 882 పాయింట్లు క్షీణించి, 73,772 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 220 పాయింట్లు కోల్పోయి, 23,271 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.50గా ఉంది. నిఫ్టీ సూచీలో అదానీ పోర్ట్స్, అపో లో హాస్పిటల్స్, కోల్ ఇండియా, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉన్నాయి. టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ షేర్లు నష్టపోతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల శాంతి ఒప్పందం ఖాయమైనట్లు కనిపించింది. మళ్లీ అంతలోనే అమెరికా దాడులు చేయడంతో... దాని మిత్ర దేశాలపై ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. తమ ఖేష్మ్ ద్వీపంపై దాడికి ప్రతిస్పందనగా అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నామని ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఒప్పందంపై అనిశ్చితి, రష్యా చమురు కొనుగోలు చేసేందుకు ఇచ్చిన మినహాయింపులు ఎత్తివేయాలని అగ్రరాజ్యం భావిస్తుండటంతో ముడి చమురు ధరలు మళ్లీ పెరిగాయి. అలాగే భారత్ సహా 54 దేశాలపై యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అదనపు సుంకం ప్రతిపాదించడం ప్రభావం చూపిస్తోంది. మరోవైపు నిన్న లాభాల్లో దూసుకెళ్లిన ఐటీ రంగం.. నేడు నష్టాల్లోకి జారుకుంది.



## విప్రో ఛైర్మన్ కంటే.. సీఈఓకు 7 రెట్లు ఎక్కువ ఆదాయం




ప్రముఖ టెక్ సంస్థ విప్రో సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ పల్లియా.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.49.6 కోట్ల వేతన రెమ్యునరేషన్‌ను అందుకున్నారు. ఈ మేరకు కంపెనీ వార్షిక నివేదిక వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆయన రూ.53.6 కోట్ల ప్యాకేజీని అందుకోగా.. ఈ ఏడాది ఆ మొత్తం కాస్త తగ్గింది. పనితీరు ఆధారిత పరిహారంలో కోత విధించడం వల్లే ఈ రెమ్యునరేషన్ తగ్గినట్లు విప్రో వెల్లడించింది. అయినప్పటికీ విప్రోలో అత్యధిక వేతనం పొందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ పల్లియానే అని కంపెనీ పేర్కొంది. సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీతో పోలిస్తే.. సీఈఓ ఆదాయం దాదాపు 7 రెట్లు ఎక్కువ ఉండడం విశేషం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ.. రిషద్ ప్రేమ్‌జీ రూ.7.3 కోట్ల వేతన ప్యాకేజీని అందుకున్నారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఆయన వేతనం రూ.13.8 కోట్లుగా ఉండటం గమనార్హం. 2024 ఏప్రిల్‌లో శ్రీనివాస్ పల్లియా విప్రో సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. మార్కెట్ విలువ ప్రకారం దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ అయిన విప్రో.. కొంతకాలంగా మందగమనంలో కొనసాగుతోంది. దీంతో ఎగ్జిక్యూటివ్‌ల వేతనాలపై ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇదొక్కటే కాదు.. దేశంలోని పలు ఐటీ కంపెనీలు కూడా ఆదాయం నెమ్మదించడంతో వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టాయి.


## సంపదలో ముకేశ్ అంబానీని దాటేసిన టిక్‌టాక్ ఫౌండర్




**న్యూఢిల్లీ:**చైనాకు చెందిన టిక్‌టాక్ వ్యవస్థాపకుడు ఝాంగ్ యిమింగ్ ఆసియాలోనే రెండో అత్యంత సంపన్నుడిగా అవతరించారు. భారత ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని దాటి ఈ స్థానానికి చేరుకున్నారు. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీ వెల్లడించింది. ప్రస్తుతం ఝాంగ్ నికర సంపద రూ.92.8 బిలియన్ డాలర్లుగా ఉండగా.. ముకేశ్ అంబానీ 86.9 బిలియన్ డాలర్ల సంపదతో మూడో స్థానంలో ఉన్నారు. ఇక, ఆసియాలోనే అత్యంత సంపన్నుడిగా అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఆయన నికర సంపద 117 బిలియన్ డాలర్లు. టిక్‌టాక్ మాతృ సంస్థ అయిన బైట్‌డ్యాన్స్ లిమిటెడ్ మార్కెట్ విలువ పెరగడం, ఈ కంపెనీ ఏఐ లక్ష్యాలపై మదుపర్లు ఆశాజనకంగా ఉండటంతో ఝాంగ్ నికర సంపద భారీగా పెరిగినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక తెలిపింది. 2019 మార్చిలో ఆయన నికర సంపద 13 బిలియన్ డాలర్లు కాగా.. ఈ ఏడేళ్లలో ఏడు రెట్లు పెరగడం విశేషం. ఇటీవలే బైట్‌డ్యాన్స్ కంపెనీ తీసుకొచ్చిన డౌబావో ఏఐ చాట్‌బాట్ చైనాలో పాపులర్ అయ్యింది. నెలవారీ యూజర్ల సంఖ్య 300 మిలియన్లు దాటింది. బైట్ డ్యాన్స్ కంపెనీని ఝాంగ్ 2012లో స్థాపించారు. దీనికింద టౌషియావో పేరుతో మీడియా అగ్రిగేటర్, డౌయిన్ పేరుతో వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చారు. ఈ డౌయిన్ అంతర్జాతీయంగా 'టిక్‌టాక్' పేరుతో తెగ పాపులర్ అయిన సంగతి తెలిసిందే. ఆ మధ్య అమెరికాలో దీని కార్యకలాపాల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. చివరకు బైట్‌డ్యాన్స్ అమెరికాలో తమ వ్యాపారాన్ని.. ఒరాకిల్ నేతృత్వంలోని కన్సార్షియంకు బదిలీ చేసింది. ఇదిలాఉండగా.. ఈ కంపెనీ కొన్ని రోజులుగా కృత్రిమ మేధపై భారీగా వెచ్చిస్తోంది. ఈ ఏడాది ఏఐలో 70 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది.

### ఓఎస్ యుగం ముగిసింది..
## ఇది 'ఏజెంట్స్' శకం : సత్య నాదెళ్ల

**న్యూఢిల్లీ:**ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తోన్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక ఆపరేటింగ్ సిస్టమ్స్, యాప్స్ యుగం ముగిసిందని అన్నారు. ఈ సరికొత్త కంప్యూటింగ్ విప్లవంలో 'ఏజెంట్స్' సమయం మొదలైందని వ్యాఖ్యానించారు. ప్రజలకు, కంప్యూటర్లకు మధ్య ఏఐ ఏజెంట్లు ప్రైమరీ ఇంటర్‌ఫేస్‌గా మారే ప్రపంచం వైపు మైక్రోసాఫ్ట్ పయనిస్తోందని పేర్కొన్నారు. కంపెనీ నిర్వహించిన బిల్డ్ 2026 డెవలపర్ కాన్ఫరెన్స్‌లో నాదెళ్ల ఈ మేరకు మాట్లాడారు. మైక్రోసాఫ్ట్, క్వాల్కమ్ భాగస్వామ్యంలో న్యూ చిప్ టు క్లౌడ్ ప్లాట్‌ఫామ్ అయిన ప్రాజెక్ట్ సొలారాను ఆవిష్కరించిన సమయంలో నాదెళ్ల మాట్లాడారు. యాప్‌లో పొందుపరిచిన అసిస్టెంట్ల స్థాయిని దాటి ఏఐ ఏజెంట్లు అభివృద్ధి చెందుతున్నాయని, భవిష్యత్ కంప్యూటర్ల నిర్మాణం, వినియోగాన్ని కొత్తగా నిర్వచిస్తాయని మైక్రోసాఫ్ట్ చెప్తోంది. ప్రజలు సాంకేతికతతో అనుసంధానమయ్యే విషయంలో ఏఐ ఏజెంట్లు కీలకంగా మారతాయని ఈ సంస్థ విశ్వసిస్తోంది. దాని ఆధారంగానే ప్రాజెక్ట్ సొలారాను తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం యూజర్లు ఒక్కొక్క యాప్ తెరిచి, స్వయంగా ఆపరేట్ చేసుకోవాలి. ఇకనుంచి వారి తరఫున ఏఐ ఏజెంట్లే ఆ పని చేసిపెడతాయని ప్రాజెక్ట్ రూపకర్తలు చెప్తున్నారు.






## నిబంధనలెన్ని ఉన్నా
# వన్నె తగ్గని 'హెచ్1బీ

**ఫీజును అమెరికా భారీగా పెంచినప్పటికీ.. డిమాండ్ తగ్గని వైనం**

**2026 ఆర్థిక సంవత్సరానికి 2 లక్షల దరఖాస్తులు**




**వాషింగ్టన్:**హెచ్-1బీ వీసా ఫీజును అమెరికా భారీగా పెంచినప్పటికీ.. డిమాండ్ మాత్రం తగ్గలేదు. రెండు లక్షలకు పైగా దరఖాస్తుదారులు లక్ష డాలర్లు చెల్లించి ఈ వీసా తీసుకునేందుకు ముందుకువచ్చారని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి మార్క్‌వేన్ ముల్లిన్ తెలిపారు. 2026 ఆర్థిక సంవత్సరానికి ఈ దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. "ఈ ఆర్థిక సంవత్సరంలో హెచ్-1బీ వీసా కోసం ఇప్పటివరకు 2.86 లక్షల అప్లికేషన్లు వచ్చాయి. ఆ దరఖాస్తుదారుల్లో రెండు లక్షలమందికి పైగా లక్ష డాలర్లు చెల్లించారు. ఆ ఫీజు చెల్లించిన దరఖాస్తులు దాదాపు 15 రోజుల్లోనే ప్రాసెస్ అవుతాయి. ఇతరులవి ప్రాసెసింగ్ కోసం సుమారు 7.5 నెలల సమయం పడుతుంది" అని ముల్లిన్ వెల్లడించారు. డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన వీసా ఫీజు ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. హెచ్-1బీ వీసా దరఖాస్తులపై వార్షిక రుసుంను లక్ష డాలర్లుగా నిర్ణయిస్తూ ఆయన తీసుకున్న నిర్ణయం వల్ల.. అమెరికా వేదికగా పనిచేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు జారీ చేసే ఒక్కో వీసాకు లక్ష డాలర్లు చెల్లించాలి. దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు అది. ఆ దేశంలో ఇప్పటికే చదువుతున్న విదేశీ విద్యార్థులకు ఆ ఫీజు విషయంలో మినహాయింపు ఇచ్చింది. దేశం బయట నుంచి వచ్చే దరఖాస్తులకు మాత్రమే ఈ ఫీజు వర్తిస్తుందని అమెరికా ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

## బంగారాన్ని ఆర్‌బీఐ విక్రయించలేదు




### బ్లూమ్‌బెర్గ్ నివేదికను ఖండించిన కేంద్రం

**న్యూఢిల్లీ:**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెద్దఎత్తున బంగారం విక్రయించినట్లు వచ్చిన వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఫారెక్స్ నిల్వలు కాపాడుకోవడానికి ఆర్‌బీఐ పసిడిని విక్రయించిందంటూ వచ్చిన బ్లూమ్‌బర్గ్ కథనాన్ని తోసిపుచ్చింది. పసిడి విక్రయం గురించి వచ్చిన వార్తలు పూర్తి అవాస్తవమని పేర్కొంది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. పశ్చిమాసియా సంక్షోభం వల్ల మన ఇంధన దిగుమతుల బిల్లు భారీగా పెరిగింది. మన ఈక్విటీలను విదేశీ మదుపర్లు విక్రయించి, పెట్టుబడులు పట్టుకెళ్లిపోతున్నారు. ఈ కారణాల వల్ల అమెరికా డాలర్‌కు గిరాకీ బాగా పెరిగింది. ఫలితంగా రూపాయి విలువ తగ్గిపోతోంది. దీంతో మన విదేశీ మారకపు ద్రవ్యం (ఫారెక్స్) నిల్వలు పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దీన్ని కాపాడుకునేందుకు ఆర్‌బీఐ 12 బిలియన్ డాలర్ల విలువైన పసిడిని విక్రయించినట్లు వార్తాసంస్థ బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. ఈ వార్తను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఆర్‌బీఐ వద్ద ఉన్న ఫారెక్స్ నిల్వల్లో బంగారం వాటా 2025లో 13.92 శాతంగా ఉండగా.. 2026 మార్చి 31 నాటికి 16.70 శాతానికి పెరిగినట్లు వెల్లడించింది. మే 22 నాటికి ఆ మొత్తం 16.85 శాతానికి పెరిగిందని ఆర్‌బీఐ గణాంకాలను ఉదహరించింది. ఆర్‌బీఐ తన వద్ద ఫిజికల్ గోల్డ్ వివరాలను ఎప్పటికప్పుడు నెలవారీ బులెటిన్‌లో వెల్లడిస్తోందని పేర్కొంది. ఈ తేదీ వరకు అందులో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. కాబట్టి తప్పుడు సమాచారం నమ్మొద్దని సూచించింది. అధికారిక సమాచారం కోసం ఆర్‌బీఐ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

## వెండి దిగుమతిపై మరిన్ని ఆంక్షలు

దిల్లీ: వెండి దిగుమతి నిబంధనలను కేంద్రం మరింత కఠినతరం చేసింది. తాజాగా పొడి, గ్రెయిన్ రూపంలో ఉన్న వెండి దిగుమతిని నిషేధిత జాబితాలోకి చేర్చింది. వెండి దిగుమతులకు తప్పనిసరిగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) అనుమతి ఉండాలనీ కేంద్రం తెలిపింది. 99.9% స్వచ్ఛత వరకు వెండి ఉన్న గ్రెయిన్, పొడి, ఇతర రూపాల్లోని వస్తువుల దిగుమతిని నిషేధిస్తూ మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత నెలలోనే 99.9% స్వచ్ఛత ఉన్న వెండి కడ్డీల దిగుమతిని, పాక్షికంగా తయారైన అన్ని వెండి వస్తువులను నిషేధిత తయారైన అన్ని వెండి వస్తువులను నిషేధిత విభాగంలో కేంద్రం చేర్చిన సంగతి తెలిసిందే. అదే సమయంలో పెరుగుతున్న ముడి చమురు ధరల కారణంగా విదేశీ మారక నిల్వలపై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు వెండి, బంగారంపై దిగుమతి సుంకాన్ని 6% నుంచి 15 శాతానికి చేర్చిన విషయం విదితమే.

## 550 మంది భారత 'బ్లూ హెల్మెట్'లకు ఐరాస గౌరవ పతకాలు

న్యూయార్క్: దక్షిణ సూడాన్‌లో ఐక్యరాజ్యసమితి (ఐరాస) తరఫున శాంతి పరిరక్షణ విధులు నిర్వహిస్తున్న 550 మంది భారతీయులకు ఐరాస గౌరవ పతకాలను అందించింది. ఘర్షణలతో ప్రభావితమైన ఆ దేశంలో పౌరుల రక్షణ, శాంతి నిర్మాణాల కోసం పనిచేస్తున్న వారి నిబద్ధతకు గుర్తుగా.. సౌత్ సూడాన్ లోని మలకల్ నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఐరాస ఈ పురస్కారాలను ప్రదానం చేసింది. 53 మంది మహిళలు సహా 565 మంది భారత బ్లూ హెల్మెట్‌లకు, 464 మంది రువాండా శాంతి పరిరక్షకులకు ఈ పురస్కారాలు అందించినట్లు సౌత్ సూడాన్‌లోని ఐరాస మిషన్ తెలిపింది. పౌరులకు రక్షణ కల్పించడం, వారికి మానవతా సహాయం అందేలా చూడటం, వైద్య శిబిరాలు నిర్వహించడం, మహిళలకు ఆత్మరక్షణలో శిక్షణ ఇవ్వడం వంటి సేవలకు గానూ వారికి ఈ పతకాలు లభించాయి.



## హెచ్-1బీ నియామకాల్లో ఎన్‌విడియా జోరు
### రూ.3.71 కోట్ల వరకు వేతన ఆఫర్




అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలు భారీగా ఉద్యోగ కోతలు విధిస్తూ, కొత్త నియామకాలు - విదేశీయులకు వీసా స్పాన్సర్‌షిప్‌లను తగ్గిస్తున్న వేళ.. కృత్రిమ మేధ (ఏఐ) చిప్ దిగ్గజం ఎన్‌విడియా మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. అంతర్జాతీయ టెక్ మార్కెట్‌లో మందగమనం ఉన్నప్పటికీ, అమెరికా 'హెచ్-1బీ' వీసా ప్రోగ్రామ్ ద్వారా విదేశీ ప్రతిభావంతులను ఎన్‌విడియా భారీ వేతన ప్యాకేజీలతో ఆకర్షిస్తోంది. ఫెడరల్ ఫైలింగ్స్ ప్రకారం.. 2026లో ఇప్పటివరకు దాదాపు 1200 హెచ్-1బీ పొజిషన్లకు ఎన్‌విడియా సర్టిఫికేషన్ పొందింది. 2025 ఇదే సమయంలో ఈ సంఖ్య 1000 మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు, ఎన్‌విడియా చిప్‌లతో నడిచే ఏఐ సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకున్న నేపథ్యంలో.. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, రీసెర్చ్ విభాగాల్లో స్పెషలైజ్డ్ ఇంజినీర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఎన్‌విడియా భారీ స్థాయిలో నియామకాలు చేపడుతోంది. వీరికి వేతన ప్యాకేజీలు కూడా భారీగా ఇస్తోంది. సీనియర్ నాయకత్వం, స్పెషలైజ్డ్ ఏఐ ఉద్యోగులకు ఇంకా ఎక్కువ వేతనం వస్తోంది. కంపెనీలో డైరెక్టర్ హోదాలో ఉన్నవారి బేస్ వేతనం మాత్రం ఏకంగా 4,88,750 డాలర్ల (దాదాపు రూ.4.64 కోట్లు) వరకు ఉంది. ప్రిన్సిపల్ సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డిస్టింగ్విష్డ్ ఏఐ ఆల్గారిథమ్ ఇంజినీర్ల వార్షిక వేతనాలు 4 లక్షల డాలర్లను మించుతున్నాయి.

వెనకబడిన గూగుల్, అమెజాన్: గూగుల్ గతేడాది తొలి 5 నెలల్లో ఆమోదించిన హెచ్-1బీ నియామకాల సంఖ్య 5100 కాగా, ఈసారి ఇదే సమయంలో 2,200కు పడిపోయింది. అమెజాన్ వీసా అప్రూవల్స్ 6100 నుంచి 4300కు తగ్గాయి. వలస విధానాలపై ప్రభుత్వ అనిశ్చితి, వ్యయ నియంత్రణల కారణంగా ప్రధాన ఐటీ కంపెనీలు విదేశీ నియామకాలను భారీగా తగ్గించుకుంటున్నాయి. ట్రంప్ ప్రభుత్వం కొత్త హెచ్-1బీ దరఖాస్తులపై లక్ష డాలర్ల (దాదాపు రూ.95 లక్షల) భారీ రుసుము విధించినప్పటికీ, ఎన్‌విడియా ఆ ఖర్చులను భరిస్తూ వీసా స్పాన్సర్‌షిప్‌లను కొనసాగిస్తోందని కంపెనీ సీఈఓ జెన్సన్ హువాంగ్ ఉద్యోగులకు స్పష్టం చేశారు. అమెరికాలో ఎంఎస్ చేసిన వారికి, లక్ష డాలర్ల వీసా రుసుం నుంచి మినహాయింపు ఉంటుంది.

## ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

ప్రాంతంలో ఉదయం 8.50 గంటల సమయంలో హోటల్‌లో మంటలు చెలరేగాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. గాయపడినవారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. "తొలుత చిన్నగా మొదలైన మంటలు.. తర్వాత వేగంగా వ్యాపించాయి. దాంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే మార్గం లేకుండా పోయింది. పైనున్నవారు కిందికి దూకినా ఎలాంటి దెబ్బలు తగలకుండా ఉండేందుకు స్థానికులు పరుపులు పరిచారు. మూడో అంతస్తు నుంచి ఒక మహిళ చిన్నారితో సహా కిందికి దూకింది" అని ప్రత్యక్ష సాక్షి ఒకరు మీడియాకు వెల్లడించారు మహిళలు కిందకు దూకుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఉదయం తాను ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయడానికి ప్రయత్నించగా.. ఒక్కసారిగా మంటలు చెలరేగాయని ఆ హోటల్‌లో పనిచేసే చెఫ్ కేసర్ సింగ్ వెల్లడించారు. వెంటనే హోటల్ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. "నేను బయటకు వచ్చి చూస్తే.. హోటల్ మొత్తం మంటల్లో చిక్కుకొని కనిపించింది" అని చెప్పారు. ఈ హోటల్‌లో బస చేసిన విదేశీయులు సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కేంద్రం ప్రభుత్వం ఆధ్వర్యంలోని బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద ఇది నడుస్తోంది. అయితే, ఈ హోటల్‌లో పరిమితికి మించి అతిథులకు వసతి సౌకర్యాలు కల్పించినట్లు ఆరోపణలున్నాయి.

### ప్రధాని మోదీగ్భ్రాంతి..

దిల్లీ అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటన బాధితులకు అన్నిరకాల సహాయం చేస్తామని వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.రెండు లక్షలు, గాయపడిన వారికి చికిత్స నిమిత్తం రూ.50 వేల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా తీవ్ర విచారం వ్యక్తంచేశారు.



# నిరీక్షణకు తెరపడేనా?

## గద్వాల పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

- పెండింగ్ ప్రాజెక్టులపై ప్రజల్లో భారీ ఆశలు
- నిధులు, హామీలపై సర్వత్రా ఉత్కంఠ
- అభివృద్ధి పనులకు ఊపొస్తుందా అన్న ఎదురుచూపు

**గద్వాల, జూన్ 3 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం రానుండటంతో జిల్లావ్యాప్తంగా అభివృద్ధి ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో మంజూరై వివిధ కారణాలతో నిలిచిపోయిన లేదా నత్తనడకన సాగుతున్న ప్రభుత్వ ప్రాజెక్టుల భవితవ్యంపై ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సీఎం పర్యటన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ఊతం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. జిల్లాలో అత్యవసర వైద్య సేవల విస్తరణకు ఎంతో కీలకమైన 100 పడకల ఆసుపత్రి నిర్మాణం ఇప్పటికీ పూర్తికాకపోవడం ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. మెరుగైన వైద్యం కోసం కర్నూలు, మహబూబ్‌నగర్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నెట్టెంపాడు ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు సంబంధించి పునరావాస, పునర్నిర్మాణ కేంద్రాల అభివృద్ధి పనులు కూడా పూర్తిస్థాయిలో జరగలేదు. నిర్వాసిత కుటుంబాలకు అవసరమైన మౌలిక వసతులు, పరిహారం అంశాల్లో ఇంకా అనేక సమస్యలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సీఎం పర్యటన సందర్భంగా ఈ సమస్యల పరిష్కారంపై స్పష్టత వస్తుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి.

గద్వాల నియోజకవర్గ పరిధిలో ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయాలు, వ్యవసాయ గోదాములు, పీఏసీఎస్ భవనాలు, విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం కేటాయించిన సుమారు 35 ఎకరాల స్థలంలో అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉండిపోవడం చర్చనీయాంశమైంది. సంబంధిత శాఖల మధ్య సమన్వయం లోపంతో ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు ఉపయోగపడే నూతన జిల్లా గ్రంథాలయ భవనం నిర్మాణం కూడా ఇంకా కార్యరూపం దాల్చలేదు. పాత భవనాల్లోనే సేవలు కొనసాగుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే పలు బీటీ రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజల రాకపోకలు కష్టతరంగా మారాయి. జూరాల ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకుల కోసం ప్రతిపాదించిన బృందావనం పార్కు నిర్మాణం కూడా మధ్యలోనే నిలిచిపోయింది. డ్యాం కుడి వైపున పర్యాటక వసతులు కల్పించాలని ఏళ్లుగా డిమాండ్ ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగలేదు. ప్రారంభించిన నిర్మాణ కార్యక్రమాలు కూడా తొలి దశలోనే నిలిచిపోవడంతో పర్యాటకాభివృద్ధికి ఆటంకం ఏర్పడింది.

సీఎం పర్యటన సందర్భంగా అధికారులు పెండింగ్ ప్రాజెక్టులపై సమగ్ర నివేదికలు సమర్పించనున్న నేపథ్యంలో, గద్వాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు లేదా ప్యాకేజీల ప్రకటన ఉంటుందా అనే అంశంపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యలకు ఈ పర్యటన ద్వారా పరిష్కార మార్గం దొరుకుతుందని, జిల్లాకు కొత్త దిశ లభిస్తుందని ప్రజలు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించం

- పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై జీవన్‌రెడ్డి మండిపాటు
- తెలంగాణ సాధనకు కర్త, కర్మ, క్రియ కేసీఆరేనని వ్యాఖ్య
- ఉద్యమ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు
- బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు సమావేశంలో విమర్శలు



**నిజామాబాద్ అర్బన్, జూన్ 3 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాలతో ఏర్పడలేదని, వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, విద్యార్థుల పోరాటాలు, కోట్లాది ప్రజల ఆకాంక్షల ఫలితంగానే సాధ్యమైందని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఎస్ఐఆర్ సన్నాహక సమావేశంలో ఆయన పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో స్పందించారు.

తెలంగాణ గురించి మాట్లాడే ముందు రాష్ట్ర చరిత్రను, ప్రజల ఆత్మగౌరవాన్ని తెలుసుకోవాలని పవన్ కళ్యాణ్‌కు సూచించారు. తెలంగాణ ముమ్మాటికీ ఈ నేలపై నివసిస్తున్న నాలుగు కోట్ల ప్రజలదేనని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదన్నారు. సినిమాల్లో డైలాగులు చెప్పినంత సులభం తెలంగాణ ఉద్యమం కాదని, ఉద్యమ చరిత్రపై అవగాహన లేకుండా మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

తెలంగాణ రాష్ట్ర సాధనకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన నాయకత్వం మరువలేనిదని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యమానికి దిశానిర్దేశం చేసి రాష్ట్రాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించిన నాయకుడు కేసీఆరేనని కొనియాడారు. తెలంగాణ సాధనకు కర్త, కర్మ, క్రియ ఒక్క కేసీఆరేనని, ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారని అన్నారు. తెలంగాణకు నిర్మాత, దర్శకుడు, కథానాయకుడు ఎవరైనా ఉంటే అది కేసీఆరేనని వ్యాఖ్యానించారు.

తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలని, రాష్ట్రంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని పవన్ కళ్యాణ్‌కు సూచించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఎలాంటి వ్యాఖ్యలనైనా బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర సాధన కోసం పోరాడని వారు, ఉద్యమ చరిత్రలో భాగం కాని వారు తెలంగాణ గురించి ఉపన్యాసాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్‌కు ఉన్న స్థానం శాశ్వతమని, ఆ స్థానాన్ని ఎవరూ చెరపలేరని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంతు షిండే, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యాధి నిరోధక టీకాల ఆకస్మిక తనిఖీ డాక్టర్ రజిత



**ముస్తాబాద్ జూన్ 3 (జనం సాక్షి) :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఆకస్మిక తనిఖీలలో భాగంగా పోతుగల్ గ్రామం మండలంలోని ఆవునూరు, గూడెం ఉప కేంద్రమును, చికోడు ఉపకేంద్రమును, ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును ఆకస్మికంగా తనిఖీ నిర్వహించినారు. ఈ తనిఖీలలో రికార్డులను, వ్యాధి నిరోధక టీకాల మందులను పరిశీలించి సరియైన మోతాదు, నిర్దేశిత కాలంలో వేయడంతో పాటు 0-5 సంవత్సరాల పిల్లల భవిష్యత్తు లో వ్యాధులు సో కకుండా రక్షించాల్సిన అవసరమును, టీకా తీసుకున్న తర్వాత స్వల్పంగా జ్వరం, తీసుకున్న ప్రాంతంలో చర్మం ఎర్రబడడం, వాపు లాంటివి సంభవించవచ్చు ను, మూడు రోజులలో ఇవి తగ్గిపోతాయని, భయపడవలసిన అవసరం లేదని, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచనలు సలహాలు ఇచ్చినా రు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాలు ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంపత్ కుమార్, డిప్యూటీ డెమో రాజ్ కుమార్ పాల్గొన్నారు.

### గ్రామ, వార్డు సభల విజయవంతానికి

# ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై అధికారులతో సమీక్ష
- గ్రామ, వార్డు సభల నిర్వహణపై అదనపు కలెక్టర్ల దిశానిర్దేశం
- ఎస్ఐఆర్, ఖరీఫ్ సన్నాహకాలు, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



**నిజామాబాద్ అర్బన్, జూన్ 3 (జనంసాక్షి):** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీల్లో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, భుజంగరావు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, వివిధ శాఖల అధికారులకు వారు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర కీలకమని, రాజకీయ పార్టీలు వెంటనే బీఎల్ఏలను నియమించి నిర్దేశిత నమూనాలో వివరాలు సమర్పించేలా ప్రజాప్రతినిధుల ద్వారా చైతన్యం కల్పించాలని అన్నారు. రక్షిత మంచినీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని, రహ్‌వీర్ వంటి పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అలాగే ఆపద్బంధు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, రెండో విడత ఇళ్ల మంజూరీ ప్రక్రియపై సభల్లో సమగ్రంగా వివరించాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్లు పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్వో గీత, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, డీఆర్‌డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, నిజామాబాద్, బోధన్ ఆర్డీవోలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా ఆహ్లాదం పెంచేలా బండ్ పార్క్

- 40 ఫీట్ల శివుడి విగ్రహం.. సప్తమాత్రికల విగ్రహాలు
- రాజన్న ఆలయానికి మరింత శోభ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 3 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయానికి ఆధ్యాత్మిక శోభ మరింత వెల్లివిరిసేలా గుడి చెరువు బండ్ పార్క్ శివుడి విగ్రహం,సప్తమాత్రికల విగ్రహాల ఏర్పాటు చేశారు.వేములవాడ గుడి చెరువు బండ్ పార్కును భక్తి భావం పెంచేలా,ఆహ్లాదం ఆనందాన్ని పంచేలా వీటీఏడీఏ ఆధ్వర్యంలో అందంగా తీర్చిదిద్దుతున్నారు.రాజన్న ఆలయ సమీపంలో ఉన్న ఈ బండ్ పార్క్ ను పట్టణ ప్రజలు, ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో పాటు, సుందరీకరణ పనులు నిర్వహిస్తున్నారు.గుడి చెరువు అభివృద్ధి పనులను గత ఆరు నెలల క్రితం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ప్రణాళిక ప్రకారం చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ఆధ్యాత్మికత భావం ఉట్టిపడేలా, భక్తి భావం పెంపొందించేలా మహాశివుడి విగ్రహంతో పాటు, సప్తమాత్రికల విగ్రహాలు,అలాగే గుడి చెరువులో బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆలోచన,ఆదేశాల మేరకు పర్యాటక శాఖ అధికారులు బండ్ పార్క్ లో 40 ఫీట్ల ఎత్తైన మహాశివుడి విగ్రహం, సప్తమాత్రికల విగ్రహాలు ఏర్పాటు చేశారు. గుడి చెరువులో బోటింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టెండర్ దశలో ఉన్నాయి. వేగంగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి బోటింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బోటింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తే కుటుంబాలతో వచ్చే భక్తులు, పర్యాటకులకు మరింత వినోదాన్ని అందించడంతో పర్యాటక రంగ అభివృద్ధికి కూడా దోహదపడనుంది.

బండ్ పార్క్ లో శివుని విగ్రహం,సప్తమాత్రికల విగ్రహాల ఏర్పాటు, బోటింగ్ సదుపాయం, ఇతర అభివృద్ధి పనులపై పట్టణ ప్రజలు సానుకూల స్పందన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రారంభానికి సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

తుది దశకు చేరుకున్న బండ్ పార్క్ మిగతా అభివృద్ధి పనులను పూర్తి చేసి, బోటింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చి త్వరగా ప్రారంభానికి సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వేములవాడలోని గుడి చెరువు బండ్ పార్క్ ను క్షేత్ర స్థాయిలో సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.నేమ్ బోర్డు, టాయిలెట్లు, ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పనులు పూర్తి చేసి త్వరలో ప్రారంభానికి సన్నాహాలు చేయాలని సూచించారు. ఆమె వెంట ఆర్డీఓ కె ఎస్ బి కుమారి, తాసిల్దార్ జయంత్ కుమార్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అన్సారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి..**

వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.వీటీఏడీఏ ఆద్వర్యంలో రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం,బద్ది పోచమ్మ ఆలయం అభివృద్ధి పనులు, ప్రధాన రోడ్డు విస్తరణ పనులనుఆమె బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై ఆర్ అండ్ బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతి, పూర్తి చేయడంపై వేములవాడ మున్సిపల్ అధికారులను ఆరా తీశారు. పనులు వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. రాజన్న, బద్ది పోచమ్మ ఆలయాల విస్తరణ,అభివృద్ధి పనులు, నిత్యాన్నదానం సత్రం నిర్మాణ పనులు, రోడ్డు విస్తరణ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో గడువు తేదీ ఇవ్వాలని ఆయా శాఖల అధికారులకు ఆమె సూచించారు.ఆమె వెంట ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి,వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్ శర్మ, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, టీపీఓ అన్సార్ పాల్గొన్నారు.

## సంతానం లేకపోవడంతో మనస్తాపం.. మహిళ ఆత్మహత్య

- గొల్లపల్లి గ్రామంలో విషాద ఘటన
- నాలుగేళ్లుగా సంతానం లేక ఆవేదన
- వీడియో కాల్‌లో బాధ వ్యక్తం చేసిన మహిళ
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**శంషాబాద్, జూన్ 3 (జనంసాక్షి):** శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని నింపింది. సంతానం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గొల్లపల్లి గ్రామానికి చెందిన అడెల్ల సుక్కపురి స్వప్న (36) తన భర్త శ్రీకాంత్ దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్న నేపథ్యంలో అత్తమామల వద్ద నివాసం ఉంటోంది. వివాహమై నాలుగేళ్లు గడిచినా సంతానం కలగకపోవడంతో ఆమె తరచూ ఆవేదనకు గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం స్వప్న తన చెల్లెలు లావణ్య, భర్త శ్రీకాంత్‌తో వీడియో కాల్‌లో మాట్లాడింది. ఈ సందర్భంగా పిల్లలు లేకపోవడం పట్ల తీవ్ర బాధ వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం ఆమెకు ఫోన్ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సాయంత్రం సమయంలో అత్త స్వర్ణలత స్వప్న గది తలుపు తెరవడానికి ప్రయత్నించగా స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు తలుపు బలవంతంగా తెరిచి చూడగా, గదిలోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి వెల్లడించారు.

### 4న సీఎం రేవంత్‌కు

# జెండాలతో స్వాగతం పలుకుదాం

## మాగనూరు కృష్ణ మండలాల నుంచి ఇంటికొకరు తరలాలి

- మక్తల్ ప్రాంతంలో 8 టీఎంసీల వరకు నీటిని నింపుకునే అవకాశం
- ఎన్నిసార్లు గెలిచామన్నది కాదు... ఒక్కసారి గెలిచినా ఏం చేశామన్నది ముఖ్యం
- ప్రస్తుతం మక్తల్ కోర్టుకు.. పేట నుంచి లాయర్లు వస్తున్నారు
- తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**మక్తల్, జూన్ 02 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ధ్యేయమని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ లో ఈ నెల 4 వ తేదీన ముఖ్యమంత్రి పర్యటన పై మంత్రి క్యాంపు కార్యాలయం లో మాగనూరు, కృష్ణ, నర్వ మండలాల నాయకులు, రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ నారాయణపేట జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. జూన్ 4 వ తేదీన మక్తల్ ప్రాంతం లో సాగునీటి ప్రాజెక్టులపై సీఎం ఏరియల్ సర్వే చేయనున్నట్లు తెలిపారు. కృష్ణా నది పై మూడు చోట్ల బ్రిడ్జి కమ్ బ్యారేజ్ లు కొల్పూర్- కొర్తికొండ వద్ద 1.8 టీఎంసీ, మురారి దొడ్డి - గంజి పల్లి, దేవసూగురు వద్ద బ్రిడ్జి కం బారేజ్ లు అదేవిధంగా భీమా నది పై రెండు చోట్ల బ్రిడ్జి కమ్ బ్యారేజ్ లు సుకుర్ లింగం పల్లి వద్ద ఒకటి, కుసుముర్తి వద్ద మరొకటి బ్రిడ్జి కం బారేజ్ లకు కూడా ముఖ్య మంత్రి ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ల్లో బ్యారేజీలు నిర్మించడం ద్వారా జిల్లాకు సాగు, తాగు నీటి సమస్య తీర్చవచ్చని తెలిపారు.ప్రాజెక్టు పరిధిలో 51 శాతం భూభాగం తెలంగాణకు, 49 శాతం కర్ణాటకకు ఉండటంతో రెండు రాష్ట్రాలకు సమాన ప్రయోజనం కలిగే విధంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్నాటక సాగునీటి మంత్రి బోసు రాజు, కర్ణాటక రాష్ట్ర ప్రతినిధులతో కలిసి జూన్ 4, 5 తేదీల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కీలక సాగునీటి ప్రాజెక్ట్ లపై సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.5 వేల కోట్లతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నామ ని అన్నారు. సీఎం ఏరియల్ సర్వే చేపట్టే చోట బ్రిడ్జ కం బ్యారేజీలో పూర్తయి అందుబాటులోకి వస్తే కేవలం మక్తల్ నియోజకవర్గానికి మాత్రమే దాదాపు 8 టీఎంసీల వరకు మీరు అందుబాటులోకి ఉంటుందని మంత్రి తెలిపారు. ఏరియల్ సర్వే నిర్వహించే ప్రాంతాల్లో ఆయా మండలాల నుంచి ప్రతి ఇంటికి ఒకరు చొప్పున తరలివచ్చి జెండాలతో స్వాగతం పలికి.. సీఎం రేవంత్ కు పెద్ద ఎత్తున హర్షధ్వనాలు తెలపాలని సూచించారు. దీంతోపాటు నర్వ మండలంలోని జంగంరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రభుత్వం 175 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా 13 గ్రామాల్లోని సుమారు 7,500 ఎకరాలకు సాగునీరు అందనుందని చెప్పారు. ఎన్నిసార్లు గెలిచామన్నది ముఖ్యం కాదని.. ఒకసారి గెలిచినా ఏం చేశామన్నది ముఖ్యమని... అదే ప్రజల్లో చిరస్థాయిగా గుర్తింపు తీసుకొస్తుంద ని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాలకు నూతనంగా బీటీ రోడ్లు మంజూరు చేసుకున్నామని, అనేక చోట్ల సిసి రోడ్లు డ్రైనేజీల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మక్తల్‌ను అభివృద్ధి చేసుకుందామన్నదే తమ లక్ష్యమని వివరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, నాయకులు బాలకృష్ణారెడ్డి, కట్టా సురేష్ గుప్తా, గణేష్ కుమార్, అల్కూరి రవికుమార్, ఆనంద్ గౌడ్, రాజప్ప గౌడ, వార్డు కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు, సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**గద్వాల నడిగడ్డ,జూన్ 3 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి పర్యటనకు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు. ఈనెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాస రావు.అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గురువారం గుడ్డం దొడ్డి రిజర్వాయర్‌ను ముఖ్యమంత్రి పరిశీలించిన అనంతరం పంప్ హౌస్ సందర్శన ఉంటుందని అందుకు ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తులో అధికారులు సిబ్బంది

అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.హెలిపాడ్, పంప్ హౌస్ దగ్గర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పర్యటన పూర్తయ్యే వరకు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, భద్రతా చర్యల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని సూచించారు. 700 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది తో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.



# రూ.300 కోసం యువకుడి దారుణ హత్య

## రైల్‌నిలయం సమీపంలో తలపై బండరాళ్లతో మోది హత్య చేసిన దుండగులు

- డబ్బుల వివాదమే కారణమా? అనే కోణంలో దర్యాప్తు
- మృతుడి గుర్తింపునకు పోలీసుల ప్రయత్నాలు
- ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**సికింద్రాబాద్, జూన్ 4 (జనంసాక్షి):** సికింద్రాబాద్‌లోని లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్‌నిలయం సమీపంలో ఓ గుర్తుతెలియని యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. యువకుడి తలపై బండరాళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. బుధవారం ఉదయం రైల్‌నిలయం సమీపంలో ఓ యువకుడు రక్తపు మడుగులో పడి ఉన్నట్లు డయల్-112కు సమాచారం అందడంతో లాలాగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ పరిశీలించగా యువకుడి తలపై తీవ్ర గాయాలు ఉన్నట్లు గుర్తించారు. బండరాళ్లతో దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు.

మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. మృతదేహం వద్ద ఆధారాలు సేకరించిన పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి కుడి చేతిపై హిందీలో "రీనా" అనే పేరు పచ్చబొట్టుగా ఉండగా, మరోచోట ప్రేమ గుర్తుతో పాటు "జేఎస్" అనే అక్షరాలు పచ్చబొట్టుగా ఉన్నట్లు గుర్తించారు. ఈ వివరాల ఆధారంగా మృతుడి గుర్తింపునకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ హత్య వెనుక డబ్బుల వివాదం ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నట్లు సమాచారం. మృతుడు రోడ్డుపై వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు డబ్బులు అడిగినట్లు, అందుకు నిరాకరించడంతో తలపై రాళ్లతో దాడి చేసి అతని వద్ద ఉన్న నగదును లాక్కొని పరారైనట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మృతుడి జేబులో ఉన్న సుమారు రూ.300 కోసం ఈ దారుణానికి పాల్పడి ఉండవచ్చనే కోణంలో కూడా విచారణ సాగుతోంది. ఘటనకు సంబంధించి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. ఈ విషయమై లాలాగూడ పోలీసులను సంప్రదించగా ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. హత్యకు గల అసలు కారణాలు, మృతుడి పూర్తి వివరాలు, నిందితుల పాత్ర తదితర అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.



# బుధవారం దొరికినంత దోచుకో

## మార్కెట్ సెలవు దినం రోజున ఇష్టానుసారంగా రేట్లు

### కిరాణా వర్తక సంఘం తగు చర్యలు తీసుకోవాలి

**మార్కెట్ సెలవు దినం ఇష్టానుసారంగా రేట్లు...**
బుధవారం కేవలం ప్రధాన రోడ్లపై కేవలం రెండే రెండు కిరాణా షాపులు తెరిచి ఉంటాయి మిగతావన్నీ కిరణ వర్తకం అసోసియేషన్ ఆదేశానుసారం బంద్‌గా పాటిస్తాయి. అయితే బుధవారం ఒకటే రెండు షాపులు తెరిచి ఉండడంతో వచ్చిన కొనుగోలుదారులు ఇష్టానుసారంగా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణ. కిలో చెక్కరి ధర బుధవారం రోజు ఒక రేటు ఉంటే మామూలు రోజుల్లో ఇంకో రేటుకి అమ్ముతున్నారని ప్రజల ఆరోపణ అంతేకాకుండా మిగతా వస్తువులపై కూడా అలాగే ఎక్కువ రేటు చేసి అమ్ముతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే కొసమెరుపు ఏంటంటే కేవలం జిరాక్స్ సెంటర్లు కూడా అన్ని బంధు ఉండడంతో ఒక వన్ సైడ్ జిరాక్స్ ఐదు రూపాయలు తీసుకొని నీ ఇష్టం ఉంటే తీసుకో లేదా ఇక్కడి నుండి వెళ్ళిపో... అరె తారస్థాయికి చేరిపోయింది.



**గాంధారి, జూన్ 3 (జనంసాక్షి):**
ఎక్కడైనా ఆదివారం సెలవుదినంగా సెలవు దినంగా ఉండి వ్యాపార, వాణిజ్య సముదాయాలు పూర్తిగా బందు ఉంచబడతాయి. కానీ గాంధారి మండల కేంద్రంలో మాత్రం బుధవారం రోజున వాణిజ్య వ్యాపార లకు సంబంధించిన అన్ని దుకాణాలు బుధవారం బందుగా ప్రకటిస్తూ ఆదివారం ఎప్పటిలాగే రోజు మాదిరి వ్యాపారాలు కొనసాగుతాయి అంతేకాకుండా ఆదివారం అంగడి రోజు కాబట్టి ఆరోజు బందు పెట్టకుండా బుధవారం బంద్ ఉంచడం జరుగుతుంది. వివరాల్లోకి వెళితే గాంధారి మండల కేంద్రంలో కేవలం బుధవారం రోజున రెండు కిరణా షాపులు మాత్రమే కిరణ వర్తక సంఘం వారు నిర్ణయించిన విధంగా ఒకరి తర్వాత ఒకరు క్యా ప్రకారం బుధవారం దుకాణం తెరుస్తూ వ్యాపారాలు నిర్వహిస్తూ ఉంటారు. అయితే ఇందులో కొందరు దొరికింది తరువుగా ఏదేచ్ఛగా ఇష్టానుసారంగా తమకు తోచిన విధంగా వ్యాపారస్తులు విక్రయాలు జరుపుతున్నారు.

కిరాణా వర్తక సంఘం సభ్యులు చర్యలు తీసుకోవాలి..
బుధవారం అధిక రేట్లకు అమ్ముతున్న వారిపై కిరణా వార్తక సంఘ సభ్యులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మిగతా ఎలక్ట్రికల్, జిరాక్స్, జనరల్ స్టోర్ షాపులపై కూడా బుధవారం రోజున ఇస్తాను సారంగా అమ్మకాలు జరుపుకుంటా కట్టని చేసి రోజు మాదిరిగా అమ్మే రేటుకి విక్రయాలు జరపాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

**రోజు చక్కెర కొనుగోలు చేస్తాం... టీ షాప్ యజమాని**
ప్రతిరోజు మాకు చక్కెర కేజీ 44 రూపాయలు ఉంటే బుధవారం రోజు 46 రూపాయల చొప్పున తీసుకురావాల్సి వచ్చిందని సదరు టీ పాయింట్ యజమాని తెలిపారు అయితే రోజు మాదిరిగా నే తీసుకుంటే ఏం కాదు కానీ ఇలా రెండు రూపాయలు అదనంగా తీసుకోవడం ఎంతవరకు సమంజసమని బుధవారం రోజు బంద్ ఉండడం వల్ల ఇలాంటి సమస్యలు పునరావృతమవుతున్నాయని కిరణా వర్తక సంగం సభ్యులు వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

# ప్రపంచస్థాయి సేవల్లో అగ్రగామిగా యశోద హాస్పిటల్స్

- హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ క్లినికల్ డైరెక్టర్ డా డి.శ్రీకాంత్



**కరీంనగర్ బ్యూరో, జూన్ 03 (జనంసాక్షి) :**
ప్రపంచ స్థాయి ట్రాన్స్‌ప్లాంట్ కేర్ ఎయిర్ అంబులెన్స్ సేవలతో భారతదేశం లోని ఏకైక ప్లాటినం-సర్టిఫైడ్ ఈసీఎంవో సెంటర్‌గా హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ నిలుస్తోంది. ఈ ఆస్పత్రి ఎక్స్‌ట్రాకార్పోరియల్ లైఫ్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ద్వారా లైఫ్ సపోర్ట్ ఎక్సలెన్స్ కోసం అత్యున్నత స్థాయి ప్లాటినం అవార్డును అందుకుంది. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు ద్వారా ఉన్నత స్థాయి కేంద్రాలలో ఒకటిగా నిలిచింది. ఈ సందర్భంగా హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీకాంత్ మాట్లాడుతూ... ఈఎలఎస్‌వో ప్లాటినం గుర్తింపు పేషెంట్ భద్రత, క్లినికల్ ఎక్సలెన్స్ అత్యున్నత అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉ ంఢటంపై తమ నిరంతర దృష్టికి నిదర్శనమన్నారు. దీనికి అత్యంత అనుభవజ్ఞులైన ఇంటెన్సివిస్టు, కార్డియోథొరాసిక్ సర్జన్లు, పెర్ఫ్యూషనిస్టులు, ట్రాన్స్ ప్లాంట్ ఫిజిషియన్లు స్పెషలైజ్డ్ నర్సుల బృందం మద్దతుగా ఉ ందన్నారు. ఆస్పత్రి ప్రపంచ స్థాయి ప్రమాణాలకు సరిపోయే అవయవ మార్పిడి కార్యక్రమాలకు సజావుగా ఇంటిగ్రేటెడ్ యాక్సెస్తో అత్యాధునిక సేవలు అందిస్తోందన్నారు. అత్యంత తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కలిగిన పేషేంట్లకు సంరక్షణను నిర్ధారిస్తుందన్నారు. అంతర్జాతీయ సంస్థలలో శిక్షణ పొందిన అత్యంత ప్రత్యేకత కలిగిన బహుళ విభాగ బృందాలు పనిచేస్తున్నా యి. 'క్రిటికల్ కేర' (ఇంటెన్సివ్ కేర్) విభాగంలో డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ "ఈఎలఎస్‌వో -సర్టిఫైడ్ ఈఎలఎస్‌వోతో ఎక్సలెన్స్‌ను ప్రపంచ స్థాయి మార్పిడి కార్యక్రమాలు అధునాతన ఎయిర్ అంబులెన్స్ మద్దతుతో అనుసంధానించడం ద్వారా, మేము భారతదేశంలో ప్రపంచవ్యాప్తంగా పోల్చదగిన ఫలితాలను అందించగలుగుతున్నామన్నారు. అత్యంత తీవ్రమైన అనారోగ్యం కలిగిన పేషేంట్లక సకాలంలో, కరుణతో కూడిన అంతర్జాతీయం గా బెంచ్ మార్క్ చేయబడిన సంరక్షణ లభించేలా చూడటం తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీమ్ లీడర్ హరి కిరణ్, మార్కెటింగ్ మధు సూదన్ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 9908808085లో సంప్రదించాలన్నారు.

# నిజాం చక్కెర ఫ్యాక్టరీ ముందు కార్మికుల ధర్నా



**బోధన్, జూన్ 3 ( జనంసాక్షి ) :** నిజాం చెక్కర ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకుని వచ్చే విధంగా పాలకులు కృషి చేయడంతో పాటు కార్మికుల పాత బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ బుధవారం కార్మికులు ఫ్యాక్టరీ గేటు ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు నాగుల రవిశంకర్ గౌడ్, ఉపేందర్ లు మాట్లాడుతూ, 11 సంవత్సరాల నుంచి షుగర్ ఫ్యాక్టరీ లే ఆఫ్ లో పెట్టారని అయితే షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు రావలసిన వేతన బకాయిలు ఇప్పించి నిజాం షుగర్స్ ఫాక్టరీని తెరిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే తెరిపిస్తామని ఎన్నికల ప్రచారంలో మాట ఇచ్చిన రాహూల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చిన నేటి వరకు మా సమస్య పరిష్కరించబడలేదన్నారు. ప్రదాన ప్రతి పక్షం కనీసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ప్రశ్నించకపోవడం దారణమని ,ఈ సమస్య పైన కొత్తగా ఏర్పడిన తెలంగాణా రాష్ట్ర సేన పార్టీ అధినేత్రి కవిత మా సమస్యల పైన కొట్లాడితే కార్మికులు మీకు రుణపడి ఉంటారన్నారు. ఎంతో మంది కార్మికులు పదవి విరమణ చెందినప్పటికీ ఒక్క రూపాయి బెనిఫిట్ లేకుండా రిటైర్మెంట్ అవుతున్నాని, బెనిఫిట్ లేకుండా చనిపోతున్నారని, రిటర్మెంట్ ఆయన కార్మికులకు గ్రాడ్యుటి కూడా ఇవ్వడం లేదన్నారు. లే ఆఫ్ కాల పరిమితి లేకుండా కంటిన్యూగా నేటికీ 23/ 12 2015నుంచి ఈరోజు వరకు కూడా లే ఆఫ్ లో పెట్టారని. ఇది చాలా చాలా అన్యాయమన్నారు. లే ఆఫ్ కాలపరిమితి ముగిసిన వెంటనే లాకౌట్ అయి ఉంటే మాకు విఆర్ఎస్ ఇచ్చి మాకు సెటిల్మెంట్ చేసే వాళ్ళు లాకౌట్ చేయకుండా లే ఆఫ్ లో పెట్టి మాకు వేతనాలు లేకుండా చేశారని ఆరోపించారు. ఇటు ఎన్ డి ఎస్ ఎల్ మేనేజ్మెంట్ గాని అటు ప్రభుత్వం గానీ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల బాధను అర్థం చేసుకొని మా సమస్యను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని కార్మికులు కోరారు.. ఈ కార్యక్రములో కార్మిక సంఘాల నాయకులు నాగుల రవిశంక ర్ గౌడ్,ఉపేందర్, బాలకృష్ణ,రాజారాం, దేవదాసు,కార్మికులు బాలచందర్, భాస్కర్,బిక్షపతి, భూమయ్య, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మనపల్లిలో వ్యక్తి అనుమానాస్పద మృతి

- భూమి వివాదాల నేపథ్యంలో ఘటనపై అనుమానాలు
- భార్య, కుమార్తెపై మృతుడి తల్లి ఆరోపణలు
- సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఫిర్యాదు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**చిగురుమామిడి, జూన్ 4 (జనంసాక్షి):**
మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన అల్లెపు రాజయ్య (48) బుధవారం మృతి చెందినట్లు చిగురుమామిడి ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, అల్లెపు రాజయ్యకు ఆయన భార్య పోచవ్వ, కుమార్తె రేణుకతో భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారానికి సంబంధించి కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రాజయ్య మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆయన తల్లి కొమురవ్వ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మృతికి సంబంధించిన పరిస్థితులు అనుమానాస్పదంగా ఉన్నాయని, ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలు వెలికితీయాలని ఆమె పోలీసులను కోరినట్లు సమాచారం. ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహించి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నివేదికతో పాటు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని పోలీసులు పేర్కొన్నారు.

# త్వరలో గుడిసె లేని రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు

- ఇందిరమ్మ కన్న కలలు సాకారం
- బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



**బోధన్, జూన్ 3 ( జనంసాక్షి ) :** తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు లేకుండా ప్రతీ కుటుంబానికి పక్కా భవనాలను నిర్మించి గుడిసె లేని రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు సాధిస్తుందని బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో ఆచన్‌పల్లి, శక్కర్‌నగర్, రాకాసీపేట్ ప్రాంతాలలో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలను బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి పక్కా ఇండ్లను నిర్మించే విధంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఐదు లక్షల రూపాయలు అందించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. అయితే కమిటీలో మంత్రులు రాష్ట్రంలో సుమారు 1500 నుండి 2000 వరకు కుటుంబాలు గుడిసెలో నివసిస్తున్నట్లు నివేదికలో వెల్లడైందని అందువల్ల అందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించి రాష్ట్రంలో గుడిసె లేని రాష్ట్రంగా గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. యువతీ యువకులకు వివిధ రంగాలలో మెరుగన శిక్షను అందించి వారిని ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యకు వైద్యంకు పెద్దపీట వేయడంతో పాటు మహిళలకు ఆర్థిక చేయూతను అందించే విధంగా కోట్లాది రూపాయలతో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అన్ని హామీలను నెరవేర్చడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. రైతుల విషయంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదని వారి అభివృద్ధి కోసం మున్ముందు మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. అయితే ప్రజలు పనిచేసే ప్రభుత్వాన్ని గుర్తించి ఆదరించాలని బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్ర మంలో బోధన్ ఆర్డీవో విజయ రాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హాందాన్, బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఒకటవ వార్డు కౌన్సిలర్ వేములపల్లి లక్ష్మీ రామ్మూర్తి, కౌన్సిల ర్లు, బోధన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంకు దాము, స్థానిక కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ రెడ్డి, చింటు, భద్రరావు, ధనుంజయ్ రెడ్డి, సాయిలు, సురేందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు,అధికారులు పాల్గొన్నారు.

# కాగ్నానదిలో నీట మునిగిన ఇద్దరు వ్యక్తులు

- ఒకరి మృతి, మరొకరి కోసం గాలింపు చర్యలు
- యాలాల కోకట్ సమీపంలో ఘటన



**యాలాల జూన్ 3 (జనం సాక్షి) :**
విహారయాత్ర కోసం వెళ్లిన కుటుంబంలో విషాదం నెలకొంది. సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు నీటమునిగారు. ఇందులో ఒకరు మృతి చెందగా మరొకరు గల్లంతు అయ్యారు.విషయం తెలుసుకున్న పోలీసులు గల్లంతైన వ్యక్తి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషాదకర సంఘటన బుధవారం యాలాల మండలం కోకట్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు తాండూరు మున్సిపల్ పరిధి పాత తాండూరుకు చెందిన మోయిజ్(28), సంగారెడ్డి జిల్లా బస్తాపూర్ ప్రాంతానికి చెందిన అతని బందువు రహమత్ (26) అనే వ్యక్తులు వారి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం యాలాల మండలం కోకట్ గ్రామ సమీపంలోని కాగ్నానది వద్దకు వెళ్లారు.అక్కడ మోయిజ్, రహమత్‌లు ఈత కొట్టేందుకని నదిలోకి దిగారు. కొద్ది సేపటికి ఇద్దరు నీటిలో మునిగిపోయారు. ఒకరినొకరు కాపాడుకునే క్రమంలో మోయిజ్ నీటిలో మునిగి మృతి చెందగా రహమత్ వాగులో గల్లంతు అయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు యాలాల పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మోయిజ్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. రహమత్ ఆచూకి తెలియక పోవడం తో పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించారు. గల్లంతు అయిన రహమత్ కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. సరదా కోసం వచ్చి ఒకరు మృతి చెందడం.. మరొకరు గల్లంతు కావడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

### మియాపూర్ సర్కిల్‌లో అభివృద్ధి పనులను పరిశీలించిన జెడ్సి నారాయణ్ అమిత్

**శేరిలింగంపల్లి, జూన్ 03 (జనంసాక్షి) :**
శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ బుధవారం మియాపూర్ సర్కిల్ పరిధి పెద్దకుడి చెరువు, పటేల్ చెరువు వద్ద కొనసాగు తున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలి ంచారు. అనంతరం జాతీయ రహదారి వెంట మియాపూర్ సర్కిల్‌లోని వివిధ కాలనీల పరిధి లో వర్షపునీరు నిలిచిపోతున్న ప్రాంతాల ను క్షేత్రస్థాయికి వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించా రు. ఈ సందర్భంగా జెడ్సి నారాయణ్ అమిత్ మాట్లాడుతూ డ్రైనేజీ మెరుగుదల పనులను వేగవంతం చేయాలని, నీటి ప్రవాహానికి ఎలాం టి అడ్డంకులు లేకుండా చూడాలని ఇంజనీ రింగ్ విభాగం అధికారులకు తగిన ఆదేశాలను జారీ చేసినట్లు తెలియజేశారు. చెరువుల అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో గా పూర్తి చేయాలని స్పష్టంచేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ విభా గం, శానిటేషన్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంట ఇంజనీరింగ్ అధికారు లు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవాలి: జి.యంలు



**రామగిరి జూన్ 03 (జనంసాక్షి) :**
పర్యావరణాన్ని కాపాడుకోవాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా జూన్1 నుండి 12 వరకు వివిధ సంస్థలకు పర్యావరణం పై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమాన్ని బుధవారం ఆర్ జి-3, ఏపీఏ జిఎం కార్యాలయం నందు నిర్వహించారు.మంథని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దేవదాస్ కార్యాలయ అధికారులకు, ఉద్యోగులకు పర్యావరణం పై అవగాహన కల్పించారు. సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం తమ వంతు బాధ్యతగా ఎన్నో లక్షల మొక్కలను నాటుతుందని అందుకు చాలా సంతోషం గా ఉందని అన్నారు.ఇట్టి కార్యక్రమానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ, ప్రతి సంవత్సరం మొక్కలు నాటాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రతి సంవత్సరం సింగరేణి సంస్థ నాటుతున్న మొక్కల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్వోటుజియంలు బండి సత్యనారాయణ, బి.వి.సత్యనారాయణ, పర్యావరణాధికారి రాజారెడ్డి, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, బి.సుదర్శనం, అఫ్సర్ పాష, రాజేశ్వరి, శ్యామల, అటవీశాఖ అధికారులు మంగీలాల్, శ్రీకాంత్, వరప్రసాద్ తో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# సైక్లింగ్‌తో ఆరోగ్యం.. పర్యావరణానికి రక్షణ

- ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ
- తెలంగాణ చౌక్ నుంచి ఎలగందుల ఖిల్లా వరకు సైక్లిస్టుల సందడి
- సైక్లింగ్‌ను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపు

**కరీంనగర్ బ్యూరో, జూన్ 03 (జనంసాక్షి) :** ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుంచి ఎలగందుల ఖిల్లా వరకు నిర్వహించిన ఈ ర్యాలీని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్‌రెడ్డి తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైక్లింగ్ ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని, దానిని రోజువారీ జీవితంలో భాగంగా చేసుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. సైక్లింగ్ ద్వారా రోజువారీ పనులను మరింత ఉత్సాహంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలైన ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో సైక్లింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సహజ వనరుల సంరక్షణకు కూడా దోహదపడుతున్నారని వివరించారు.
ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌ను అలవాటుగా మార్చుకోవాలని, ఇంధన వినియోగాన్ని తగ్గించి దేశ ఆర్థికాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు బరువు నియంత్రణలో ఉంటుందని తెలిపారు. ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఇది అత్యుత్తమ ఏరోబిక్ వ్యాయామాల్లో ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. సైక్లింగ్ ద్వారా అధిక కేలరీలు ఖర్చవుతాయని వివరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ పట్ల ప్రజల్లో ఆసక్తి పెంచేందుకు అసోసియేషన్ తరఫున అనేక అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి విశేష స్పందన లభించిందని, పాల్గొన్న క్రీడాకారులు, తల్లిదండ్రులు, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జగదీశ్వరాచారి, అరవింద్‌బాబు, మధు, తిరుపతి, మహేందర్, అఖిల్, ఏజే పెడల్స్ ప్రతినిధులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలి

- శాస్త్ర సాంకేతికతను జోడించి రాత్రి వేళల్లో గస్తీ నిరంతరం కొనసాగించాలి
- జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా



**తాండూరు జూన్ 3 (జనంసాక్షి) :**
ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ సేవలను అందించడమే ప్రధాన లక్ష్యంగా వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా, ఐపీఎస్ బుధవారం తాండూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత మరియు సిబ్బంది విధి నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. ముఖ్యంగా స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, హిస్టరీ షీట్లు, ఆర్డర్ బుక్, బీట్ బుక్స్, వారెంట్ల అమలు స్థితిగతులతో పాటు స్వాధీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు , కేసు ప్రాపర్టీల భద్రత వంటి పలు కీలక అంశాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.
అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు మరియు పోలీసులకు-ప్రజలకు మధ్య ఎలాంటి అంతరాలు లేకుండా నిరంతరం అందుబాటులో ఉండే విధంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్‌లో ఎలాంటి రికార్డులను పెండింగ్‌లో పెట్టకూడదని, ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లల రక్షణ మరియు వారిపై జరిగే నేరాల కేసుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉంటూ, ప్రత్యేక నిఘా ఉంచాలని, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శాస్త్ర సాంకేతికతను జోడించి రాత్రి వేళల్లో గస్తీ నిరంతరం కొనసాగించాలని, పాత నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని పేర్కొన్నారు.
రాబోయే ప్రతిష్టాత్మక బోనాలు మరియు మొహర్రం పండుగలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షణపై అధికారులకు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. పట్టణంలోని సమస్యాత్మక, ముఖ్యమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాల నిఘాను మరింత బలోపేతం చేయాలని, జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చే విధంగా పనిచేయాలని సిబ్బందికి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తాండూర్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్ , ఎస్ఐ లు,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

